

APTEL/26/A2902

గ్లోబల్ వార్త

తెలుగు దినపత్రిక




సంపుటి : 01 | సంచిక : 64 | 25 - 10 - 2026 | ఆదివారం | పేజీలు : 8 | వెల : 09 /-

Published In Srikakulam , Vijayanagaram , Vishakapatnam, Araku , Anakapalli , Kakinada , Narasapuram, Amalapuram, Rajamundry, Eluru , Machilipatnam , Vijayawada

షమోండా వైరస్

జంతువుల నుంచి మనుషులకు!



- ఫ్రాన్స్‌లో తొలి మానవ కేసు నమోదు..రోగి మృతి

- వైరస్ వ్యాప్తిపై కొనసాగుతున్న పరిశోధనలు

న్యూఢిల్లీ , అక్టోబర్ 24 (గ్లోబల్ వార్త): కరోనా మహమ్మారి తర్వాత కొత్త వైరస్‌లపై ప్రపంచవ్యాప్తంగా ఆందోళన కొనసాగుతోంది. ఈ నేపథ్యంలో జంతువుల్లో ప్రధానంగా కనిపించే షమోండా వైరస్ మనిషిలోనూ గుర్తించినట్లు వచ్చిన సమాచారం చర్చనీయాంశమైంది. ఫ్రాన్స్‌లో నమోదైన తొలి మానవ కేసులో బాధితుడు మరణించినట్లు అధికారులు వెల్లడించినట్లు కథనం పేర్కొంది. అయితే, ఆ మరణానికి వైరస్ ఒక్కటే కారణమా? వైరస్ మనుషుల మధ్య వ్యాపిస్తుందా? అనే అంశాలపై స్పష్టత రావాల్సి ఉంది. ప్రస్తుతానికి సాధారణ ప్రజలకు తక్షణ ముప్పు ఉందని నిర్ధారించే ఆధారాలు లేవని కథనం తెలిపింది.

మిగతా 8లో...



2లో

పారా అథ్లెట్ల విజయాలు

యువతకు స్ఫూర్తి

న్యూఢిల్లీ , అక్టోబర్ 24 (గ్లోబల్ వార్త) : ఆసియా పారా గేమ్స్--2026లో భారత పారా అథ్లెట్లు అపూర్వ విజయాన్ని సాధించడంపై రాష్ట్రపతి ద్రౌపది ముర్ము హర్షం వ్యక్తం చేశారు. ఈ క్రీడల్లో భారత్ అత్యధికంగా 114 పతకాలు సాధించడం దేశానికి ఎంతో గర్వకారణమని పేర్కొన్నారు. పారా అథ్లెట్ల కఠోర శ్రమ, పట్టు దల, ఆత్మవిశ్వాసమే ఈ అసాధారణ విజ యానికి కారణమని రాష్ట్రపతి

వస్తోంది తుపాను కాదు

అతి తీవ్ర తుపాను : ఏపీలో

- బంగాళాఖాతంలో వాయుగుండం

- అతి తీవ్ర తుపానుగా మారే సూచన

- అక్టోబర్ 28న ఏపీ తీరాన్ని తాకవచ్చని అంచనా

- బాపట్ల-విశాఖపట్నం మధ్య తీరం దాటే అవకాశం

- తీరం దాటే సమయంలో గంటకు 115-125 కి.మీ వేగంతో గాలులు

- ఆంధ్రప్రదేశ్, దక్షిణ ఒడిశా తీరాలకు 'ప్రీ-సైక్లోన్ వాచ్' జారీ



మిగతా 8లో...

అమరావతి , అక్టోబర్ 24 (గ్లోబల్ వార్త) : బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం వాయుగుండంగా మారింది. ఇది వేగంగా బలపడుతూ ఆంధ్రప్రదేశ్ తీరం వైపు దూసు కొస్తోంది. ఇది రానున్న కొద్ది రోజుల్లో 'అతి తీవ్ర తుపాను'గా మారి రాష్ట్రంపై పెను ప్రభావం చూపనుందని భారత వాతావరణ శాఖ (ఐఎండీ) హెచ్చరించింది. అక్టోబర్ 28న బాపట్ల-విశాఖపట్నం మధ్య తీరాన్ని దాటే అవకాశం ఉందని, ఈ నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్, యానాం తీర ప్రాంతాలకు 'ప్రీ-సైక్లోన్ వాచ్' జారీ చేసింది. న్యూఢిల్లీలోని ప్రాంతీయ వాతావరణ కేంద్రం శనివారం విడుదల చేసిన ప్రత్యేక బులెటిన్ ప్రకారం.. ఆగ్నేయ, తూర్పు మధ్య బంగాళాఖాతంలో కేంద్రీకృతమైన అల్పపీడనం వాయుగుండంగా మారింది. ఇది ప్రస్తుతం విశాఖ పట్నానికి ఆగ్నేయంగా 820 కిలోమీటర్లు, కాకినాడకు



8లో

పీసుమామిడి పేలుడు ఘటనపై

జగన్ దిగ్భ్రాంతి

అమరావతి , అక్టోబర్ 24 (గ్లోబల్ వార్త) : అల్లూరి సీతారామరాజు జిల్లాలో ఈ ఉదయం ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. అనంతగిరి మండలం పీసుమామిడి ఘాట్ రోడ్డులో నిర్మాణ పనుల్లో భాగంగా జిలెటిన్ స్టిక్స్ పేలడంతో ఏడుగురు మృతి చెందారు. మృతుల్లో, విధి నిర్వహణకు వెళుతున్న ప్రభుత్వ ఉపాధ్యాయురాలు కూడా ఉండటం తీవ్ర విషాదాన్ని నింపింది. ఈ ఘటనలో ఒక బొలెరో, ఒక టిప్పర్ వాహనాలు పూర్తిగా కాలిపోయాయి. పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం

అమిత్ షా, అశ్వినీ వైష్ణవ్‌లతో చంద్రబాబు భేటీ

రైల్వే, ఐటీ రంగాల్లో కీలక హామీలు

న్యూఢిల్లీ , అక్టోబర్ 24 (గ్లోబల్ వార్త): ఢిల్లీ పర్యటనలో సీఎం చంద్రబాబు, కేంద్ర మంత్రులతో జరిపిన సమావేశాలు ఫలప్రదంగా ముగిశాయి. ముఖ్యంగా రాష్ట్రంలో రైల్వే, ఐటీ రంగాల అభివృద్ధికి సంబంధించి కేంద్ర రైల్వే, ఐటీ శాఖల మంత్రి అశ్వినీ వైష్ణవ్‌తో జరిపిన భేటీలో పలు కీలక హామీలు, ఆమోదాలు లభించాయి. రాష్ట్ర భవిష్యత్‌కు అత్యంత కీలకమైన సెమీకండక్టర్ డిజైన్, ఏఐ రంగాల్లో ఏపీని అగ్రగామిగా నిలిపేందుకు పూర్తిస్థాయిలో సహకరిస్తామని కేంద్ర మంత్రి భరోసా ఇచ్చారు. ఢిల్లీ పర్యటనలో భాగంగా ముఖ్యమంత్రి చంద్రబాబు తొలుత కేంద్ర హోం మంత్రి అమిత్ షాతో మర్యాద పూర్వకంగా భేటీ అయ్యారు. రాష్ట్రానికి సంబంధించిన పలు అంశాలపై ఆయనతో చర్చించారు. అనంతరం కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్‌తో సమావేశమై రాష్ట్ర ప్రగతికి సంబంధించిన కీలక ప్రతిపాదనలను ఆయన ముందుంచారు.





8వ పేజీలో



8లో

పాక్ వల్లే కశ్మీరీలకు రక్షణ

ఫరూక్ అబ్దుల్లా

న్యూఢిల్లీ , అక్టోబర్ 24 (గ్లోబల్ వార్త): నేషనల్ కాన్ఫరెన్స్ (ఎన్‌సీ) అధ్యక్షుడు ఫరూక్ అబ్దుల్లా శనివారం తీవ్రమైన వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. కశ్మీరీలను పాకిస్థాన్ రక్షిస్తోందని ఆయన వ్యాఖ్యానించారు. కశ్మీర్ సమస్యను అంతర్జాతీయ స్థాయిలో ప్రస్తావిస్తూ, ప్రపంచ దేశాల దృష్టిని ఆకర్షించడం ద్వారా కేంద్ర ప్రభుత్వం మౌనం వహించేలా పొరుగు దేశమైన

తుఫాన్ నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలి

అధికారులకు మంత్రి అచ్చెన్నాయుడు కీలక ఆదేశాలు



మిగతా 2లో...

అమరావతి , అక్టోబర్ 24 (గ్లోబల్ వార్త) : బంగాళాఖాతంలో తుఫాన్ ముప్పు నేపథ్యంలో అధికారులను ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అప్రమత్తం చేశారు. మత్స్యకారుల ప్రాణరక్షణే తమ ప్రభుత్వ తొలి ప్రాధాన్యమని పేర్కొన్నారు. ఈరోజు (శనివారం) మత్స్యశాఖ కమిషనర్‌తో ఫోన్‌లో మాట్లాడి తుఫాన్ పరిస్థితులపై మంత్రి అచ్చెన్నాయుడు సమీక్షించారు. ఈ సందర్భంగా అధికారులకు పలు కీలక అంశాలపై దిశానిర్దేశం చేశారు. మత్స్యకారులు ఎట్టి పరిస్థితుల్లోనూ సముద్రంలో వేటకు వెళ్లవద్దని సూచించారు. ఇంకా సముద్రంలోనే ఉన్న 91 బోట్లు.. తక్షణమే వారిని తీరానికి చేర్చాలని అధికారులకు మంత్రి ఆదేశించారు. తీరానికి చేరుకున్న 29,952 మత్స్యకార బోట్లు.. రాష్ట్రవ్యాప్తంగా మొత్తం బోట్ల సంఖ్య 30,043 ఉన్నాయని మంత్రి అచ్చెన్నాయుడు తెలిపారు. సముద్రంలో ఉన్న 91 బోట్లలో 72 మెకనైజ్డ్, 19 మోటరైజ్డ్ బోట్లు ఉన్నట్లు గుర్తించామని అన్నారు. సముద్రంలో ఉన్న బోట్లలో విశాఖపట్నం-37, బాపట్ల-32, కృష్ణా-20, కాకినాడ-1, అనకాపల్లిలో ఒక బోటు ఉందని వెల్లడించారు. కోస్ట్‌గార్డ్, మెరైన్ పోలీసుల సమన్వయంతో మత్స్యకారులను సురక్షితంగా తీసుకురావాలని మార్గనిర్దేశం చేశారు. పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించేందుకు అన్ని తీరప్రాంత జిల్లాల్లో కంట్రోల్ రూమ్‌లను ఏర్పాటు చేయాలని హుకుం జారీ చేశారు. భారీ వర్షాల సూచనతో రైతులు ముందస్తు జాగ్రత్తలు



2లో

కోల్‌కతా ఎయిర్‌పోర్ట్‌లో

మళ్లీ బాంబు కలకలం

రెండో రోజూ అదే టెన్షన్

కోల్‌కతా , అక్టోబర్ 24 (గ్లోబల్ వార్త): నేతాజీ సుభాష్ చంద్రబోస్ అంతర్జాతీయ విమానాశ్రయంలో వరుసగా రెండో రోజూ బాంబు బెదిరింపు తీవ్ర కలకలం రేపింది. ఫుకెట్ - కోల్‌కతా ఇండిగో విమానంలో బాంబు ఉన్నట్లు ఒక సందేశం కనిపించడంతో శనివారం అధికారులు, ప్రయాణికులు తీవ్ర ఆందోళనకు లోనయ్యారు. ఫుకెట్ నుంచి వచ్చిన విమానం కోల్‌కతాలో సురక్షితంగా ల్యాండ్ అయిన అనంతరం, విమానంలోని టాయ్‌లెట్‌ను శుభ్రం చేస్తుండగా అద్దంపై చేతిరాతతో ఉన్న బాంబు బెదిరింపు నోట్‌ను క్యాబిన్ సిబ్బంది గుర్తించారు. వెంటనే అప్రమత్తమైన సిబ్బంది ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు.

ఏబీవీ సలహాలు స్వీకరిస్తా..

అలాంటి పోస్టులను పట్టించుకోను : వంగవీటి రాధా



విజయవాడ , అక్టోబర్ 24 (గ్లోబల్ వార్త): విజయవాడ నగర మేయర్ అభ్యర్థిగా ఎన్డీయే కూటమి తరఫున బరిలో ఉన్న జనసేన నేత వంగవీటి రాధా ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. తన రాజకీయ ప్రత్యర్థి, స్వతంత్ర అభ్యర్థి అయిన ఏబీ వెంకటేశ్వరరావు సలహాలను సైతం నగరాభివృద్ధి కోసం తీసుకుంటానని ఆయన ప్రకటించారు. ఈరోజు మీడియాతో మాట్లా డుతూ, ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు . కొంతమంది సోషల్ మీడియా వేదికగా కమ్మ, కాపు సామాజికవర్గాల మధ్య విభేదాలు సృష్టించేందుకు ప్రయత్నిస్తున్నారని, అలాంటి పోస్టులను తాను అస్సలు పట్టించుకోనని రాధా స్పష్టం చేశారు. ఏబీ వెంకటేశ్వరరావు కేవలం రాజకీయ ప్రత్యర్థి మాత్రమేనని, ఆయనతో తనకు ఎప్పటినుంచో పరిచయం ఉందని తెలిపారు. తాను మేయర్‌గా గెలిస్తే, ఆయన్ను కలిసి నగర అభివృద్ధిపై సలహాలు అడుగుతానని అన్నారు. ''ఏబీ వెంకటేశ్వరరావు గారి దగ్గర సలహాలు తీసుకుంటాను. ఆయనకు మంచి అవగాహన, అనుభవం ఉన్నాయి'' అని తెలిపారు. విజయవాడ నగరంలో తాగునీటి సమస్య పరిష్కారం, ఇతర ప్రజా సమస్యలపై దృష్టి సారించడమే తన ప్రధాన లక్ష్యమని రాధా తెలిపారు. ఒక ఎమ్మెల్యే కేవలం ఒక నియోజక వర్గానికే పరిమితం అవుతారని, కానీ నగరంలోని మూడు నియోజకవర్గాలతో మేయర్‌కు సంబంధాలు ఉంటాయని, అభివృద్ధి పనులను ముందుకు తీసుకెళ్లడంలో కీలక పాత్ర పోషిస్తారని వివరించారు. గతంలో రెండుసార్లు ఎమ్మెల్యేగా పోటీ చేయలేదని గుర్తుచేసిన రాధా, ఇప్పుడు కూటమిలోని అన్ని పార్టీల నేతల మద్దతుతో మేయర్ అభ్యర్థిగా బరిలోకి దిగుతున్నానని, నగరాభివృద్ధి కోసం చిత్తశుద్ధితో పనిచేస్తానని విశ్వాసం వ్యక్తం చేశారు.


APTEL/26/A2902

గ్లోబల్ వార్త
తెలుగు దినపత్రిక

సంపాదకీయం

ఎల్‌నినోతోనైనా కర్లు తెరుద్దాం!

ఈ ఏడాది దేశంలో ఖరీఫ్ వర్షపాతం 13శాతం తగ్గిందని అంచనా. తెలుగు రాష్ట్రాలు, ఇంకా కొన్ని చోట్ల ఇది 18 – నుంచి 25శాతం ఉండొచ్చు. ఉత్తర కర్ణాటక వంటి వర్షాభావ, మెట్టప్రాంతాలు ఇంకా ఇబ్బందుల్ని ఎదుర్కోవచ్చు. తెలంగాణాలో 10 లక్షల ఎకరాల్లో వరి ఎండిపోయే అవకాశం ఉంది. ఈ ఏడాది సూపర్ ఎల్‌నినో వల్ల 30 లక్షల టన్నులు తగ్గుతాయని అంటున్నారు. అంటే 1 శాతమే కాబట్టి ఆహారపరంగా భయపడనక్కర్లేదు. మన దేశంలో సాగునీటి ప్రాజెక్టుల పట్ల శ్రద్ధ వల్ల సుమారు 60 శాతం పంట భూములకు నికర నీటి వసతి అందుబాటులోకొచ్చింది. రెండు పంటలైతే 73 నుంచి 75 శాతం ఉన్నట్లు. కానీ నీరు అందుబాటు, ఎప్పుడో కరవు కాలంలో ప్రవేశపెట్టిన ఎంఎన్‌పీ పద్ధతిని ఇంకా కొనసాగించటం, ఉచిత విద్యుత్ వల్ల.. డిమాండ్ తగ్గుతున్న వరి పండించే ఆనవాయితీ నుంచి ఇంకా మనం బయటపడలేదు. తెలంగాణలో చిన్న నీటి, ఎత్తిపోతల పథకాల బదులు భారీ, అసంబద్ధ ప్రాజెక్టుల్ని కట్టటం తీవ్ర అభ్యంతరకరమైనా.. రుతుపవనాలపై ఆధారపడ్డ దేశంగా నీటి రిజర్వాయర్లు, బ్యారేజీలు అవసరం. ప్రస్తుతం తెలంగాణలో 62 శాతం నికర నీటి వసతి పొలాలకు ఉంది. కానీ ప్రజలు అన్నం తగ్గించి, గుడ్లు, మాంసం, చిరుధాన్యాలు, పప్పులు, కూరగాయలు, పండ్లు, పాలు, పెరుగు వంటివి ఎక్కువ ఉపయోగిస్తున్నా.. నీటి వనరులున్నాయి గదా అని వరి ఎక్కువగా పండిస్తున్నాం. డిమాండ్ లేని వరి సాగు వద్దన్న వారిని తిట్టిపోస్తున్నాం. దీనివల్ల రాష్ట్రం ఏర్పడినప్పుడు 44 లక్షల టన్నులున్న వరి ఉత్పత్తి.. గత ఏడాది 1 కోటీ 75 లక్షలకి చేరింది. 400శాతం పెరిగింది. ఆంధ్రప్రదేశ్‌లో పన్నెండేళ్ల క్రితం వరి దిగుబడి 72 లక్షల టన్నులుంటే, ఇప్పుడు 81 లక్షల టన్నులకి పెరిగింది. అంటే 10 శాతం దాకా. ఏపీలో నికర నీటి వసతి ఎక్కువనుకుంటాంగానీ.. రాజస్థాన్‌తో సమానంగా 52 శాతం మాత్రమే. అయితే డిమాండ్ ఉన్న పండ్లు, కూరగాయలు, ఇతర ఉద్యానవన పంటల దిగుబడి తెలంగాణలో తగ్గగా, ఏపీలో భారీగా పెరిగింది. ఏపీలో 1.4 కోట్ల టన్నుల నుంచి 2.8 కోట్ల టన్నులకు, యూపీలో గత పదేళ్లలో 3.3 కోట్ల టన్నుల నుంచి 5.3 కోట్ల టన్నులకు, మహారాష్ట్రలో 1.8 కోట్ల టన్నుల నుంచి 3.3 కోట్ల టన్నులకు ఉద్యాన దిగుబడి పెరిగింది. తెలంగాణలో 83 లక్షల టన్నుల నుంచి 30 లక్షలకు తగ్గింది. వ్యవసాయంలోని మరో అంశం విద్యుత్తు. భూగర్భ జలాలు ఎండిపోవటం వల్ల తెలంగాణలోని 30 లక్షల బోర్లతో ఉచిత విద్యుత్ వినియోగం పెరగటం తప్ప నీరు రావటం లేదు. దీంతోపాటు, ఇళ్లలోనూ ఫ్యాన్లు, ఏసీల వినియోగం పెరగటంతో.. రాష్ట్రంలో విద్యుత్ వినియోగం గత సంవత్సరం అక్టోబర్‌లో 15,000 మెగావాట్లుండగా, ఈ ఏడాది 20,000 మెగావాట్లకి పెరిగింది. ఇందులో 25 నుంచి 27 శాతం రైతుల ఉచిత విద్యుత్ ఖాతాలోకి పోతోంది. మీటర్లు బిగించకపోవటం వల్ల రైతుల పేరుతో ఇతరులు దుర్వినియోగం చేస్తున్నారన్న ఆరోపణలూ ఉన్నాయి. విద్యుత్‌కు యూనిట్ రూ.15 ఇస్తానన్నా మార్కెట్‌లో దొరకటం లేదని ముఖ్యమంత్రి వాపోతున్నారు. మనం కూడా పౌరులుగా ఇళ్లలో విద్యుత్‌ను పొదుపుగా ఉపయోగించుకోవటం వంటి మార్గాల్లో సహకరించాలి. సూపర్ ఎల్‌నినో ప్రభావిత ఇంకో అంశం తాగునీరు. హైదరాబాద్‌నే తీసుకుందాం. లండన్, టోక్యో వంటి మహానగరాల కంటే ఎక్కువ నీటి సరఫరా జరుగుతోంది. హైదరాబాద్‌కి రోజుకి 260 కోట్ల లీటర్లు. అంటే, తలసరి 210 లీటర్లు. మన అవసరం 135 లీటర్లు. అయినా మంచినీటికి కటకట. లండన్‌లో 135 లీటర్లు, బెర్లిన్‌లో 110, టోక్యోలో 170, డాలస్‌లో 204 లీటర్లు మాత్రమే తలసరి సరఫరా చేస్తున్నారు. ఈ నగరాలన్నిటిలోనూ 24 గంటలూ తాగునీరు అందిస్తున్నారు. హైదరాబాద్‌లో 210 లీటర్లు ఇస్తున్నా, రెండురోజులకోసారి కొద్ది గంటలు వస్తే అదృష్టమనుకునే ప్రాంతాలు చాలా ఉన్నాయి. నగరం నడిబొడ్డున ఉన్న ప్రాంతంలో కూడా మంచినీటికి కటకట. ఇందుకు కారణం, 'మనం మంచినీరు తెస్తున్నాం, పంపిణీ వ్యవస్థను నిర్లక్ష్యం చేశాం. సంపన్నులకీ ఉచితంగా మంచినీరు ఇస్తున్నాం'. జూబ్లీహిల్స్, బంజారాహిల్స్‌లో ఉచితంగా తాగునీరు ఎవరిమ్మన్నారు? మన సొంత సొమ్మయితే అలా ఖర్చు చేస్తామా? ఇది కాక 50శాతం మూసీలో కలిసిపోతోంది. మంచినీరు, మురుగునీరు కలసి ప్రవహిస్తున్నాయి. హైదరాబాద్‌కి అదనంగా 50 మిలియన్ గ్యాలన్లు మంచినీరు తెస్తామని ప్రభుత్వం చెబుతోంది. కానీ అంతకంటే ముఖ్యం తాగునీటి పంపిణీ వ్యవస్థను బాగుచేసి 24 గంటలూ మంచినీరు అందించటం. పైప్‌లలో తాగునీరు నిరంతరం ప్రవహిస్తుంటే, మురుగునీరు కలిసే అవకాశాలు తక్కువ. పొరుగున ఉన్న చెన్నైకి హైదరాబాద్‌లా గోదావరి, కృష్ణా వంటి పెద్ద నదుల ద్వారా తాగునీటి అవకాశం లేదు. కొన్నేళ్ల క్రితం రైళ్లలో తాగునీరు తెప్పించుకున్నారు. కానీ నీటి నిల్వ, పంపిణీని సమర్థంగా బాగుచేసుకోవటంతో ఇప్పుడు మండు వేసవిలోనూ మంచినీటి కొరత లేదు. హైదరాబాద్ నగరం కోసం కృష్ణా, గోదావరి నదుల నుంచి రోజూ 260 కోట్ల లీటర్ల నీటిని తోడి తెస్తున్నాం. అయినా నీటి పంపిణీ లోపం వల్ల నీళ్ళ కొరత మనల్ని ఇబ్బంది పెడుతోంది. బెంగళూరు జనాభా హైదరాబాద్ కంటే ఎక్కువ. అయినా ఆ నగరంలో 160 కోట్ల లీటర్ల సరఫరాతో మన కంటే బాగా నీటిని పంపిణీ చేస్తున్నారు. రోజూ 120 కోట్ల లీటర్ల నీటిని చెన్నైలో సరఫరా చేస్తున్నారు. అయినా సంక్షోభం, కొరత లేకుండా నీటిని సరిగ్గా పంపిణీ చెయ్యగలుగుతున్నారు. హైదరాబాద్ నీటి సమస్య ప్రధానంగా పంపిణీ వ్యవస్థ శిథిలమైపోవటం వల్ల ఉత్పన్నమయింది. ప్రస్తుత వర్షాభావం రీత్యా రైతులు ఆందోళన చెందకుండా రెండో పంటగా అపరాలు, నూనె గింజలకి లేదా క్రాప్ హాలిడేకి నచ్చచెప్పటం, లాభాలొచ్చేలా మార్కెటింగ్ వ్యవస్థలో తగిన ఏర్పాట్లు, భరోసానిచ్చే ప్రత్యామ్నాయాలు చూపుతూ వరి పంట సాగుని తగ్గించటం, ఉద్యానవన, తృణధాన్యాలు వంటి ప్రజారోగ్యానికి మేలుచేసే, డిమాండున్న పంటలకు ప్రోత్సాహకాలు, పెట్టుబడి వ్యయానికి తగిన రుణసదుపాయాలు, ఉచిత విద్యుత్‌కు మీటర్లు బిగించి బాధ్యత కోసం కొద్దిపాటి రుసుము వసూలు చేయటం వ్యవసాయంలో యుద్ధప్రాతిపదికన చేయాల్సిన పనులు. అధిక వర్షపాతాన్ని ఒడిసిపట్టేలా హేతుబద్ధ ప్రాజెక్టుల్ని పెంచాలి. చెరువులు, ఇతర సంప్రదాయ నీటి వసతుల్ని కాపాడుకోవాలి. పప్పు దినుసులు, పామాయిల్, ఇతర వంటనూనెలపై దిగుమతి సుంకం నిలకడగా కొనసాగించి, ఆ డబ్బు రైతులకే అందించి ఏపీ, తెలంగాణల్లో పెరుగుతున్న సాగును ఇంకా ప్రోత్సహించాలి. ప్రస్తుతం ప్రపంచంలోనే అత్యధికంగా మలేసియా, ఇండోనేసియా నుంచి 20 నుంచి 30 బిలియన్ డాలర్లను ఖర్చుపెట్టి వంటనూనె దిగుమతి చేసుకుంటున్నాం. తెలంగాణకు నీటి సరఫరా చేసే కృష్ణాలో ఈ సీజన్‌లో 72 శాతం లోటు, గోదావరిలో 42 శాతం లోటు ఏర్పడింది. 460 టీఎంసీల అవసరం ఉండగా, కేవలం 209 టీఎంసీలు ఉన్నాయి. తాగునీరు తొలి ప్రాధాన్యం కాబట్టి ఈ ప్రత్యేక పరిస్థితుల్లో రైతులు కూడా సహకరించాలి. యూరియా బస్తా ఖరీదు రూ.4,600 అయినా రైతులకు ప్రభుత్వం కేవలం రూ.266కి ఇస్తోంది. కాబట్టి, ప్రతిదానికీ ప్రభుత్వాన్ని విమర్శించటం తగదు.



ఎడిటర్ : దొండ్లవాగు భవ్య

దెబ్బ వీధిలో కూటమి ఎన్నికల ప్రచారం



అనకాపల్లి , అక్టోబర్ 24 (గ్లోబల్ వార్త): పట్టణంలోని 108వ కూటమి విజయానికి విస్తృత ప్రచారం జరిగింది ఉదయం ఏడు గంటలకు టిడిపి జనసేన బిజెపి కూటమి అభ్యర్థి సిందుజ ప్రచార కార్యక్రమం దెబ్బ వీధిలో సాగింది ముందుగా శ్రీ వరాహ లక్ష్మీనరసింహస్వామి వారి దర్శించుకుని తీర్థ ప్రసాదం స్వీకరించి అనంతరం వార్డులో డోర్ టు డోర్ ప్రచారం చేశారు మహిళలు యువకులు కూటమి అభ్యర్థికి స్వాగతం పలికారు.రాష్ట్ర గౌరవ కార్పొరేషన్ చైర్మన్ మల్ల సురేంద్ర కొణతాల పూర్ణచంద్రరావు శ్రీ వరాహ లక్ష్మీనరసింహస్వామి గౌరవ అధ్యక్షులు దొడ్డి బాబు చైర్మన్ ఆళ్ళ రామచంద్ర తెలుగుదేశం పార్టీ ముఖ్య నాయకులు మల్ల రామకృష్ణ మల్ల గణేష్ మాజీ కౌన్సిలర్ పివి జగన్ మోహన్ రావు, కొణతాల శ్రీనివాస్ రావు మల్ల మోహన్ దాడి వేణు బిజెపి నాయకులు శేషగిరి జనసేన నాయకులు విల్లూరి హరికృష్ణ,బొడ్డేడ సంతోష్,కొణతాల మనోహర్ నాయుడు గారి కుటుంబ సభ్యులు రామ్ రఘురాం మహిళా పొదుపు సంఘం తరఫున శాంతి కుమారి దాడి లక్ష్మి గుండ్రని భవాని కేటరర్స్ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు

అర్ధరాత్రి తుపాను నేపథ్యంలో ఏపీఈపీడీసీఎల్ అప్రమత్తం

విశాఖ , అక్టోబర్ 24 (గ్లోబల్ వార్త): బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం వాయుగుండంగా మారి అనంతరం తుపాను మారే అవకాశం ఉన్నట్లు వాతావరణ శాఖ పేర్కొంది. దీని ప్రభావంతో ఈనెల 26 నుంచి భారీ వర్షాలు, ప్రచండ గాలులు వీచే అవకాశం ఉన్న నేపథ్యంలో ఎలాంటి అత్యవసర పరిస్థితులనైనా సమర్థంగా ఎదుర్కొనేందుకు అప్రమత్తంగా ఉండాలని ఆంధ్రప్రదేశ్ తూర్పు ప్రాంత విద్యుత్ సంపిణీ సంస్థ (ఏపీఈపీడీసీఎల్) చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ ఇమ్మడి పృథ్వీతేజ్ అధికారులను ఆదేశించారు. తుపాను పరిస్థితులపై టెలికాన్ఫరెన్స్ ద్వారా 12 జిల్లాల సర్కిల్ సూపరింటెండింగ్ ఇంజినీర్లు, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు, ఇతర సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు.విద్యుత్ వ్యవస్థ పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ అవసరమైన ముందస్తు చర్యలు చేపట్టాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం, విశాఖపట్నం, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు, కాకినాడ, డా. బి.ఆర్. అంబేద్కర్ కోన సీమ, తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి, ఏలూరు, పోలవరం జిల్లాల్లో విద్యుత్ వ్యవస్థను నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. తుపాను ప్రభావంతో భారీ వర్షాలు, ఈదురుగాలుల కారణం గా ఎక్కడైనా విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడితే వెంటనే పునరుద్ధరణ చర్యలు చేపట్టేందుకు సిబ్బంది, వాహనాలు, విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లు, ఇతర అవసరమైన సామగ్రిని సిద్ధంగా ఉంచాలని అధికారులను ఆదేశించారు. విద్యుత్ పునరుద్ధరణ చర్యలను వేగవంతం చేసేందుకు ఏపీఈపీడీసీఎల్ కార్పొరేట్ కార్యాలయం నుంచి పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ, సంబంధిత అధికారులతో సమీక్షలు నిర్వహించేందుకు అవసరమైన ఏర్పాట్లు చేసామని సీఎండీ తెలిపారు. అలాగే, తుపాను ప్రభావంతో తెగిపడిన విద్యుత్ వైర్లు, వాలిపోయిన విద్యుత్ స్తంభాలు, విద్యుత్ లైన్లపై పడిన చెట్ల కొమ్మల సమీపంలోకి వెళ్లరాదని వినియోగదారులకు సూచించారు. విద్యుత్ అంతరాయాలు, అత్యవసర పరిస్థితులకు సంబంధించిన సమాచారాన్ని టోల్ ఫ్రీ నంబర్ 1912 లేదా సంబంధిత కంట్రోల్ రూమ్ నంబర్లకు తెలియజేసి సహకరించాలని కోరారు. జిల్లాల వారీగా కంట్రోల్ రూమ్ నంబర్లు

శ్రీకాకుళం
శ్రీకాకుళం – 9701400865, టెక్కలి – 9490610050, పలాస – 08945241084

పార్వతీపురం మన్యం
పాలకొండ -- 8332843546, పార్వతీపురం -- 9398594750

విజయనగరం
విజయనగరం టౌన్ -- 9490610102, విజయనగరం రూరల్ -- 9490610102, బొబ్బిలి -- 9490610121

విశాఖపట్నం
జోన్ - I -- 9490610019 , జోన్ - II -- 9849628880 , జోన్- III -- 9491030722

అనకాపల్లి
అనకాపల్లి -- 9063110544 , కశింకోట -- 8333810597 , నర్సీపట్నం -- 9491030723

అల్లూరి సీతారామరాజు (ASR)
పాడేరు -- 9490610027

కాకినాడ
జగ్గంపేట -- 9490610097 , కాకినాడ -- 9490610856 , పెద్దాపురం -- 9493178728

తూర్పు గోదావరి
రాజమహేంద్రవరం టౌన్ -- 9490610855 , రాజమహేంద్రవరం రూరల్ -- 9493178874, నిడదవోలు -- 9493177540

డా. బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ
అమలాపురం -- 9490610101 , కొత్తపేట -- 9493178821

పశ్చిమ గోదావరి
నరసాపురం -- 7382050943, భీమవరం -- 9490610143, తాడేపల్లిగూడెం -- 9493177806

ఏలూరు
ఏలూరు -- 9440904037 , జంగారెడ్డిగూడెం -- 9491030712

పోలవరం
రంపచోడవరం -- 8309771508 , ఏపీఈపీడీసీఎల్ కార్పొరేట్ కార్యాలయం -- 8331018762

ఎంపీటీసీ నామినేషన్ల పరిశీలన పూర్తి

కవిటి , అక్టోబర్ 24 (గ్లోబల్ వార్త): కవిటి మండలంలో ఎంపీటీసీ స్థానాలకు దాఖలైన నామినేషన్ల పరిశీలన ప్రక్రియ శనివారం పూర్తయింది. మండలంలోని 22 ఎంపీటీసీ స్థానాలకు మొత్తం 119 నామినేషన్లు దాఖలుకాగా, అధికారులు వాటిని పరిశీలించి అభ్యర్థులందరికీ గ్రీన్ సిగ్నల్ గా వివరాలను వెల్లడించారు.దాఖలైన నామినేషన్లలో వైఎస్సార్‌సీపీ నుంచి 54, తెలుగుదేశం పార్టీ నుంచి 46, జనసేన నుంచి 11, భారతీయ జనతా పార్టీ నుంచి 3, స్వతంత్ర అభ్యర్థులుగా 5 నామినేషన్లు ఉన్నాయి. ప్రధాన పార్టీల నుంచి పెద్ద సంఖ్యలో నామినేషన్లు దాఖలు కావడంతో మండలంలో ఎన్నికల సందడి నెలకొంది.ఈ నెల 27వ తేదీ వరకు నామినేషన్ల ఉపసంహరణకు గడువు ఉండటంతో అభ్యర్థుల తుది జాబితాపై ఆసక్తి నెలకొంది. ఉపసంహరణ ప్రక్రియ అనంతరం ప్రధాన పార్టీల అభ్యర్థులెవరు బరిలో నిలుస్తారన్నది స్పష్టత రానుంది.

పసుపు జెండా వైపు వైకాపా నేతల చూపు



కోటబొమ్మాళి , అక్టోబర్ 24 (గ్లోబల్ వార్త): నందిగాం మండలంలో వైకాపాకు చెందిన నాయకులు తెలుగుదేశం పార్టీలో చేరారు. దేవుపురం గ్రామ పంచాయతీ పరిధిలోని పాలవలసపేట గ్రామానికి చెందిన 15 మంది వైకాపా కుటుంబాలు రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు సమక్షంలో టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. మంత్రి అచ్చెన్నాయుడు వారిని సాదరంగా ఆహ్వానించి పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా కర్రుకోల లక్ష్మునాయుడు, కర్రుకోల జనార్ధనరావు, కర్రుకోల కామేశ్వరరావు (మాజీ ఎంపీటీసీ), కర్రుకోల రామకృష్ణ, కర్రుకోల షణ్ముఖరావు, కర్రుకోల వాసుదేవరావు, కర్రుకోల శ్రీనిల్, కర్రి మహిమారావు, కర్రి సుధాకరరావు, కర్రి సతీష్ కుమార్, పిన్నెల కోనలేశన్, గుంట కవిరావు, తారసి బాలకృష్ణ, బొనమిడి కృష్ణ, కర్రుకోల కృష్ణరావు, కర్రుకోల జయరావు తదితరులు తెలుగుదేశం పార్టీలో చేరారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల పట్ల ఆకర్షితులై వైకాపా నాయకులు టీడీపీలో చేరినట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. కొత్తగా పార్టీలో చేరిన నాయకులు, కార్యకర్తలకు సముచిత ప్రాధాన్యం కల్పిస్తూ, పార్టీ బలోపేతానికి సమష్టిగా కృషి చేయాలని ఈ సందర్భంగా సూచించారు. సీనియర్ నాయకుడు అజయ్ కుమార్, చంద్రశేఖర్, తదితరులు ఉన్నారు

ఎన్నికల విధుల పేట్ల దివ్యాంగ ఉద్యోగుల ఆవేదన

విజయవాడ , అక్టోబర్ 24 (గ్లోబల్ వార్త): ఆంధ్రప్రదేశ్ స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో దివ్యాంగ ఉద్యోగులకు ఎన్నికల విధుల నుంచి మినహాయింపు కల్పించే విషయంలో క్షేత్రస్థాయిలో అధికారులు వ్యవహరిస్తున్న తీరుపై రాష్ట్రవ్యాప్తంగా తీవ్ర ఆవేదన వ్యక్తమవుతోందని దివ్యాంగ ఉద్యోగుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎ. శ్రీనివాసరావు ఆందోళన వ్యక్తం చేశారు. దివ్యాంగుల ఎన్నికల విధుల మినహాయింపు అభ్యర్థనలను కొందరు రిటర్నింగ్ అధికారులు తిరస్కరిస్తుండగా, మరికొన్ని మున్సిపల్ కార్యాలయాల్లో కనీసం వినతిపత్రాలను స్వీకరించడం లేదని ఉద్యోగుల నుంచి ఫిర్యాదులు అందుతున్నాయని తెలిపారు. (SEC) . 863/SEC-F1/2026, 3 17-10-2026 దివ్యాంగులకు ఎన్నికల విధుల నుంచి సాధ్యమైనంతవరకు మినహాయింపు కల్పించాలని సంబంధిత అధికారులకు సూచించినప్పటికీ, క్షేత్రస్థాయిలో ఆ సూచనలు సక్రమంగా అమలుకాకపోవడం విచారకరమన్నారు. దివ్యాంగ ఉద్యోగులను కార్యాలయాల చుట్టూ తిప్పడం, వారి వినతులను తిరస్కరించడం అన్యాయమని పేర్కొంటూ, రాష్ట్ర ఎన్నికల సంఘం వెంటనే స్పందించి అన్ని జిల్లాల కలెక్టర్లు, ఎన్నికల అధికారులు, రిటర్నింగ్ అధికారులు, మున్సిపల్ కమిషనర్లకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేయాలని డిమాండ్ చేశారు. దివ్యాంగ ఉద్యోగుల వైకల్య స్వభావం, ఆరోగ్య పరిస్థితి, విధులు నిర్వహించడంలో ఎదురయ్యే ఇబ్బందులను పరిగణనలోకి తీసుకొని వారి అభ్యర్థనలను సానుభూతితో పరిశీలించాలని కోరారు. ఎన్నికల నిర్వహణ ఎంత ముఖ్యమో, దివ్యాంగ ఉద్యోగుల ఆత్మగౌరవం, హక్కులు, ఇబ్బందులను గౌరవించడం కూడా అంతే ముఖ్యమని ఆయన స్పష్టం చేశారు.

పారా అథ్లెట్ల విజయాలు యువతకు స్ఫూర్తి

ఒకటి తరువాయి

ప్రశంసించారు. వారి విజయాలు యువతకు స్ఫూర్తినిస్తాయని తెలిపారు. ఎన్ని పరిమితులు ఎదురైనా వెనుకడుగు వేయకుండా పెద్ద లక్ష్యాలను నిర్దేశించుకోవాలని, అంకితభావంతో కృషి చేస్తూ సానుకూల దృక్పథంతో ముందుకు సాగాలని యువతకు ఈ విజయాలు సందేశమిస్తున్నాయని పేర్కొన్నారు. భారత బృందంలోని అథ్లెట్లందరికీ మరోసారి హృదయపూర్వక అభినందనలు తెలియజేస్తున్నట్లు రాష్ట్రపతి ముర్ము వెల్లడించారు.

కోల్‌కతా ఎయిర్‌పోర్ట్‌లో మళ్లీ బాంబు కలకలం

ఒకటి తరువాయి

దీంతో రంగంలోకి దిగిన భద్రతా దళాలు తక్షణమే ప్రయాణికులందరినీ విమానం నుంచి సురక్షితంగా దించివేశాయి. అనంతరం విమానాన్ని ఐసోలేషన్ బేకు తరలించి, సీఐఎస్ఎఫ్, బాంబ్ స్క్వాడ్, ఎయిర్‌పోర్ట్ పోలీసులు సంయుక్తంగా క్షుణ్ణంగా తనిఖీలు చేపట్టారు. గంటల తరబడి సాగిన ఈ సోదాల్లో ఎటువంటి అనుమానాస్పద వస్తువులు గానీ, పేలుడు పదార్థాలు గానీ లభించలేదని అధికారులు ధ్రువీకరించారు. కేవలం భయాందోళనలు సృష్టించేందుకే గుర్తుతెలియని వ్యక్తులు ఈ చర్యకు పాల్పడి ఉండవచ్చని వారు అనుమానిస్తున్నారు. కాగా, శుక్రవారం కూడా విమానాశ్రయ ప్రాంగణంలోని మహిళల వాష్‌రూమ్‌లో ఇలాంటిదే ఒక బెదిరింపు లేఖ లభించింది. అయితే ఆ ఘటనలో కూడా అది బూటకపు బెదిరింపుగానే తేలింది. కేవలం 24 గంటల వ్యవధిలోనే రెండుసార్లు ఇటువంటి ఘటనలు చోటుచేసుకోవడంతో విమానాశ్రయ అధికారులు భద్రతను మరింత కట్టుదిట్టం చేశారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు, ప్రయాణికుల జాబితాను, సీసీటీవీ ఫుటేజీలను పరిశీలిస్తూ బెదిరింపు నోట్ రాసిన వ్యక్తిని గుర్తించే పనిలో నిమగ్నమయ్యారు.

తుఫాన్ నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలి

ఒకటి తరువాయి

పాటించాలని మంత్రి అచ్చెన్నాయుడు ఆదేశించారు. కోత దశలో ఉన్న పంటలు, కోసిన ధాన్యం తడవకుండా సురక్షిత ప్రాంతాలకు అన్నదాతలు తరలించాలని సూచించారు. పొలాల్లో వర్షపు నీరు నిల్వ ఉండకుండా ముందస్తుగా కాలువలు సిద్ధం చేసుకోవాలని ఆదేశించారు. గాలుల తీవ్రతకు నేలకొరగకుండా అరటి, బొప్పాయి తోటలకు సరైన ఆధారాలు ఏర్పాటు చేసుకోవాలని దిశానిర్దేశం చేశారు. ఆక్వా రైతులు చెరువుల గట్లు, నీటి పారుదల వ్యవస్థలు, విద్యుత్ భద్రతపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉంటూ రైతన్నలకు సాంకేతిక సూచనలు ఇవ్వాలని అధికారులకు మంత్రి అచ్చెన్నాయుడు ఆదేశాలు జారీ చేశారు.

చింతూరులో రేషన్ డీలర్లకు క్యూఆర్ కోడ్ స్కానింగ్‌పై శిక్షణ



చింతూరు , అక్టోబర్ 24 (గ్లోబల్ వార్త): పోలవరం జిల్లా జాయింట్ కలెక్టర్ (సివిల్ సప్లై) ఆదేశాల మేరకు చింతూరు డివిజన్ పరిధిలోని నాలుగు మండలాల రేషన్ షాపుల (ఎఫ్‌పీ షాపుల) డీలర్లకు క్యూఆర్ కోడ్ స్కానింగ్‌పై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. చింతూరులోని ఏపీఆర్ఎస్ బాలుర హాస్టల్‌లో డీఎస్ఓ కార్యాలయ సిబ్బంది ఆధ్వర్యంలో ఈ శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా రేషన్ డీలర్లకు క్యూఆర్ కోడ్ మొబైల్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకునే విధానం, క్యూఆర్ కోడ్‌లను స్కాన్ చేసే పద్ధతి, క్యూఆర్ కోడ్ గోనె సంచుల స్కానింగ్ యాప్ ఇన్‌స్టాలేషన్‌తో పాటు స్కానింగ్ ప్రక్రియపై అవగాహన కల్పించారు. రేషన్ పంపిణీ ప్రక్రియలో క్యూఆర్ కోడ్ స్కానింగ్‌ను సక్రమంగా నిర్వహించేందుకు అవసరమైన సాంకేతిక అంశాలను డీలర్లకు వివరించారు. ఈ శిక్షణ కార్యక్రమంలో డీఎస్ఓ కార్యాలయ సిబ్బంది మోహన్‌రావు, ఈపాస్ టెక్నీషియన్ రఘు తదితరులు పాల్గొన్నారు.

పకడ్బందీగా స్థానిక సంస్థల ఎన్నికల ఏర్పాట్లు, భద్రతా చర్యలు

ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి డాక్టర్ జి.లక్ష్మీశ





విజయవాడ , అక్టోబర్ 24 (గ్లోబల్ వార్త): స్థానిక సంస్థల ఎన్నికలను ప్రశాంత, పారదర్శక, నిష్పక్షపాత వాతావరణంలో నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగం అన్ని రకాల ముందస్తు ఏర్పాట్లను పకడ్బందీగా పూర్తి చేసిందని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ మరియు జిల్లా ఎన్నికల అధికారి డాక్టర్ జి.లక్ష్మీశ తెలిపారు. విజయవాడ జిల్లా పరిషత్ కార్యాలయంలో జరుగుతున్న జడ్పీటీసి అభ్యర్థుల నామినేషన్ల ప్రక్రియను జిల్లా కలెక్టర్ లక్ష్మీశ శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. అభ్యర్థులకు ఏమైనా సందేహాలు ఉంటే ఇక్కడే అడిగి తెలుసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ, నామినేషన్ల ప్రక్రియ, హెల్ప్ డెస్క్‌లు, నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ పారదర్శకంగా జరిగేలా ప్రతి కేంద్రం వద్ద నిరంతర వీడియోగ్రఫీ పర్యవేక్షణను ఏర్పాటు చేశాం అన్నారు. నామినేషన్ దాఖలు చేసే అభ్యర్థులకు ఏవైనా సందేహాలు ఉంటే మార్గదర్శనం చేసేందుకు ప్రతి కేంద్రం వద్ద ప్రత్యేకంగా 'హెల్ప్ డెస్క్ సదుపాయాన్ని అందుబాటులో ఉంచామన్నారు. అభ్యర్థులు స్వేచ్ఛగా నామినేషన్ దాఖలు చేసుకునేందుకు పూర్తి భద్రత కల్పిస్తున్నాం అన్నారు. ఎవరైనా నామినేషన్ల దాఖలుకు వెళ్లే అభ్యర్థులను అడ్డుకున్నా లేదా ఇబ్బందులకు గురిచేసినా వెంటనే కలెక్టరేట్ కంట్రోల్ రూమ్ నెంబర్ 9154970454, పోలీస్ కంట్రోల్ రూమ్ లేదా సంబంధిత రిటర్నింగ్ అధికారుల దృష్టికి తీసుకురావచ్చు అన్నారు. అడ్డంకులు సృష్టించే వ్యక్తులపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఓటర్లు తమ ఓటు హక్కును సౌకర్యవంతంగా వినియోగించుకునేలా జిల్లా వ్యాప్తంగా అన్ని పోలింగ్ కేంద్రాలలో 'నిర్దేశిత కనీస వసతులు' తాగునీరు, విద్యుత్, షామియానా, ర్యాంప్ వంటి అన్ని సౌకర్యాలు కల్పించడం జరిగిందన్నారు. గత ఎన్నికల పరిస్థితులను పరిశీలించి సమస్యాత్మక ప్రాంతాలుగా గుర్తించిన పోలింగ్ కేంద్రాలపై ప్రత్యేక దృష్టి సారించాం అన్నారు. అక్కడ అదనపు పోలీసు బలగాల మోహరింపు, సీసీటీవీ కెమెరాలు, వెబ్‌కాస్టింగ్ ద్వారా నిరంతర నిఘా కొనసాగుతుందన్నారు. పోలింగ్ ముగిసిన అనంతరం ఈవీఎంలను భద్రపరిచేందుకు స్ట్రాంగ్ రూమ్‌లు, అలాగే ఓట్ల లెక్కింపు ప్రక్రియ కోసం కౌంటింగ్ కేంద్రాల వద్ద విస్తృత భద్రతా ఏర్పాట్లతో పాటు అవసరమైన అన్ని సదుపాయాలను సిద్ధం చేశామన్నారు. ఎన్నికల నియమావళిని ప్రతి ఒక్కరూ తూచా తప్పక పాటించాలని, ఎన్నికలు విజయవంతంగా ముగిసేందుకు ప్రజలు, అభ్యర్థులు, రాజకీయ పార్టీల ప్రతినిధులు సహకరించాలని జిల్లా కలెక్టర్ పిలుపునిచ్చారు.

ఐదు రోజులు కష్టపడితే ఐదేళ్ల అభివృద్ధికి బాటలు



అనకాపల్లి , అక్టోబర్ 24 (గ్లోబల్ వార్త): కూటమి అభ్యర్థులను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని మాజీ మంత్రివర్యులు, అనకాపల్లి శాసనసభ్యులు కొణతాల రామకృష్ణ కోరారు. స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో 110 వార్డులో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, గత రెండేళ్లలో కూటమి ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించి ప్రతి ఓటరును కలవాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు.విశాఖపట్నం పరిధిలోకి అనకాపల్లి విలీనం కావడం, జిల్లా కేంద్రంగా ఏర్పడిన నేపథ్యంలో నగర అభివృద్ధికి మరిన్ని అవకాశాలు ఉన్నాయని పేర్కొన్నారు. తాగునీరు, డ్రైనేజీ, రహదారులు, విద్యుత్ వంటి స్థానిక సమస్యలను గుర్తించి పరిష్కరించేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. కూటమి అభ్యర్థులు ప్రజల సూచనలు, సలహాలు తీసుకుంటూ అభివృద్ధి కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్లాలని సూచించారు.అనకాపల్లి ప్రభుత్వ ఆసుపత్రి అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేసిందని, గతంలో 17 మంది ఉన్న వైద్యుల సంఖ్య ప్రస్తుతం 47కు చేరిందని తెలిపారు. సుమారు రూ.22 కోట్లతో క్యాన్సర్ చికిత్సకు సంబంధించిన కేంద్రం అభివృద్ధి పనులు చేపట్టినట్లు పేర్కొన్నారు. విద్యారంగంలో ఉపాధ్యాయ నియామకాలు, పింఛన్లు, ఇతర సంక్షేమ కార్యక్రమాలను కూడా ప్రజలకు వివరించాలని కోరారు.జనసేన అధినేత పవన్ కళ్యాణ్ గఎ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో కూటమి ఐక్యత రాష్ట్ర అభివృద్ధికి దోహదపడుతోందని అన్నారు. మూడు పార్టీల నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేసి ఎన్నికల్లో విజయం సాధించాలని పిలుపునిచ్చారు. . ఒక్క ఓటు కూడా వృథా కాకుండా కార్యకర్తలు అప్రమత్తంగా వ్యవహరించాలని అన్నారు. ఐదు రోజుల పాటు కార్యకర్తలు కష్టపడి పనిచేస్తే రాబోయే ఐదేళ్లలో ప్రజలకు అభివృద్ధి ఫలాలు అందించేందుకు అవకాశం కలుగుతుందని కొణతాల రామకృష్ణ పేర్కొన్నారు.

దేవరాపల్లిలో 100 మంది అభ్యర్థులు బరిలో 17 నామినేషన్లు తిరస్కరణ

దేవరాపల్లి , అక్టోబర్ 24 (గ్లోబల్ వార్త): దేవరాపల్లి మండలంలోని 17 మండల పరిషత్ ప్రాదేశిక స్థానాలకు గాను దాఖలైన నామినేషన్ల పరిశీలన పూర్తయిందని ఎన్నికల అధికారిణి ఎస్. మంజులవాణి శనివారం తెలిపారు.మొత్తం 117 నామినేషన్లు దాఖలు కాగా, పరిశీలన అనంతరం 100 మంది అభ్యర్థుల నామినేషన్లు చెల్లుబాటు అయ్యాయని, 17 నామినేషన్లు తిరస్కరణకు గురయ్యాయని ఆమె వెల్లడించారు.పార్టీల వారీగా చెల్లుబాటు అయిన నామినేషన్లు ఇలా ఉన్నాయి వైఎస్సార్సీపీ – 46,తెలుగుదేశం – 44,జనసేన – 6, భారతీయ జనతా పార్టీ – 1,సీపీఎం – 1, స్వతంత్రులు – 2 మొత్తం – 100. నవంబర్ 3న ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో నామినేషన్ల పరిశీలన వేగంగా పూర్తి చేశారు.తిరస్కరణకు గురైన 17 నామినేషన్లలో ఎక్కువగా ధ్రువపత్రాలు సరిగా లేకపోవడం, సంతకాలు సరిపోలకపోవడం కారణమని సమాచారం.నామినేషన్ల ఉపసంహరణకు రెండు రోజుల గడువు ఉందని, ఆ తర్వాత తుది జాబితాను ప్రకటిస్తామని అధి కారిణి తెలిపారు.

81వ డివిజన్లో పందిరి నాగమణి గెలుపు తథ్యం : బాడిత శంకర్



విజయవాడ , అక్టోబర్ 24 (గ్లోబల్ వార్త): 81 డివిజన్‌లో పోటీ చేస్తున్న పందిరి వాసు సతీమణి నాగమణి గెలుపు తథ్యమని జనసేన సెంట్రల్ ఆంధ్రజోన్ కన్వీనర్ వశ్చిమ నియోజకవర్గం ఎన్నికల సమన్వయకర్త బాడిత శంకర్ అన్నారు పందిరి నాగమణి మాట్లాడుతూ భారతీయ జనతా పార్టీ జనసేన బలపరిచిన తెలుగుదేశం అభ్యర్థి అయిన నేను. నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటానని డివిజన్లో ఉన్న సమస్యలు ఎప్పటికప్పుడు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారం దిశగా అడుగులు వేస్తానని ప్రచారంలో అడుగడుగున కూటమి అభ్యర్థులకు ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారని. ప్రత్యేకంగా 81వ డివిజన్లో నన్ను తన సొంత బిడ్డ లాగా ఆశీర్వదించి పంపుతున్నారని ఆమె అన్నారు. ఒకటో తారీకు జరిగే ఎన్నికల్లో గాజు గ్లాస్ గుర్తుకే ఓటు వేసి మేయర్ అభ్యర్థిగా వంగవీటి రాధాకృష్ణ ను గెలిపించాలని కార్పొరేటర్ గా సైకిల్ గుర్తుకు ఓటు వేసి నన్ను గెలిపించాలని ఆమె అన్నారు

వైభవంగా గౌరీ పరమేశ్వరుల ఉంజల సేవ

అనకాపల్లి , అక్టోబర్ 24 (గ్లోబల్ వార్త): గౌరీ పంచాయతన దేవస్థానం లో గౌరీ పరమేశ్వరుల 221వ ఉంజల్ సేవ కార్యక్రమం ఘనంగా జరిగినది,ఈ కార్యక్రమమునకు దేవాలయ అర్చకులు.అంపోలు గోపాల కృష్ణ శర్మ ,శేషు , వేదవిదులైన పండితులచే నిర్వహించబడినది. ఈ ఉంజల్ సేవలో కొణతాల ఈశ్వరరావు పుష్పలత దంపతులు, జస్వంత్ దేదీప్య దంపతులు,కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.అతిథులు శ్రీ గౌరీ గీత మహిళా మండలి శ్రీ సత్తెమ్మ తల్లి దేవస్థానం మహిళా మండలి, శ్రీ గౌరీ పరమేశ్వరి అమృత వర్షిని పెంతకం శెట్టి సుజాత పాల్గొన్నారు,ఈ కార్యక్రమంలో ఆలయ అధ్యక్షులు కర్రి సన్యాసినాయుడు, కార్యదర్శి బొడ్డేడ రామ సత్యనారాయణ, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొనడం జరిగింది.

స్థానిక ఎన్నికల్లో కూటమి గెలుపు ఏకపక్షమే కావాలి



కోటబొమ్మాళి , అక్టోబర్ 24 (గ్లోబల్ వార్త): స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి అభ్యర్థుల గెలుపు ఏకపక్షంగా ఉండేలా నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు పిలుపునిచ్చారు. నందిగాం, టెక్కలి మండలాలకు చెందిన ఎంపీటీసీ, జెడ్పీటీసీ అభ్యర్థులు నిమ్మాడలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో ఆయనను మర్యాదపూర్వకంగా కలిశారు. నామినేషన్ల ప్రక్రియ ముగిసిన నేపథ్యంలో ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహాలు, క్షేత్రస్థాయిలో పార్టీ పరిస్థితి, కూటమి పార్టీల మధ్య సమన్వయం తదితర అంశాలపై మంత్రి అభ్యర్థులకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా మంత్రి అచ్చెన్నాయుడు మాట్లాడుతూ.. గ్రామస్థాయిలో ప్రజలతో మమేకమవుతూ కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించాలని సూచించారు. ప్రతి నాయకుడు, కార్యకర్త సమష్టి బాధ్యతతో పనిచేస్తూ కూటమి అభ్యర్థుల విజయానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు వేగంగా ముందుకు సాగుతున్నాయని మంత్రి పేర్కొన్నారు. గత వైకాపా ప్రభుత్వ పాలనలో రాష్ట్రం ఎదుర్కొన్న సమస్యలను ప్రజలకు వివరిస్తూ, కూటమి ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి అభ్యర్థుల విజయమే లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని, క్షేత్ర స్థాయిలో ప్రజలకు అందుబాటులో ఉంటూ ఎన్నికల కార్యాచరణను సమర్థవంతంగా అమలు చేయాలని మంత్రి అచ్చెన్నా యుడు సూచించారు .నాయకులు పినకాన అజయ్ కుమార్, పి.చంద్రశేఖర్, సుబద్రమ్మ, వద్మావతి, లాడి శ్రీను తదితరులు ఉన్నారు,

చింతూరులో సీపీఎం అభ్యర్థుల నామినేషన్లు



చింతూరు , అక్టోబర్ 24 (గ్లోబల్ వార్త): పోలవరం జిల్లా చింతూరు మండలంలో స్థానిక సంస్థల ఎన్నికల సందర్భంగా సీపీఎం అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు. మండలంలో జడ్పీటీసీతో పాటు మూడు ఎంపీటీసీ స్థానాలకు పార్టీ తరఫున అభ్యర్థులు నామినేషన్లు వేసి ఎన్నికల బరిలో నిలిచారు. చింతూరు మండల జడ్పీటీసీ అభ్యర్థిగా సీపీఎం తరఫున శ్రీమతి మీడియం శ్రీదేవి నామినేషన్ దాఖలు చేశారు. ఈ సందర్భంగా బొప్పెన కిరణ్, జిల్లా కార్యదర్శి వల్లపు వెంకట్ ఆమె అభ్యర్థిత్వాన్ని బలపరచి ప్రతిపాదించారు. అలాగే తుమ్మల ఎంపీటీసీ స్థానానికి చామంతి సీపీఎం తరఫున నామినేషన్ దాఖలు చేయగా, మొట్టం రాజయ్య ఆమె అభ్యర్థిత్వాన్ని బల పరిచారు. చదలవాడ పంచాయతీ పరిధిలోని ఎంపీటీసీ స్థానానికి కట్టాం రాధా నామినేషన్ వేయగా, మడకం చిన్నయ్య ప్రతిపాదించారు. కల్లేరు ఎంపీటీసీ స్థానానికి సీసం సురేష్ నామినేషన్ దాఖలు చేయగా, సోడి రెడ్డి ఆయన అభ్యర్థిత్వాన్ని బలపరిచారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు, గిరిజన ప్రాంతాల అభివృద్ధికి కృషి చేయాలనే లక్ష్యంతో సీపీఎం అభ్యర్థులు ఎన్నికల్లో పోటీకి సిద్ధమవుతున్నారు. రానున్న ఎన్నికల్లో ప్రజల మద్దతు కూడగట్టేందుకు పార్టీ నాయకులు, కార్యకర్తలు కృషి చేయనున్నారు.

విశాఖలో కూటమి ప్రభుత్వ పర్యావరణ విధ్వంసాన్ని అడ్డుకుంటాం : వైఎస్ఆర్సీపీ మేయర్ అభ్యర్థి ఎమ్మెల్సీ వరుదు కళ్యాణి

విశాఖపట్నం , అక్టోబర్ 24 (గ్లోబల్ వార్త): విశాఖ నగరంలో కూటమి ప్రభుత్వ పర్యావరణ విధ్వంసాన్ని తీవ్రంగా అడ్డుకుంటామని వైఎస్సార్సీపీ ఎమ్మెల్సీ, మేయర్ అభ్యర్థి వరుదు కళ్యాణి స్పష్టం చేశారు. ఉదయం విశాఖపట్నంలోని సెంట్రల్ పార్క్, వైఎస్సార్ పార్కులలో ఆమె ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా పార్కుల్లో వాకింగ్‌కు వచ్చే ప్రజలను, వాకర్స్‌ను కలిసి వారి సమస్యలు, అభిప్రాయాలను నేరుగా తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వరుదు కళ్యాణి మాట్లాడుతూ.. నగరంలో విచ్చలవిడిగా సాగుతున్న భూ దోపిడీని అరికడతామని హెచ్చరించారు. రాష్ట్రంలో మళ్లీ వైఎస్సార్‌సీపీ పాలన రావాలంటే.. రాబోయే జీవీఎంసీ (+ఎవీజ) ఎన్నికల్లో మేయర్ పీఠంపై వైఎస్సార్‌సీపీ జెండా ఎగరవేయాలని ప్రజలను కోరారు. వైఎస్సార్‌సీపీ మేయర్ అభ్యర్థిగా తనను, పార్టీ కార్పొరేటర్లను గెలిపిస్తే సెంట్రల్ పార్క్‌లో వాకర్స్‌కు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పిస్తామని హామీనిచ్చారు. నగర ప్రజలకు తాగునీటి సమస్య తలెత్తకుండా శాశ్వత పరిష్కారం చూపుతామని, పారిశుధ్య నిర్వహణను మెరుగుపరచడానికి ప్రత్యేక కృషి చేస్తామని తెలిపారు. అలాగే ప్రతి పార్కులోనూ ఆధునిక వాకింగ్ ట్రాక్‌లను ఏర్పాటు చేస్తామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపీ గొల్ల బాబురావు, పార్టీ నాయకులు పేర్ల విజయ్ చంద్ర, అల్లంపల్లి రాజబాబు, రవిరాజు, ముప్పల సురేష్‌తో పాటు పలువురు కార్పొరేటర్ అభ్యర్థులు పాల్గొన్నారు. వీరిలో 29వ వార్డు అభ్యర్థి పళ్ళా దుర్గారావు, 39వ వార్డు అభ్యర్థి దొడ్డి బాపు ఆనంద్, 43వ వార్డు అభ్యర్థి పెన్నిట్ల రేణుక రాజారెడ్డి తదితరులు ఉత్సాహంగా ప్రచారంలో పాల్గొని ప్రజలను ఓట్లు అభ్యర్థించారు.

విజయవాడ అభివృద్ధికి అనుభవజ్ఞుడైన నాయకత్వం అవసరం



విజయవాడ , అక్టోబర్ 24 (గ్లోబల్ వార్త): నగర సమగ్ర అభివృద్ధి పారదర్శకమైన ప్రజా పరిపాలన కోసం స్వతంత్ర మేయర్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న మాజీ ఐపీఎస్ అధికారి ఏబీ వెంకటేశ్వరరావుకు సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నట్లు ఇండియా ఇండిపెండెంట్ చర్చి డయాసిస్ నేషనల్ చైర్మన్ ఇండియన్ బిలీవర్స్ పార్టీ (ఐబీపీ) జాతీయ అధ్యక్షుడు ఆర్చ్‌బిషప్ హేరి సెబాస్టియన్ తెలిపారు. విజయవాడ లోని పెజ్జోని పేట పప్పుల మిల్లు సెంటర్ బస్‌స్టాప్ సమీపంలో ఆయన ఈ మేరకు తన అభిప్రాయాలను వెల్లడించారు. మాజీ ఐపీఎస్ అధికారిగా ఏబీ వెంకటేశ్వర రావుకు ఉన్న పరిపాలనా అనుభవం విద్యార్థులు క్రమశిక్షణ ప్రజా సమస్యలపై అవగాహన నగర అభివృద్ధికి ఉపయోగపడతాయని విశ్వాసం వ్యక్తం చేశారు. గతంలో ఆయన నిర్వహించిన ప్రజాసేవా కార్యక్రమాలు సమాజం పట్ల ఆయనకున్న బాధ్యత ఆదర్శప్రాయమని పేర్కొన్నారు. క్రైస్తవ సమాజం డయాసిస్ ఐబీపీ పార్టీ తరఫున ఆయనకు మద్దతు తెలియజేస్తున్నట్లు చెప్పారు. విజయవాడను పరిశుభ్రమైన సురక్షితమైన ఆధునిక నగరంగా తీర్చిదిద్దేందుకు సమర్థవంతమైన నాయకత్వం అవసరమన్నారు. నగరంలోని రహదారులు వీధులు కాలనీలను పరిశుభ్రంగా ఉంచేందుకు పారిశుద్ధ్య వ్యవస్థను బలోపేతం చేయాలని సూచించారు. భూగర్భ డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపరిచి మురుగునీటి సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలని వర్షపు నీరు రోడ్లపై నిలిచిపోకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. ట్రాఫిక్ సమస్యల పరిష్కారానికి వాహనాల రద్దీ తగ్గించేందుకు ప్రత్యేక ప్రణాళికలు రూపొందించాలని అన్నారు. పార్కింగ్ సదుపాయాలు కల్పించడంతోపాటు పాదచారుల భద్రతకు ప్రాధాన్యమివ్వాలని సూచించారు. యువతకు ఉపాధి అవకాశాలు పెంచేందుకు నైపుణ్య శిక్షణ స్వయం ఉపాధి కార్యక్రమాలను ప్రోత్సహించాలని నిరుద్యోగులకు పోటీ పరీక్షల కోసం ఉచిత శిక్షణ అందించేలా కృషి చేయాలని పేర్కొన్నారు.

క్రీడల అభివృద్ధికి నగరంలో తగిన మైదానాలు వాకింగ్ ట్రాక్‌లు ఏర్పాటు చేయాలని కోరారు. కులం మతం ప్రాంతం అనే తేడాలు లేకుండా ప్రతి పౌరుడికి సమాన గౌరవం న్యాయం ప్రభుత్వ సేవలు అందేలా పాలన సాగాలని ఆశాభావం వ్యక్తం చేశారు. విజయవాడ ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా నగర అభివృద్ధికి ఏబీ వెంకటేశ్వరరావు కృషి చేస్తారని విశ్వసిస్తున్నట్లు ఆర్చ్‌బిషప్ హేరి సెబాస్టియన్ తెలిపారు...

జిలేటిన్ స్టిక్స్ పేలి ఘోర ప్రమాదం

ఐదుగురు దుర్మరణం



అల్లూరి జిల్లా , అక్టోబర్ 24 (గ్లోబల్ వార్త): జిలేటిన్ స్టిక్స్ అకస్మాత్తుగా పేలిన ఘటనలో ఐదుగురు అక్కడికక్కడే దుర్మరణం చెందిన ఘోర దుర్ఘటన చోటుచేసుకుంది. అనంతగిరి మండలం పినకోట పంచాయతీ పీచు మామిడి సమీపంలో ఈ ఘటన స్థానికంగా తీవ్ర విషాదాన్ని నింపింది. ఈ ఘటన టిప్పర్ లారీలో పేలుడు పదార్థాలు ఎక్కించి తరలిస్తుండగా అందులో ప్రయాణిస్తున్న పాఠశాల ఉపాధ్యాయురాలు సునీత (విశాఖ)కార్మికుడు మణి (దేవరపల్లి) నారాయణరావు (చీడికాడ)పవన్ కుమార్ (కడప)తో పాటు డ్రైవర్ మృతి చెందారు. రోడ్డు నిర్మాణం కోసం కొండను తొలిచేటందుకు ఉపయోగించే జిలేటిన్ స్టిక్స్ ఒక్కసారిగా వెళ్లడంతో ఐదుగురు తీవ్ర గాయపాలై అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. పేలుడు తీవ్రతకు చుట్టుపక్కల ప్రాంతాలు అల్లలాడిపోయింది . సమాచారం అందుకున్న పోలీసులు, రెస్క్యూ బృందాలు ఘటన స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పేలుడుకు గల ఖచ్చితమైన కారణాలు, అక్కడ అనుమతులు ఉన్నాయా లేదా అనే కోణంలో పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. ప్రమాద వార్త తెలిసిన వెంటనే స్థానిక అధికారులు, ప్రజాప్రతినిధులు ఘటన స్థలాన్ని పరిశీలించి బాధితుల కుటుంబాలకు సంతాపం తెలిపారు. బాధితుల కుటుంబాలకు తగిన న్యాయం చేయాలని స్థానికులు కోరుతున్నారు.

అక్రమ మద్యం పట్టివేత..ఇద్దరు అరెస్టు

కవిటి , అక్టోబర్ 24 (గ్లోబల్ వార్త): కవిటి మండలాల్లో శనివారం ఎక్సైజ్ అధికారులు నిర్వహించిన దాడుల్లో ఇద్దరిని అరెస్టు చేసి, మద్యం సీసాలు, బీరు టిన్నులను స్వాధీనం చేసుకున్నారు. ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ సీఐ పీడీ ప్రసాద్ ఆధ్వర్యంలో ఏఈఎస్ టాస్క్‌ఫోర్స్ బృందం నిర్వహించిన దాడుల్లో ఒకరి వద్ద 10 మద్యం సీసాలు, మొబైల్ పెట్రోలింగ్ బృందం తనిఖీల్లో మరో వ్యక్తి వద్ద ఎనిమిది ఒడిశా బీరు టిన్నులు పట్టుబడ్డాయి. నిందితులను అరెస్టు చేసి, కేసులపై దర్యాప్తు చేస్తున్నట్లు అధికారులు తెలిపారు.ఒడిశా మద్యం, ఎన్డీపీఎల్ మద్యం, ఇతర మత్తు పదార్థాల అక్రమ రవాణా, విక్రయాలపై నిరంతరం నిఘా కొన సాగిస్తున్నట్లు సీఐ పేర్కొన్నారు. అక్రమ మద్యం విక్రయాలకు సంబంధించిన సమాచారం ఉంటే టోల్‌ఫ్రీ నంబర్ 14405కు తెలియజేయాలని ప్రజలను కోరారు.



బాధిత కుటుంబాలకు కోటి పరిహారం, ఉద్యోగం ఇవ్వాలి : వైఎస్సార్సీపీ



దేవరాపల్లి , అక్టోబర్ 24 (గ్లోబల్ వార్త): అనంతగిరి మండలం పినకోట పంచాయతీ పరిధిలోని పీసు మామిడి వద్ద జరిగిన జిలెటిన్ పేలుడులో ఏడుగురు మృతి చెందడం పట్ల వైఎస్సార్సీపీ నాయకులు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.శనివారం ఉదయం రహదారి పనులు జరుగుతుండగా డీజిల్ నింపుతున్న సమయంలో జిలెటిన్ స్టిక్స్ పేలి ఈ ప్రమాదం జరిగింది.

ఈ ఘటనలో ఇద్దరు వాహన చోదకులు, నలుగురు కూలీలు, పాఠశాలకు వెళ్తున్న ఉపాధ్యాయురాలు సునీత మృతి చెందారు. బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అండగా నిలవాలని వైఎస్సార్సీపీ నాయకులు కె.వి. రమణ డిమాండ్ చేశారు.మృతి చెందిన ప్రతి కుటుంబానికి కోటి రూపాయల పరిహారం చెల్లించాలి.ప్రతి కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలి.గాయపడిన వారికి మెరుగైన వైద్యం అందించాలి.ఏజెన్సీ ప్రాంతాల్లో పేలుడు పదార్థాల వాడకంలో భద్రతా ప్రమాణాలు పాటించేలా చర్యలు తీసుకోవాలి. బాధిత కుటుంబాలను ప్రభుత్వం వెంటనే ఆదుకోకపోతే ఆందోళన చేపడతామని ఆయన హెచ్చరించారు.

కార్పొరేషన్ ఎన్నికలకు దక్షిణ వైసీపీ వ్యూహరచన



విశాఖపట్నం , అక్టోబర్ 24 (గ్లోబల్ వార్త): దక్షిణ వైసీపీ సమన్వయ కమిటీ సమావేశం ఆశీలమెట్ట కార్యాలయంలో ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వైసీపీ మేయర్ అభ్యర్థి వరుదు కళ్యాణి హాజరై సమావేశాన్ని ఉద్దేశించి ప్రసంగించారు. ఈ సందర్భంగా వరుదు కళ్యాణి మాట్లాడుతూ "దక్షిణ నియోజకవర్గం లో వాసుపల్లి గణేష్ కుమార్ నాయకత్వంపై పార్టీకి పూర్తి నమ్మకం ఉంది. ఆయన నాయకత్వం తిరుగులేనిది. అభ్యర్థులందరూ కచ్చితంగా గెలుపు దిశగా అడుగులు వేయాలి" అని సూచించారు. "కూటమి ప్రభుత్వం చేసిన అక్రమాలు, అన్యాయాలపై ప్రజలకు వివరించాలి. వైఎస్ జగన్మోహన్ రెడ్డి అందించిన సుపరిపాలనను, సంక్షేమ పాలనను క్షేతస్థాయిలో ప్రజల్లోకి తీసుకువెళ్లాల్సిన బాధ్యత ప్రతి అభ్యర్థిపై ఉంది. ఓటర్లను ప్రభావితం చేసే విధంగా వైసీపీ ప్రభుత్వంలో చేసిన మంచి పనులను వివరించి, ప్రస్తుతం ప్రభుత్వంలో జరుగుతున్న అరాచక పాలనను ప్రజల్లోకి తీసుకువెళ్లాలి. కచ్చితంగా వైసీపీ జెండా ఎగురవేస్తాం. మేయర్ స్థానంలో మీతో పాటు నగర అభివృద్ధికి బాటలు వేయడానికి నేను సిద్ధంగా ఉన్నాను" అని పిలుపునిచ్చారు.

జగన్ అండగా ఉన్నారు..వాసుపల్లి

మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్ మాట్లాడుతూ "మనకు అండగా వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఉన్నారు. కూటమి అరాచకాలకు భయపడే ప్రసక్తే లేదు. నూటికి నూరు శాతం కార్పొరేషన్ ఎన్నికల పోరుకు మనం సిద్ధంగా ఉన్నాం" అని స్పష్టం చేశారు. ''దక్షిణ నియోజకవర్గంలో అభ్యర్థులందరూ ఎంతో ఉత్సాహంగా ప్రచారం చేస్తున్నారు. ప్రతి ఇంటిని, ప్రతి ఓటరును కలవాలి. పార్టీ ఆదేశాలకు అనుగుణంగా ఎన్నికల ప్రచారాన్ని ముమ్మరంగా జరపాలి. దక్షిణంలో భారీ మెజారిటీతో గెలుపును వైఎన్ జగన్మోహన్ రెడ్డి గారికి అందించాలి'' అని అభ్యర్థులకు దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో దక్షిణ నియోజకవర్గ వైసీపీ కార్పొరేటర్ అభ్యర్థులు సూరకాల వేణు, పీతల వాసు, దస్మాంతుల నీత, చెన్నా శైలజా జానకిరామ్, మహమ్మద్ షకీల్, పెద్దగాడా బాబ్జి, సనపల రోహిణి, ఆలుపన లక్ష్మి భవాని,కడవల నాగమణి, దొడ్డి బాపు ఆనంద్, బొర్ర విజయ్ లక్ష్మి రెడ్డి, వాసుపల్లి బంగారమ్మ, కోడిగుడ్డల పూర్ణిమ శ్రీధర్, పిన్నింట్ల రేణుక, కోనాడ పద్మ నూకాంబ , భీశెట్టి ప్రసాద్, వార్డ్ ముఖ్య నాయకులు, వార్డు అధ్యక్షులు, మహిళా విభాగం, యువజన విభాగం నాయకులు, పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

వైసీపీలోకి జనసేన సాయికృష్ణ యాదవ్

- కూటమిపాలనలో కుంటుపడిన నగరాభివృద్ధి : జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి
- ప్రజల వద్దకు పాలనను తీసుకెళ్లిన ఘనత వైసీపీదే : మేయర్ అభ్యర్థి రమేష్ గౌడ్
- పవన్‌కళ్యాణ్‌ను నమ్మి మోసపోయిన యువత : యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు సాకే చంద్రశేఖర్



అనంతపురం , అక్టోబర్ 24 (గ్లోబల్ వార్త): అనంతపురం నగరపాలక సంస్థ ఎన్నికల ప్రచారం వేడెక్కుతున్న వేళ అనంతపురం నగరంలోని ఒకటో డివిజన్‌కు చెందిన జనసేన సాయికృష్ణ యాదవ్ తన మిత్రబృందంతో కలిసి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. వైసీపీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి, మేయర్ అభ్యర్థి రమేష్ గౌడ్ ఆయనకు పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. కార్యక్రమంలో పార్టీ సీనియర్ నేత అనంత చంద్రారెడ్డి, నగర అధ్యక్షులు చింతా సోమశేఖరరెడ్డి, యువజన విభాగం జిల్లా అధ్యక్షులు సాకే చంద్ర, నాయకులు అమర్‌నాథరెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే, వైసీపీ జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి మాట్లాడుతూ 1వ డివిజన్‌కు చెందిన జనసేన నాయకులు సాయికృష్ణ ఆ పార్టీ కోసం క్రియాశీలకంగా పని చేశారని, అలాంటి వ్యక్తి వైసీపీలోకి రావడం సంతోషించదగ్గ విషయమన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో జరుగుతున్న పరిణామాలు ప్రజలందరూ గుర్తించుకోవాలన్నారు. నామినేషన్ దాఖలు చేసిన వైసీపీ శ్రేణులపై కూటమి నేతలు దాడి చేయడం సిగ్గు చేటన్నారు. ఎన్నికల ప్రచారంలో సీఎం చంద్రబాబు ఇచ్చిన హామీలు ఏమయ్యాయని ప్రశ్నించారు. ఈ నగరంలో జరుగుతున్న అధికార పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు అనుసరిస్తున్న ధోరణి, వారి అరాచకాలు, పేదల ఆస్తులను ఎలా కాజేయాలని కుట్రపన్నుతున్నారన్నారు. ఈ రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించేది వైఎస్సార్‌సీపీనే అన్నారు. గత వైసీపీ హయాంలో జరిగిన అనంత అభివృద్ధిని.. ప్రస్తుతం రెండున్నరేళ్ల కూటమి ప్రభుత్వంలో నగరాన్ని కుంటుపరిచారన్నారు. ఈ నగరంలో శాంతిభద్రతలు లోపించాయని, అభివృద్ధి జరగాలన్నా.. ప్రశాంతత వాతావరణం ఉండాలన్నా వైసీపీతోనే సాధ్యమన్నారు. జనసేన నుంచి వచ్చిన సాయికృష్ణతోపాటు ఆయన మిత్రబృందం వైసీపీ కుటుంబంలో చేరడం సంతోషించదగ్గ విషయమన్నారు. మేయర్ అభ్యర్థి రమేష్ గౌడ్ మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు గడిచినా ఎన్నికల సమయంలో ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలను పూర్తిస్థాయిలో అమలు చేయలేదని రమేష్ గౌడ్ ఆరోపించారు. కొత్త పింఛన్లు మంజూరు చేయలేదని, పేదల సమస్యలను పట్టించుకోవడం లేదని విమర్శించారు. ప్రజల వద్దకు పాలనను తీసుకెళ్లిన ఘనత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానిదేనని పేర్కొన్నారు. నగరంలో డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారిందని, రోడ్లు, పారిశుద్ధ్య పనులు సక్రమంగా సాగడం లేదని రమేష్ గౌడ్ విమర్శించారు. కూటమి ప్రభుత్వ రెండేళ్ల పాలనలో నగరాభివృద్ధి ఆశించిన స్థాయిలో జరగలేదన్నారు. నగర ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి వైసీపీ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. గతంలో అనంత వెంకటరామిరెడ్డి ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో నగరం ఎంతో అభివృద్ధి చెందిందని ఆయన పేర్కొన్నారు. కరోనా సమయంలో, వరదలు సంభవించినప్పుడు ప్రజలకు అండగా నిలిచి సేవలందించిన నాయకత్వం వైసీపీదేనన్నారు. కులమతాలకతీతంగా ఐక్యమత్యంతో ఉండే ప్రస్తుత ఎన్నికల సమయంలో ప్రజలు అప్రమత్తంగా వ్యవహరించాలని రమేష్ గౌడ్ సూచించారు. నగర ప్రజల ఆస్తులకు రక్షణ, అభివృద్ధి, మౌలిక సదుపాయాల కల్పన వంటి అంశాలను దృష్టిలో ఉంచుకుని ఓటు వేయాలని కోరారు. అనంతపురం నగర ఆత్మగౌరవాన్ని కాపాడుకోవాలంటే నగరపాలక సంస్థలోని 62 డివిజన్లలో వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను గెలిపించాలని పిలుపునిచ్చారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో ఓటు అనే ఆయుధంతో కూటమి అభ్యర్థులకు తగిన సమాధానం చెప్పాలని ప్రజలను కోరారు. వైసీపీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు సాకే చంద్రశేఖర్ మాట్లాడుతూ.. సాయికృష్ణ యాదవ్ మిత్ర బృందం జనసేన నుంచి వైసీపీలోకి రావడం సంతోషంగా ఉందన్నారు. పవన్‌కళ్యాణ్‌ను నమ్మి యువత పెద్ద ఎత్తున మోసపోయారని తెలిపారు. వైసీపీ హయాంలో సచివాలయ ఉద్యోగాలు కల్పించి వాలంటీర్లను నియమించి ప్రతి ఇంటికి సంక్షేమ పథకాలు అందించామని తెలిపారు. గత ఎన్నికల సమయంలో వాలంటీర్లకు ప్రతి నెలా రూ.10 వేలు ఇస్తామని చెప్పి చివరకు ఆ వ్యవస్థే లేకుండా చేశారన్నారు. అనంతపురం నగరంలో ఐదేళ్ల వైసీపీ పాలనలో ఎలా ఉంది? ఈ రెండున్నరేళ్ల కూటమి పాలనలో ఎలా ఉందో ప్రజలు ఆలోచించాలని కోరారు. కూటమి ప్రభుత్వం వచ్చాక అనంతపురంలో కబ్జాలు పెరిగిపోయాయని, ప్రజల ఆస్తులకు భరోసా లేకుండాపోయిందన్నారు. అధికార పార్టీ నేతలే రేషన్ దందా చేస్తున్నారని అన్నారు. వైసీపీ మేయర్ అభ్యర్థి రమేష్‌గౌడ్‌తో పాటు 1వ డివిజన్ అభ్యర్థి షెక్షా, 4వ డివిజన్ అభ్యర్థి ప్రణతిలను గెలిపించాలని కోరారు. జనసేన నుంచి వైసీపీలోకి చేరిన సాయికృష్ణ యాదవ్ మాట్లాడుతూ.. 1, 4వ డివిజన్‌ల వైసీపీ అభ్యర్థులు షెక్షావలి, ప్రణతితోపాటు మేయర్ అభ్యర్థి రమేష్ గౌడ్ గెలుపే లక్ష్యంగా తనవంతు కృషి చేస్తానన్నారు. వైసీపీ సిద్ధాంతాలు నచ్చి జనసేన వీడినట్లు చెప్పారు. వైసీపీ బలోపేతం కోసం శాయశక్తులా పని చేస్తానని తెలిపారు.

మున్సిపాలిటీ ఎన్నికల కౌంటింగ్ కేంద్రంలో పకడ్బందీగా ఏర్పాట్లు చేపట్టాలి

అనంతపురం , అక్టోబర్ 24 (గ్లోబల్ వార్త): మున్సిపాలిటీ ఎన్నికల కౌంటింగ్ కేంద్రంలో పకడ్బందీగా ఏర్పాట్లు చేపట్టాలని జిల్లా కలెక్టర్ మరియు జిల్లా ఎన్నికల అధికారి ఓ.ఆనంద్ ఆదేశించారు. శనివారం అనంతపురం నగరంలోని ఎస్.ఎస్.బి.ఎన్ డిగ్రీ కళాశాలలో మున్సిపల్ ఎన్నికల మెటీరియల్ పంపిణీ, కౌంటింగ్ కేంద్రాన్ని, స్ట్రాంగ్ రూమ్ ని జిల్లా కలెక్టర్ మరియు జిల్లా ఎన్నికల అధికారి ఓ.ఆనంద్, జిల్లా ఎస్పీ పి.జగదీష్, అసిస్టెంట్ కలెక్టర్ సుయాష్ కుమార్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మరియు జిల్లా ఎన్నికల అధికారి మాట్లాడుతూ కౌంటింగ్ కేంద్రంలో టేబుల్స్ ఏర్పాటు, బ్యారికేడింగ్ ఏర్పాటు లాంటి అన్ని రకాల చర్యలను చేపట్టాలన్నారు. నిబంధనల ప్రకారం అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలన్నారు. మెటీరియల్ పంపిణీ సమయంలో వర్షాలు పడితే ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లను చేపట్టాలన్నారు. కౌంటింగ్ కేంద్రంలో ఎన్ని టేబుల్స్ ఏర్పాటు చేస్తారు, ఎన్ని రౌండ్ల కౌంటింగ్ చేపడుతారు, రిసెప్షన్ ఏర్పాటు, తదితర అంశాలపై జిల్లా కలెక్టర్ పలు సూచనలను జారీ చేశారు. లోటుపాట్లు లేకుండా ఏర్పాట్లు ఉండాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డి.ఎస్.పి కరుణాకర్ రావు, నగరపాలక సంస్థ కమిషనర్ జస్వంత్ రావు, రిటైర్డ్ ఎస్డీసి గోవిందరాజులు, ట్రాఫిక్ సిఐ వెంకటేష్ నాయక్, తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ అసత్య ప్రచారాలు చేస్తే ప్రజా క్షేత్రంలో బట్టలిప్పుతాం : వైఎస్సార్‌సీపీ నేతల హెచ్చరిక

కాకినాడ , అక్టోబర్ 24 (గ్లోబల్ వార్త): అధికార మదంతో తెలుగుదేశం పార్టీ నేతలు చేస్తున్న దిగజారుడు రాజకీయాలను, అసత్య ఆరోపణలను ఇకపై ఉపేక్షించే ప్రసక్తే లేదని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర యువజన విభాగం జాయింట్ సెక్రెటరీ, మాజీ కార్పొరేటర్ ఎం.జి. కిషోర్ తీవ్రస్థాయిలో హెచ్చరించారు. ఆధారాలు లేకుండా వైఎస్సార్‌సీపీ నాయకులపై బురదజల్లితే ప్రజాక్షేత్రంలో బట్టలిప్పి నిలబెడతామని స్పష్టం చేశారు. కాకినాడలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కిషోర్ మాట్లాడుతూ టీడీపీ నేతలు బుకాయిస్తున్న చిట్టీడి దారా ప్రసాద్ పక్కా నేరచరిత్ర కలిగిన వ్యక్తని కిషోర్ ఆధారాలతో వెల్లడించారు. కాకినాడలో సింగిల్ నెంబర్ లాటరీ, మద్యం అక్రమ రవాణా దందాల్లో దారా ప్రసాద్‌పై నమోదైన క్రైమ్ నెంబర్లు 95/2025, 167/2025 కేసుల వివరాలను మీడియా ముందుంచారు. పార్టీ కోసం పనిచేసినందుకు స్వయంగా నారా



చంద్రబాబు నాయుడే అతనికి ప్రశంసాపత్రం అందజేసిన విషయాన్ని ఆయన గుర్తుచేశారు. 1999లో వనమాడి కొండబాబు ఎమ్మెల్యే టికెట్ కోసం తిరిగినప్పుడు ద్వారంపూడి కుటుంబం చేసిన మేలును విస్మరించి, రాజకీయ స్వార్థం కోసం పార్టీలు మారిన మల్లిపూడి వీరు లాంటి వ్యక్తులకు వైఎస్సార్‌సీపీ గురించి మాట్లాడే నైతిక హక్కు లేదని మండిపడ్డారు. నామినేటెడ్ పదవులు, ఎన్నికల లబ్ధి కోసమే టీడీపీ నేతలు అబద్ధాలు ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. గతంలో పర్లాపేట శ్మశానం భూముల అక్రమాల వ్యవహారంలో కార్పొరేషన్ సమావేశంలో ఆయన భార్య కన్నీళ్లు పెట్టుకున్న చరిత్ర ప్రజలకు తెలుసన్నారు.అధికారాన్ని అడ్డం పెట్టుకుని అడ్డగోలు విమర్శలు చేయడం కాదని, చిత్తశుద్ధి ఉంటే మాదకద్రవ్యాల వ్యవహారంపై సిట్టింగ్ జడ్జి లేదా సీబీఐతో సమగ్ర విచారణ జరిపించాలని కిషోర్ సవాల్ విసిరారు. సీబీఐ విచారణ జరిపి నిజనిర్ధారణ చేసిన తర్వాతే ఈ వ్యవహారంపై తాము స్పందిస్తామని స్పష్టం చేశారు. ఆ విచారణలో తమ నాయకుడిపై మోపిన ఆరోపణల్లో ఒక్కటి రుజువైనా శాశ్వతంగా రాజకీయాల నుంచి తప్పుకుంటామని, నిరూపించలేకపోతే టీడీపీ నేతలు ముక్కు నేలకు రాసి రాజకీయ సన్యాసం చేస్తారా అని నిలదీశారు. రానున్న కాకినాడ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో ఘోర పరాజయం తప్పదన్న భయంతోనే కూటమి నేతలు ఇటువంటి తప్పుడు ప్రచారాలకు పాల్పడుతున్నారని, నోరు అదుపులో పెట్టుకోకపోతే తీవ్ర పరిణామాలుంటాయని హెచ్చరించారు.

రక్తదాతగా పోలీస్ అధికారి..ఎంతోమందికి స్ఫూర్తి

అల్లూరి జిల్లా , అక్టోబర్ 24 (గ్లోబల్ వార్త): విధి నిర్వహణలో ప్రజల భద్రతకు ప్రాధాన్యతనిస్తూ, సామాజిక సేవలోనూ తనదైన గుర్తింపు చాటుకుంటున్నారు జీకేవీధి సర్కిల్ ఇన్స్పెక్టర్ సుధాకర్. ఇప్పటివరకు 34 సార్లు రక్తదానం చేసి మానవత్వానికి నిలువెత్తు నిదర్శనంగా నిలుస్తూ ఎంతోమందికి స్ఫూర్తిగా నిలుస్తున్నారు. రక్తదానం ద్వారా ఆపదలో ఉన్న వారికి అండగా నిలవాలనే సేవా సంకల్పంతో ఆయన సాగిస్తున్న ప్రయాణం అభినందనీయం. ప్రాణాపాయ పరిస్థితుల్లో ఉన్న రోగులకు, ప్రమాద బాధితులకు, అత్యవసర శస్త్రచికిత్సలు చేయించుకునే వారికి సకాలంలో రక్తం అందడం ఎంతో కీలకం. అలాంటి సమయంలో రక్తదాతలు అందించే సహాయం బాధిత కుటుంబాలకు ఎంతో ఊరటనిస్తుంది. రక్తదానం అనేది కేవలం ఒకరి సేవ మాత్రమే కాదు.. మరొకరి జీవితంలో వెలుగులు నింపే గొప్ప మానవతా కార్యక్రమం. ఈ విషయాన్ని గుర్తించి సీఐ సుధాకర్ 34 సార్లు రక్తదానం చేయడం విశేషం. పోలీసు అధికారిగా శాంతిభద్రతల పరిరక్షణ, ప్రజలకు రక్షణ



కల్పించడం వంటి బాధ్యతలను నిర్వహిస్తూనే, సమాజం పట్ల తనకున్న బాధ్యతను సేవా కార్యక్రమాల ద్వారా చాటుకోవడం సుధాకర్ ప్రత్యేకతగా నిలుస్తోంది. ఉద్యోగ బాధ్యతలకు అతీతంగా మానవతా విలువలకు ప్రాధాన్యతనిస్తూ రక్తదానం చేయడం ద్వారా ఇతరుల్లోనూ సేవా భావాన్ని పెంపొందించేందుకు ఆయన కృషి స్ఫూర్తిదాయకంగా నిలుస్తోంది. ప్రస్తుత సమాజంలో రక్తదానంపై మరింత అవగాహన పెరగాల్సిన అవసరం ఉంది. ముఖ్యంగా యువత రక్తదానంపై ఉన్న అపోహలను వీడి, వైద్యుల సూచనల మేరకు అర్హత కలిగిన వారు గుర్తింపు పొందిన రక్తనిధి కేంద్రాల్లో రక్తదానం చేసేందుకు ముందుకు రావాలి. రక్తదాతల సంఖ్య పెరిగితే అత్యవసర సమయాల్లో రక్తం అందుబాటులో ఉండేందుకు దోహదపడుతుంది. 34 సార్లు రక్తదానం చేసి మానవత్వాన్ని చాటుకుంటున్న జీకేవీధి సర్కిల్ ఇన్స్పెక్టర్ సుధాకర్ సేవలు మరెందరికో స్ఫూర్తిదాయకం. రక్తదానాన్ని సామాజిక బాధ్యతగా భావించి మరింతమంది ముందుకు రావాలని ఆయన సేవా ప్రయాణం చాటిచెబుతోంది. విధి నిర్వహణలోనే కాకుండా మానవసేవలోనూ ఆదర్శంగా నిలుస్తున్న ఆయనకు పలువురు అభినందనలు తెలియజేస్తున్నారు.

కాకినాడ కార్పొరేషన్ ఎన్నికలకు 17 మంది ఆర్వోల నియామకం

66 డివిజన్ల ఎన్నికల నిర్వహణకు అధికారుల నియామకం



కాకినాడ , అక్టోబర్ 24 (గ్లోబల్ వార్త): కాకినాడ నగరపాలక సంస్థ పరిధిలోని 66 డివిజన్లకు జరగనున్న కార్పొరేషన్ ఎన్నికలను సజావుగా, పారదర్శకంగా నిర్వహించేందుకు ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు 16 మంది రిటర్నింగ్ అధికారులను (ఆర్వోలు) నియమించగా, మేయర్ ఎన్నిక నిర్వహణకు ప్రత్యేకంగా మరో ఆర్వోను నియమించారు. దీంతో మొత్తం 17 మంది ఆర్వోలు ఎన్నికల విధులు నిర్వహించనున్నారు. ఈ మేరకు ఎన్నికల నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లపై అధికారులకు దిశానిర్దేశం చేసినట్లు కాకినాడ నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.వి.వి. సత్యనారాయణ తెలిపారు. శనివారం కాకినాడ నగరపాలక సంస్థ కార్యాలయంలోని తన ఛాంబర్‌లో కాకినాడ జిల్లాలోని వివిధ మండలాలకు చెందిన తహసీల్దార్లను కార్పొరేషన్ ఎన్నికల నిర్వహణకు రిటర్నింగ్ అధికారులుగా నియమించిన అనంతరం కమిషనర్ వారి తో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్నికల విధివిధానాలు, అధికారుల బాధ్యతలు, ఎన్నికల నియమావళి అమలు తదితర అంశాలపై వివరించారు. ఎన్నికల నిర్వహణకు సంబంధించిన నిబంధనలతో కూడిన హ్యాండ్‌బుక్‌ను అధికారులకు అందజేశారు.

కాకినాడ నగరపాలక సంస్థ పరిధిలోని 66 డివిజన్ల ఓటర్ల జాబితా, పోలింగ్ కేంద్రాల వివరాలను అక్టోబర్ 24న ముసాయిదా రూపంలో ప్రచురించనున్నట్లు కమిషనర్ వెల్లడించారు. ఈ జాబితాలపై అభ్యంతరాలు, అభ్యర్థనలు ఉంటే అక్టోబర్ 27న సమర్పించవచ్చని తెలిపారు. వాటిని పరిశీలించిన అనంతరం అక్టోబర్ 28న తుది ఓటర్ల జాబితా, పోలింగ్ కేంద్రాల వివరాలను ప్రచురించనున్నట్లు పేర్కొన్నారు.

ఎన్నికల సంఘం నిర్దేశించిన మార్గదర్శకాలను ఖచ్చితంగా పాటిస్తూ, ఎన్నికల ప్రక్రియను నిర్దిష్ట గడువులోగా పూర్తి చేయాలని కమిషనర్ అధికారులకు సూచించారు. ఓటర్ల జాబితాల ప్రచురణ, అభ్యంతరాల స్వీకరణ, పోలింగ్ కేంద్రాలకు సంబంధించిన ఏర్పాట్లలో అప్రమత్తంగా వ్యవహరించాలని తెలిపారు. ఎన్నికల నిర్వహణలో ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా సమన్వయంతో విధులు నిర్వహించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో అదనపు కమిషనర్ కె.టి. సుధాకర్, డిప్యూటీ కమిషనర్ కె. శ్రీనివాస్, డీసీపీ కె.వి. కృష్ణారావు, మేనేజర్ శిరీష్ కుమార్, సూపరింటెండెంట్ సీతారాం తదితరులు పాల్గొన్నారు.

ప్రజలు కూటమి అభ్యర్థులనే గెలిపించాలి



విజయనగరం , అక్టోబర్ 24 (గ్లోబల్ వార్త): రాష్ట్ర వ్యాప్తంగా జరుగుతున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజలు తమ సంపూర్ణ మద్దతు కూటమి అభ్యర్థులకు అందించాలని ఏపీ లోక్ సత్తా రాష్ట్ర అధ్యక్షుడు భీశెట్టి బాబ్జి కోరారు శనివారం జామి లో విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా గ్రామీణ, పట్టణ ప్రాంతాలు అభివృద్ధి చెందాలంటే తప్పనిసరిగా స్థిరమైన ప్రభుత్వం అవసరం ఉందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మున్సిపాలిటీ, కార్పొరేషన్ ఎన్నికల్లో చైర్మన్, మేయర్ అభ్యర్థులను ప్రత్యక్ష ఎన్నికల ద్వారా ఎన్నుకునే విధానం పెట్టడం మంచి పరిణామమని భీశెట్టి అన్నారు త్వరగా ఎన్నికలు పూర్తి అయితే కేంద్ర ప్రభుత్వం నుండి నిధులు రాష్ట్రానికి వస్తాయని రాష్ట్రంలో స్థిరమైన ప్రభుత్వం ఉండి గ్రామీణ పట్టణ ప్రాంతాలు అభివృద్ధి చెందాలనే ఉద్దేశం తో కూటమి ప్రభుత్వానికి లోక్ సత్తా అధినేత డాక్టర్ జయప్రకాశ్ నారాయణ్ మద్దతు ప్రకటించారని అన్నారు. కొఠియా లో ప్రశాంతంగా ఎన్నికలు జరగాలి వివాదాస్పద ఒడిశా, ఆంధ్రప్రదేశ్ సరిహద్దు గ్రామా లయిన కొఠియా తో పాటుగా ఇతర గిరిజన పంచాయతీ గ్రామల్లో గిరిజనులు ఆంధ్రప్రదేశ్ లో జరుగుతున్న స్థానిక ఎన్నికల్లో పాల్గొంటామని చెపుతుంటే ఒడిశా ప్రభుత్వం అక్కడ రాజకీయ పార్టీలు గిరిజనులపై దాడి చెయ్యడాన్ని లోక్ సత్తా నుండి తీవ్రంగా ఖండిస్తున్నామని గిరిజనులు తమ ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించు కునేలా గిరిజన సంక్షేమశాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి, రాష్ట్ర ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని భీశెట్టి కోరారు.

ఈ-వ్యర్థాలపై విద్యార్థులు, గ్రామస్తులకు అవగాహన ర్యాలీ



కవిటి , అక్టోబర్ 24 (గ్లోబల్ వార్త): పాడైపోయిన, వినియోగంలో లేని ఎలక్ట్రానిక్ వస్తువులను ఎక్కడపడితే అక్కడ పడేయకుండా, నిర్దేశించిన ఈ-వ్యర్థాల సేకరణ కేంద్రాలకు అప్పగించాలని పీవైజీ పుట్టుగ పాఠశాల ఆధ్వర్యంలో నిర్వహించిన అవగాహన ర్యాలీలో విద్యార్థులు, గ్రామస్తులకు సూచించారు. ఈ-వ్యర్థాల నిర్వహణపై ప్రజల్లో చైతన్యం కల్పించేందుకు చేపట్టిన ఈ కార్యక్రమంలో విద్యార్థులు గ్రామంలో ర్యాలీ నిర్వహించి, పర్యావరణ పరిరక్షణ ఆవశ్యకతను వివరిం చారు. పాడైపోయిన మొబైల్ ఫోన్లు, బ్యాటరీలు, ఇతర ఎలక్ట్రానిక్ వస్తువులను సాధారణ చెత్తతో కలపకుండా ప్రత్యేకంగా సేకరించి, ఈ-వ్యర్థాల సేకరణ కేంద్రాలకు అందజేయాలని అవగాహన కల్పించారు. వీటిని రోడ్ల పక్కన, ఖాళీ ప్రదేశాల్లో లేదా నీటి వనరుల సమీపంలో పడేయడం వల్ల వాటిలోని హానికర రసాయ నాలు నేలలోకి, నీటిలోకి చేరి పర్యావరణాన్ని కలుషితం చేసే ప్రమాదం ఉందని ప్రధానో పాధ్యాయుడు దేవదాస్ వివరించారు. ఇంటి వద్ద నిరుప యోగంగా ఉన్న ఎలక్ట్రానిక్ వస్తువుల ను బాధ్యతాయుతంగా పారవేయడం ప్రతి ఒక్కరి బాధ్యత అని విద్యార్థ లు, గ్రామస్తులకు తెలియజేశారు. ఈ కార్యక్ర మంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు దేవ దాస్, ఉపాధ్యాయురాలు జ్యోతి, పాఠశాల కమిటీ చైర్మన్ చంపా, ఎస్ఎంసీ సభ్యులు పాల్గొన్నారు.

జడ్పిటిసి / ఎంపిటిసి ఎన్నికల కౌంటింగ్ కేంద్రంలో ఏర్పాట్లు పటిష్టంగా ఉండాలి

జిల్లా కలెక్టర్ మరియు జిల్లా ఎన్నికల అధికారి ఓ.ఆనంద్



అనంతపురం , అక్టోబర్ 24 (గ్లోబల్ వార్త): జడ్పిటిసి / ఎంపిటిసి ఎన్నికల కౌంటింగ్ కేంద్రంలో ఏర్పాట్లు పటిష్టంగా ఉండాలని జిల్లా కలెక్టర్ మరియు జిల్లా ఎన్నికల అధికారి ఓ.ఆనంద్ ఆదేశించారు. శనివారం అనంతపురం నగరంలోని జేఎన్టీయూ కళాశాలలో జడ్పిటిసి / ఎంపిటిసి ఎన్నికల కౌంటింగ్ కేంద్రాన్ని, స్ట్రాంగ్ రూమ్ ని జిల్లా కలెక్టర్ మరియు జిల్లా ఎన్నికల అధికారి ఓ.ఆనంద్, జిల్లా ఎస్పీ పి.జగదీష్, అసిస్టెంట్ కలెక్టర్ సుయాష్ కుమార్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మ్యాప్ ద్వారా కళాశాలలో ఎన్ని గదులు ఉన్నాయి, ఎక్కడెక్కడ కౌంటింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు, స్ట్రాంగ్ రూమ్ ఎక్కడ ఏర్పాటు చేశారు, తదితర వివరాలు ఆరా తీశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మరియు జిల్లా ఎన్నికల అధికారి మాట్లాడుతూ స్ట్రాంగ్ రూములలో సిసిటీవీ కెమెరాలను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. అక్కడి నుంచి ఫీడ్ కంట్రోల్ రూమ్ కి ఇవ్వాలన్నారు. కౌంటింగ్ కేంద్రం వద్ద పటిష్టమైన పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయాలన్నారు. కౌంటింగ్ కేంద్రంలో అవసరమైన అన్ని రకాల ఏర్పాట్లను చేపట్టాలని, అవసరమైతే అదనపు సిబ్బందిని నియమించాలన్నారు. కౌంటింగ్ కేంద్రం వద్ద బ్యారీకేడింగ్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లను పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డి.ఎస్.పి కరుణాకర్ రావు, డిడిఓ శకుంతల, తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికలకి 'గ్రేటర్ విశాఖ'.. సర్వం సిద్ధం!..జాబితా ఖరారు

విశాఖపట్నం , అక్టోబర్ 24 (గ్లోబల్ వార్త): గ్రేటర్ విశాఖపట్నం మున్సిపల్ కార్పొరేషన్ (జీవీఎంసీ) ఎన్నికల నిర్వహణకు అధికార యంత్రాంగం సర్వం సిద్ధం చేసింది. ఎన్నికల కసరత్తులో భాగంగా జోన్ల వారీగా ఓటర్ల జాబితాతో పాటు పోలింగ్ కేంద్రాల వివరాలను అధికారులు ఖరారు చేశారు.?జీవీఎంసీ పరిధిలోని మొత్తం 10 జోన్లలో ఉన్న 120 వార్డుల్లో దాదాపు 18 లక్షల 40 వేల మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. ఇందుకోసం నగరవ్యాప్తంగా 1,990 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నారు. ఎన్నికల ప్రక్రియను సజావుగా నిర్వహించేందుకు 14,328 మంది పోలింగ్ సిబ్బందిని నియమించేలా ప్రణాళికలు సిద్ధం చేశారు. అత్యధికంగా గాజువాక (జోన్-7) పరిధిలో 2.98 లక్షల మంది ఓటర్లు ఉండగా, అత్యల్పంగా భీమిలి (జోన్-1) పరిధిలో 66 వేల మంది ఓటర్లు ఉన్నారు. ?జోన్ల వారీగా వార్డులు, ఓటర్ల వివరాలు ఇలా.. జోన్ 1 (భీమిలి): 5 వార్డులు । 78 పోలింగ్ కేంద్రాలు । 66,446 మంది ఓటర్లు , జోన్ 2 (మధురవాడ): 7 వార్డులు । 162 పోలింగ్ కేంద్రాలు । 1,49,452 మంది ఓటర్లు, జోన్ 3 (ఈస్ట్): 18 వార్డులు । 309 పోలింగ్ కేంద్రాలు । 2,96,124 మంది ఓటర్లు, జోన్ 4 (సౌత్): 16 వార్డులు । 249 పోలింగ్ కేంద్రాలు । 2,17,817 మంది ఓటర్లు, జోన్ 5 (నార్త్): 20 వార్డులు । 302 పోలింగ్ కేంద్రాలు । 2,91,691 మంది ఓటర్లు, జోన్ 6 (వెస్ట్): 17 వార్డులు । 245 పోలింగ్ కేంద్రాలు । 2,14,094 మంది ఓటర్లు , జోన్ 7 (గాజువాక): 19 వార్డులు । 329 పోలింగ్ కేంద్రాలు । 2,98,228 మంది ఓటర్లు, జోన్ 8 (అగనంపూడి): 5 వార్డులు । 76 పోలింగ్ కేంద్రాలు । 69,796 మంది ఓటర్లు

పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా ఓపెన్ హౌస్..ఆయుధాల ప్రదర్శన



విశాఖపట్నం , అక్టోబర్ 24 (గ్లోబల్ వార్త): పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాలు - 2026 లో భాగంగా నగర పోలీస్ కమిషనర్ డా. శంఖబ్రత బాగ్చి, ఐ.పి.ఎస్., ఆదేశాలతో పోలీసు ఓపెన్ హౌస్ ఆయుధాల ప్రదర్శన కార్యక్రమం ప్రారంభించారు. నగరంలోని అన్ని పోలీస్ స్టేషన్లలో మరియు ఏఆర్ పోలీసు పరేడ్ గ్రౌండ్ నందు ఓపెన్ హౌస్ కార్యక్రమాన్ని నిర్వహించి, పోలీసు వ్యవస్థ పనితీరు గురించి, పోలీసులు తమ దైనందిన విధుల్లో వినియోగించే వివిధ రకాల ఆయుధాలు, పరికరాల గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. డాగ్ స్క్వాడ్, బాంబు డిటెక్షన్ స్క్వాడ్ విభాగం, కమ్యూనికేషన్ విభాగము, ఫింగర్ ప్రింట్స్ మరియు క్లూస్ టీంలు ప్రత్యేక స్టాల్ ను ఏర్పాటు చేసి ప్రదర్శన చేశారు. పోలీసు అధికారుల పర్యవేక్షణలో అల్లర్ల సమయంలో గుంపుని ఏ విధంగా చెదరగొట్టేది విద్యార్థులకు వివరించి, బాష్ప వాయువు ఏ విధంగా ప్రయోగిస్తారో ప్రత్యక్షంగా వజ్రా వాహనం ద్వారా ప్రయోగించి చూపించారు. ఓపెన్ హౌస్ ప్రదర్శనకు విచ్చేసిన విద్యార్థులు పోలీసుల ఆయుధాలు, సాంకేతికత, విధులు తెలుసుకొని తమ విజ్ఞానాన్ని పెంచుకున్నారని వారి ఉపాధ్యాయులు పేర్కొంటూ కార్యక్రమం నిర్వహించిన సీపీ కి తమ కృతజ్ఞతలు తెలియజేసారు

కవిటిలో జోరుగా ఎంపీటీసీ నామినేషన్ల పర్వం



కవిటి , అక్టోబర్ 24 (గ్లోబల్ వార్త): కవిటి మండలంలో ఎంపీటీసీ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ చివరి రోజైన జోరుగా సాగింది. మండలంలోని 22 ఎంపీటీసీ స్థానాలకు వివిధ రాజకీయ పార్టీల అభ్యర్థులు, స్వతంత్ర అభ్యర్థులు పోటాపోటీగా నామినేషన్లు దాఖలు చేశారు. చివరి రోజు ఒక్కటే 67 నామినేషన్లు దాఖలు కావడంతో మండలంలో రాజకీయ సందడి నెలకొంది. ఇప్పటివరకు మొత్తం 119 నామినేషన్లు దాఖలయ్యాయి.ఎన్నికల రిటర్నింగ్ అధికారి సీహెచ్ చంద్రశేఖరరావు విడుదల చేసిన వివరాల ప్రకారం.. వైఎస్సార్‌సీపీ తరఫున 54, తెలుగుదేశం పార్టీ నుంచి 46, జనసేన పార్టీ తరఫున 11, స్వతంత్ర అభ్యర్థులుగా ఐదు, బీజేపీ తరఫున మూడు నామినేషన్లు దాఖలయ్యాయి. నామినేషన్ల దాఖలుకు గడువు ముగియడంతో ఆయా పార్టీల అభ్యర్థులు తమ రాజకీయ భవిష్యత్తుపై ఆశలు పెట్టుకున్నారు. 22 ఎంపీటీసీ స్థానాలకు మొత్తం 119 నామినేషన్లు రావడంతో ఎన్నికల పోటీపై ఆసక్తి నెలకొంది. నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ ప్రశాంతంగా ముగిసిందని రిటర్నింగ్ అధికారి సీహెచ్ చంద్రశేఖరరావు తెలిపారు.

ఒకటవ డివిజన్ జనసేన అభ్యర్థి చరణ్ ముమ్మర ప్రచారం



మచిలీపట్నం , అక్టోబర్ 24 (గ్లోబల్ వార్త): మచిలీపట్నం నగర పాలక సంస్థ ఒకటవ డివిజన్‌లో యువనాయకుడు, విద్యావంతుడు, జనసేన పార్టీ అభ్యర్థి వంపుగడవల గీత్‌చరణ్ (వంపుగడవల చౌదరి కుమారుడు) పోటీ చేస్తూ తనదైన శైలిలో ఇంటింటికీ తిరిగి తనకు ఓటు వేసి ఆశీర్వదించవలసిందిగా కోరుతున్నారు. బీటెక్ చదివిన చరణ్ నగరాభివృద్ధికి కృషి చేయాలనే తలంపుతో పోటీచేస్తున్నట్లుగా తెలిపారు. తనను గెలిపిస్తే ఒకటవ డివిజన్‌ను అభివృద్ధి పథం వైపు పయనించేలా కృషిచేస్తానని హామీ ఇస్తున్నారు. డివిజన్‌లో పలు సమస్యలు పరిష్కరించవలసి ఉందని, ముఖ్యంగా డ్రైనేజీ పూడిక తీయడం, నూతన డ్రైన్ల నిర్మాణం, నూతన పైప్‌లైన్‌ల ఏర్పాటు చేయవలసి ఉందన్నారు. ప్రతి వీధికి సిసి రోడ్లు నిర్మించడం, తాగునీరు ఏర్పాటు చేయడం, సరైన సమయానికి అందరికీ స్వచ్ఛమైన మంచినీరు అందించడం, ఇళ్ల ముందు చెత్తా చెదారం నిల్వ లేకుండా చర్యలు తీసుకోవడం, డివిజన్‌లో ఉన్న పార్క్‌లో ఆహ్లాదకర వాతావరణం ఏర్పాటు చేయడం, అవసరమైన చోట్ల సిమెంటు బెంచీల ఏర్పాటు, ఓపెన్ జిమ్ ఏర్పాటు, కాంతివంతమైన వీధిలైట్ల నిర్వహణ తదితర పనులు చిత్తశుద్ధితో చేపడతామని చరణ్ హామీ ఇచ్చారు.

మహిళల, మహిళా సంఘాల ఆర్థిక భద్రతకు కృషిచేస్తానన్నారు. వంపుగడవల గీత్‌చరణ్ ఒకటవ డివిజన్‌ను సస్యశ్యామలంగా తీర్చిదిద్దుతానని చేస్తున్న ప్రచారం ఆకట్టుకుంటోంది. వీరి ప్రచార సరళి జనబాహుళ్యంలో చొచ్చుకుపోతోంది. అలాగే మేయర్ అభ్యర్థి అయిన షేక్ అబ్దుల్ అబీదాను కూడా అత్యధిక మెజారిటీతో గెలిపించాలని, తాము గెలిచేలా ఆశీర్వదించాలని కోరారు. ఈ ప్రచారంలో వంపుగడవల చౌదరి, బత్తిన దాసు, రాజా హక్కుమహంతి, పిన్నింటి గణేష్, శీలం శశాంక్, శీలం నాయుడు, మాకాల ప్రసాద్, నరహరశెట్టి జగన్మోహనరావు, పల్లెం రాఘవరావు తదితరులు చరణ్‌తో కలిసి ఇంటింటి ప్రచారంలో పాల్గొన్నారు.

కృత్రిమ అవయవాల తయారీపై వర్క్‌షాప్‌లో గీతం విద్యార్థులు



భీమునిపట్నం , అక్టోబర్ 24 (గ్లోబల్ వార్త): విశాఖపట్నంలోని గీతం స్కూల్ ఆఫ్ కోర్ ఇంజనీరింగ్, బయోటెక్నాలజీ విభాగానికి చెందిన రెండు మరియు మూడేళ్ల బయోమెడికల్ ఇంజనీరింగ్ విద్యార్థులు అక్టోబర్ 23, 2026 న ఆంధ్రప్రదేశ్ మెడ్‌టెక్ జోన్ ,× లోని భారత్ లింబ్ సెంటర్‌లో ప్రోస్తటిక్స్ అండ్ ఆర్థోటిక్స్ పై నిర్వహించిన పూర్తి రోజు వర్క్‌షాప్‌లో పాల్గొన్నారు. ప్రత్యేకమైన రోగి కేస్ స్టడీ ద్వారా, విద్యార్థులు రోగిని పరీక్షించడం, కృత్రిమ అవయవాల రూపకల్పన (డిజైన్), తయారీ మరియు ఫిట్మెంట్ లపై ఆచరణాత్మక పరిజ్ఞానాన్ని పొందారు. ఉదయం కర్రల (క్రచెస్) సహాయంతో వచ్చిన ఒక రోగి, వర్క్‌షాప్ ముగిసే సమయానికి కొత్తగా అమర్చిన కృత్రిమ కాలుతో స్వతంత్రంగా నడవగలిగారు. ఈ వర్క్‌షాప్ కోసం విద్యార్థులు చెల్లించిన రిజిస్ట్రేషన్ ఫీజుల ద్వారానే ఆ రోగికి కృత్రిమ కాలు సమకూర్చబడింది. ఈ వర్క్‌షాప్ గీతంలో ఇటీవల ప్రారంభించిన 'శ్వాన్ లాబ్' లోని అభ్యాస అవకాశాలను మరింత మెరుగుపరుస్తూ, బయోమెడికల్ ఇంజనీరింగ్ విద్యను వాస్తవ ఆరోగ్య సంరక్షణ సవాళ్లతో మరియు సామాజిక ప్రభావంతో అనుసంధానించింది.

ప్రశాంత వాతావరణంలో ఎన్నికలను నిర్వహించడమే లక్ష్యం : జిల్లా ఎస్పీ



కాకినాడ , అక్టోబర్ 24 (గ్లోబల్ వార్త): జిల్లాలో స్థానిక సంస్థల ఎన్నికలను ఎటువంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా, స్వేచ్ఛాయుత, పారదర్శక వాతావరణంలో ప్రశాంతంగా నిర్వహించడమే లక్ష్యంగా పటిష్టమైన పోలీసు భద్రతా ఏర్పాట్లు చేపట్టినట్లు కాకినాడ జిల్లా ఎస్పీ జి. బిందు మాధవ్ తెలిపారు. ఎన్నికల ఏర్పాట్లను క్షేత్రస్థాయిలో పరిశీలించే క్రమంలో ఎస్పీ కాకినాడ రూరల్ మండల ప్రజా పరిషత్ కార్యాలయాన్ని సందర్శించి, ఎన్నికల నిర్వహణకు సంబంధించిన ఏర్పాట్లను సమీక్షించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ, జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలకు సంబంధించి మూడు రోజులపాటు నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ జిల్లావ్యాప్తంగా ప్రశాంతంగా ముగిసిందని, ఎక్కడా అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పటిష్టమైన పోలీసు బందోబస్తు నిర్వహించామని తెలిపారు. నేడు జిల్లాలోని 20 మండలాల్లో నామినేషన్ల పరిశీలన, ఉపసంహరణ ప్రక్రియ కొనసాగుతున్న నేపథ్యంలో ఎలాంటి అవాంతరాలు తలెత్తకుండా తగిన భద్రతా ఏర్పాట్లు చేసినట్లు పేర్కొన్నారు. రాబోయే మున్సిపల్, జడ్పీటీసీ, ఎంపీటీసీ, గ్రామ పంచాయతీ ఎన్నికల పోలింగ్, ఓట్ల లెక్కింపు ప్రక్రియలు సజావుగా జరిగేలా పోలీసు శాఖ సమగ్ర భద్రతా ప్రణాళికతో ముందుకు సాగుతోందని స్పష్టం చేశారు. రెవెన్యూ, పోలీసు శాఖల నిర్దేశిత ప్రమాణాల ఆధారంగా జిల్లాలోని సమస్యాత్మక, సున్నితమైన ప్రాంతాలను ఇప్పటికే గుర్తించామని, ఆయా ప్రాంతాల్లో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయడంతోపాటు అవసరమైన చోట అదనపు బలగాలను మోహరించి భద్రతను మరింత కట్టుదిట్టం చేస్తున్నామని తెలిపారు. ప్రజలు ఎలాంటి భయాందోళనలకు గురికాకుండా స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకునేలా అన్ని ముందస్తు చర్యలు తీసుకుంటున్నామని, ఎన్నికల నియమావళిని ఉల్లంఘించే వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటా మని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్పీ డీఎస్పీ కె.వి.వి. సత్యనారాయణ, కాకినాడ డిఎస్పీ ఎన్.ఎస్.వి.కె. దుర్గారావు, సర్పవరం సీఐ సీహెచ్. ప్రకాష్, ఎస్సైలు ఏసుబాబు, శ్రీనివాసు, ఇతర పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

రాజ్యాంగాన్ని నవ్వుల పాలు చేశారు



సామర్లకోట , అక్టోబర్ 24 (గ్లోబల్ వార్త) : ప్రజాస్వామ్య విలువలను, ప్రజల హక్కులను ప్రభుత్వం అణచివేస్తూ ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేసే విధంగా పాలన సాగిస్తోందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు తాటిపాక మధు విమర్శించారు శనివారం ఉదయం నుండి ఎన్నికల ప్రచారంలో మధు పాల్గొన్నారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా సమస్యలపై ప్రశ్నించే గొంతులను అణచివేయడం, ప్రజల అభిప్రాయాలకు విలువ ఇవ్వకపోవడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని ఆయన అన్నారు. ప్రజల సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం విఫలమవుతున్న నేపథ్యంలో స్థానిక సంస్థల ఎన్నికలు ప్రజలకు తమ అభిప్రాయాన్ని స్పష్టంగా తెలియజేసే వేదికగా మారాయని తెలిపారు. మున్సిపల్ ఎన్నికల్లో సీపీఐ అభ్యర్థులను గెలిపించి ప్రజల వాయిస్‌ను మున్సిపల్ కౌన్సిళ్లలో బలంగా వినిపించాలని తాటిపాక మధు ప్రజలకు పిలుపునిచ్చారు. కార్మికులు, రైతులు, పేదలు, మధ్యతరగతి ప్రజలు, నిరుద్యోగులు, మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలపై నిరంతరం పోరాడుతున్న సీపీఐ అభ్యర్థులకు ప్రజలు అండగా నిలవాలని కోరారు. 11 వార్డులో పోటీ చేస్తున్న సప్పా సూరిబాబు విజయం సాధించాలని ఆకాంక్షించారు స్థానిక సంస్థల్లో ప్రజా సమస్యలపై ప్రశ్నించే ప్రతిపక్షం బలంగా ఉంటేనే పాలకులపై ప్రజా ఒత్తిడి పెరుగుతుందని, ప్రజల సమస్యలకు పరిష్కారాలు లభిస్తాయని ఆయన అన్నారు. కంకి--కొడవలి గుర్తుపై ఓటు వేసి సీపీఐ అభ్యర్థులను గెలిపించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి కె బోడకొండ, జిల్లా కార్యవర్గ సభ్యులు పి సత్యనారాయణ, శాఖ రామకృష్ణ, మహిళా సమాఖ్య వర్కింగ్ ప్రెసిడెంట్ కేత అరుణ, ప్రజానాట్యమనడలి జిల్లా నాయకులు మడకల రమణ. అర్జున అడపా చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు

విద్యార్థులకు ఓపెన్ హౌస్ కార్యక్రమం నిర్వహించిన కాకినాడ జిల్లా పోలీసులు



కాకినాడ , అక్టోబర్ 24 (గ్లోబల్ వార్త): పోలీస్ అమరవీరుల వారోత్సవాల్లో భాగంగా కాకినాడ జిల్లా ఎస్పీ జి. బిందు మాధవ్, ఐపీఎస్ ఆధ్వర్యంలో శనివారం కాకినాడ జిల్లా పోలీసు పరేడ్ మైదానంలో ఓపెన్ హౌస్ ను రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. నగరంలోని పలు పాఠశాలలు, కళాశాలల విద్యార్థులకు ఓపెన్ హౌస్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ గారితో పాటు పోలీసు అధికారులు, సిబ్బంది వివిధ రకాల ఆయుధాలు, అడ్వాన్స్డ్ వెపన్స్, షార్ట్ రేంజ్, లాంగ్ రేంజ్ వెపన్స్, హానికరం కాని ఆయుధాలు, గుంపులను చెదరగొట్టేందుకు వినియోగించే స్మోక్ గన్స్, డ్రోన్ కెమెరాల వినీతరును విద్యార్థులకు వివరిం చారు. విద్యార్థులు ఆయుధాలను దగ్గరగా పరిశీలించి, కొన్నింటిని స్వయంగా చేతితో పట్టుకుని ఆనక్తి కనబరిచారు. అలాగే బాంబు డిస్పోజల్ స్క్వాడ్, డాగ్ స్క్వాడ్, ఫోరెన్సిక్ పరికరాలు, ట్రాఫిక్ పోలీసుల పరికరాలు, హ్యాండ్ హోల్డ్ మెటల్ డిటెక్టర్, డోర్ ఫ్రేమ్ మెటల్ డిటెక్టర్, రక్షణ హెల్మెట్లు, లాఠీలు, రైట్ గేర్ పరికరాలు, వజ్ర వాహనం, మహిళా పోలీస్ స్టేషన్ ప్రత్యేక దర్యాప్తు వాహనం, మొబైల్ ఫోరెన్సిక్ ల్యాబ్, రక్షక్ వాహనాలను ప్రదర్శించి, వాటి వినియోగం, విధుల నిర్వహణలో వాటి ప్రాధాన్యతను వివరించారు. పోలీసు శాఖలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, ట్రాఫిక్ లో నిత్యం ఉపయోగించే వాకీటాకీలు, వి ఎచ్ ఎఫ్ సెట్స్ మొదలగు కమ్యూనికేషన్ పరికరాలు, వివిధ విభాగాల పనితీరుపై విద్యార్థులకు అవగాహన కల్పించడం ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశం. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ (అడ్మిన్) డాక్టర్ మహంతి కిషోర్ కుమార్, ఎస్బీ డీఎస్పీ కె.వి.వి. సత్యనారాయణ, కాకినాడ సబ్ డివిజనల్ పోలీసు అధికారి ఎన్.ఎస్.వి.కె. దుర్గారావు, ఏఆర్ డీఎస్పీ వి.జి. శ్రీహరి రావు, రిజర్వ్ ఇన్స్పెక్టర్లు నరసింహమూర్తి, వెంకటరావు, పోర్ట్ సీఐ పి. సునీల్, సీసీఎస్ ఇన్స్పెక్టర్ పి.వి. త్రినాథ్, రెండో పట్టణ సీఐ ఎం. అప్పల నాయుడు, మహిళా పోలీస్ స్టేషన్ ఇన్స్పెక్టర్ టి దుర్గాప్రసాద్, ట్రాఫిక్-1 ఇన్స్పెక్టర్ ఎన్. రమేష్, ట్రాఫిక్-2 ఇన్స్పెక్టర్ డి. రామారావు, ఆర్ఎస్సైలు, ఎస్సైలు, పోలీసు సిబ్బంది, సుమారు 1,000 మంది విద్యార్థులు, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు, మీడియా ప్రతినిధులు పాల్గొన్నారు.

కాకినాడ రూరల్‌లో పిల్లి దంపతుల ఎన్నికల ప్రచారానికి శ్రీకారం



కాకినాడ , అక్టోబర్ 24 (గ్లోబల్ వార్త): కాకినాడ రూరల్ నియోజకవర్గంలో స్థానిక సంస్థల ఎన్నికల ప్రచారానికి పిల్లి దంపతులు శ్రీకారం చుట్టారు. శనివారం పి.వెంకటాపురం గ్రామంలో కూటమి తరపున తెలుగుదేశం పార్టీ నుంచి బరిలో నిలిచిన జడ్పీటీసీ అభ్యర్థిని కర్రి ఆదిలక్ష్మి, ఎంపీటీసీ-2 అభ్యర్థిని పిల్లి వరలక్ష్మిని గెలిపించాలని కోరుతూ ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కాకినాడ రూరల్ మాజీ ఎమ్మెల్యే, టీడీపీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి పిల్లి అనంతలక్ష్మి సత్యనారాయణమూర్తి దంపతులు అభ్యర్థులతో కలిసి గ్రామంలో పర్యటించి ఓటర్లను కలిశారు. ఈ సందర్భంగా కూటమి అభ్యర్థులకు మద్దతు తెలిపి, తెలుగుదేశం పార్టీ గుర్తు సైకిల్‌పై ఓటు వేసి గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. గ్రామంలో ఇంటింటికీ వెళ్లి ప్రజలతో మాట్లాడారు. స్థానిక సమస్యలను అడిగి తెలుసుకుంటూ, గ్రామాల అభివృద్ధికి కూటమి అభ్యర్థులకు అవకాశం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. స్థానిక సంస్థల్లో ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు, గ్రామాల అభివృద్ధికి కృషి చేసేందుకు తమ అభ్యర్థులు సిద్ధంగా ఉన్నారని నాయకులు పేర్కొన్నారు. ఈ ప్రచారంలో టీడీపీ నాయకులు, కూటమి కార్యకర్తలు పాల్గొని అభ్యర్థులకు మద్దతుగా ఓటర్లను అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ కన్వీనర్ మాజీ ఏఎంసీ చైర్మన్ కర్రి వెంకట్రాజు , పి వెంకటాపురం గ్రామం మాజీ సర్పంచ్ పెంకె సోమరాజు, టీడీపీ పి వెంకటాపురం గ్రామ కమిటీ అధ్యక్షుడు పిల్లి వెంకటేశ్వరరావు, బీసీ సెల్ అధ్యక్షులు కొమిరిశెట్టి నరసింగరావు, మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు కాళ్ళ శ్రీనివాస్, తెలుగు యువత ఉపాధ్యక్షులు సందీప్, వ్యవసాయ మార్కెట్ కమిటీ సభ్యురాలు గుత్తుల లక్ష్మి, వాసంశెట్టి అంజి బాబు, ట్రేడర్స్ ఉపాధ్యక్షులు రామచల్మాజి, చిల్లపల్లి గణపతి ,ఏడుకొండలు, వడమటి వీరబాబు, పెంకె శ్రీను తదితరులు పాల్గొన్నారు.

తుఫాను ముప్పు.. కాకినాడ నగరంలో ముందస్తు చర్యలు చేపట్టాలి

కమిషనర్ ఎన్.వి.వి. సత్యనారాయణ

కాకినాడ , అక్టోబర్ 24 (గ్లోబల్ వార్త): బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం తుఫానుగా బలపడే అవకాశం ఉన్న నేపథ్యంలో కాకినాడ నగరంలో ప్రజల ప్రాణ, ఆస్తి నష్టాలను నివారించేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో ముందస్తు చర్యలు చేపట్టాలని నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.వి.వి. సత్యనారాయణ ఆదేశించారు. శనివారం సాయంత్రం స్మార్ట్ సిటీ కార్యాలయంలోని సమావేశ మందిరంలో వివిధ శాఖల అధికారులతో కమిషనర్ ముందస్తు చర్యలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భారీ వర్షాలు, ఈదురుగాలుల నేపథ్యంలో లోతట్టు ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేయాలని, ముంపు ప్రమాదం ఉన్న ప్రాంతాల్లో వృద్ధులు, గర్భిణులు, దివ్యాంగులు, చంటిపిల్లలను ముందుగానే గుర్తించి అవసరమైనప్పుడు సురక్షిత ప్రాంతాలకు తరలించాలని సూచించారు కాలువలు, డ్రైనేజీల్లో అడ్డంకులను తొలగించి వర్షపు నీరు సజావుగా ప్రవహించేలా చూడాలన్నారు. చెట్లు కూలినా, రహదారులు దెబ్బతిన్నా వెంటనే పునరుద్ధరణ చర్యలు చేపట్టేందుకు సిబ్బంది, యంత్రాలను సిద్ధంగా ఉంచాలని ఆదేశించారు. తాగునీటి సరఫరాకు అంతరాయం కలగకుండా ప్రత్యామ్నాయ విద్యుత్ ఏర్పాట్లు చేసుకోవాలని, పారిశుద్ధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. పునరావాస కేంద్రాల్లో తాగునీరు, విద్యుత్, మరుగుదొడ్లు, ఆహారం వంటి సదుపాయాలను అందుబాటులో ఉంచాలని సూచించారు. అత్యవసర సేవలకు అంతరాయం కలగకుండా సంబంధిత శాఖల సిబ్బంది అప్రమత్తం గా ఉండాలని, కంట్రోల్ రూమ్‌తో సమన్వయం చేసుకుంటూ పరిస్థితులను నిరంతరం పర్యవేక్షించాలని కమిషనర్ స్పష్టం చేశారు. సమావేశంలో అదనపు కమిషనర్ కేటీ సుధాకర్, డిప్యూటీ కమిషనర్ కే. శ్రీనివాస్, అర్బన్ తాసిల్దార్ జతేంద్ర,ఎంహెచ్ఓ డాక్టర్ పృథ్వీ చరణ్, వాటర్ వర్క్స్ అధికారులు, శానిటేషన్ సూపర్‌వైజర్ రాంబాబు, శానిటేషన్ ఇన్‌స్పెక్టర్లు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

జగన్..మంగళవారం కబుర్లు మానుకోవాలి : ఎమ్మెల్యే పంతం నానాజీ



కాకినాడ , అక్టోబర్ 24 (గ్లోబల్ వార్త): కాకినాడ రూరల్ గంగరాజు నగర్ జనసేన పార్టీ కార్యాలయం లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఎమ్మెల్యే పంతం నానాజీ , మాజీ ఎమ్మెల్యే పెండెం దొరబాబు పాల్గొని వైసీపీ నాయకుడు వైఎస్ జగన్ మోహన్ రెడ్డి వ్యాఖ్యలను ఖండిస్తూ ఎమ్మెల్యే పంతం నానాజీ తీవ్ర విమర్శలు చేశారు. "రాష్ట్రంలో స్థానిక ఎన్నికల ప్రక్రియ ప్రశాంతంగా సాగుతోందని . జగన్ ఇక మంగళవారం కబుర్లు మానుకోవాలి అని,ఎన్నికలను తప్పించుకోవడానికి కోర్టులను అడ్డం పెట్టుకుని ఆరోపణలు చేస్తున్నారు. మా పార్టీ నాయకులను నామినేషన్లు వేయనివ్వడం లేదని చెబుతున్న మాటల్లో వాస్తవం లేదని.. మీ వైసీపీ పాలనలో 20 శాతం ఏకగ్రీవాలు చేయించలేదా? మా నాయకులు ఎక్కడా దౌర్జన్యాలకు పాల్పడలేదు. అభివృద్ధి పనులు జరిగిన ప్రాంతాల్లో ప్రజలు నామినేషన్లు వేస్తున్నారు. ఉప ముఖ్యమంత్రి శ్రీ పవన్ కళ్యాణ్ గారు వేయించిన రోడ్లపై నడుస్తూ ప్రజలు నామినేషన్లు వేస్తున్నారు. కడపలో సైతం మంచినీటి సౌకర్యం కల్పించి అభివృద్ధి పనులు చేపట్టిన తర్వాతే ఎన్నికలకు వెళ్తున్నాం అని, జగన్.. నువ్వు ఎన్నికల నుంచి పారిపోవాలనుకుంటే పారిపో.. కానీ మా మీద బురద చల్లాలని చూడకు. మహిళల గురించి మాట్లాడే ముందు మీ గతాన్ని గుర్తు చేసుకోండి. కాకినాడలో మీరే ఒక నాయకుడిని తయారు చేశారు. ఆ నాయకుడి వ్యవహారంపై అనేక ప్రశ్నలు తలెత్తుతున్నాయి. రాబోయే రెండు రోజుల్లో మరిన్ని విషయాలు వెలుగులోకి వస్తాయని భావిస్తున్నాం కూటమి ప్రభుత్వంపై విషప్రచారం చేయడానికి ఖర్చు చేస్తున్న డబ్బును ప్రజల కోసం వినియోగిస్తే బాగుంటుంది. 11 సీట్ల నుంచి అయినా పెరిగే అవకాశం ఉంటుందేమో ఆలోచించుకోండి.

విచారణలు జరుగుతున్న అంశాలపై వాస్తవాలు వెలుగులోకి వస్తాయి" అని ఎమ్మెల్యే పంతం నానాజీ తెలిపారు... ఈ సమావేశంలో కూటమి నాయకులు నల్లే ప్రసన్న ,దివ్యరాజ్ ,తాటికాయల వీరబాబు , పాండ్రంకి రాజు , చింతపల్లి బన్నీ ,తదితరులు పాల్గొన్నారు.

కాకినాడ నగరంలో గంజాయి, మాదకద్రవ్యాలు అరికట్టాలి



కాకినాడ , అక్టోబర్ 24 (గ్లోబల్ వార్త): కాకినాడ నగరంలో గంజాయి, మాదకద్రవ్యాలను పూర్తిస్థాయిలో అరికట్టాలని సిపిఎం కాకినాడ నగర కమిటీ డిమాండ్ చేసింది. శనివారం ఉదయం కాకినాడ సుందరయ్య భవన్ లో సిపిఎం నగర కమిటీ ఆధ్వర్యంలో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం నగర కన్వీనర్ పలివెల వీరబాబు మాట్లాడుతూ గత నాలుగు రోజులుగా కాకినాడ సిటీ ప్రస్తుత ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్యే లు ఒకరి తర్వాత ఒకరు మీడియా సమావేశాలు ఏర్పాటు చేసి ఆరోపణలు, ప్రత్యారోపణలు చేసుకోవడం నగర గౌరవాన్ని దెబ్బతీస్తుందన్నారు. వారు ఉపయోగిస్తున్న భాష, అనుచిత వ్యాఖ్యలు, వ్యక్తిత్వ హననం చేసుకునే విధంగా ఆరోపణలు మానుకోవాలని హితవు పలికారు. సమస్యల పరిష్కారం, అభివృద్ధి విషయాల్లో రాజకీయంగా, పార్లమెంటరీ భాషలో విమర్శలు చేసుకోవడంలో తప్పు లేదన్నారు. అదేవిధంగా అవినీతి విషయంలో అధికారంలో ఉన్నవారు ఏవిధంగా, ఏఏ మార్గాల్లో సంపాదించుకోవచ్చో వారిరువురి మాటల ద్వారా తెలుస్తోందన్నారు. అయితే ఇద్దరి మాటల్లో కాకినాడలో గంజాయి స్వైరవిహారం చేస్తుందని అర్థమవుతుందన్నారు. మాజీ ఎమ్మెల్యే సిబిఐ విచారణ కోరుతుండగా, ప్రస్తుత ఎమ్మెల్యే గంజాయి అరికట్టే విషయంలో రాజీలేదని ప్రకటించడం అభినందనీయమన్నారు. అయితే ఈ సందర్భంగా పోలీసు యంత్రాంగం ఏమి చేస్తుందని ప్రశ్నిస్తున్నామన్నారు. ప్రజా సంఘాల ధర్నాలు, జెన్ జి పేరుతో వస్తున్న ప్రకటనల నేపథ్యంలో విపరీతంగా బందోబస్తు ఏర్పాటు, ముందస్తు అరెస్టులు, గృహ నిర్బంధాలు చేస్తున్న పోలీసు వారు గంజాయి, మాదకద్రవ్యాలు అరికట్టే విషయంలో ఎందుకు శ్రద్ధ వహించడం లేదన్నారు. నెల్లూరు లో పెంచలయ్య అనే సిపిఎం కార్యకర్త, యువ కళాకారుడు గంజాయి మాఫియా చేతిలో హత్య గావించబడ్డాడని ఆవేదన వ్యక్తం చేశారు. కాకినాడ లో సీనియర్ జర్నలిస్టు పై జరిగిన దారుణమైన దాడి, రెల్లి వీధి యువకుడి ఘోరమైన హత్య వెనుక కూడా గంజాయి ప్రమేయం ఉందని అందరికీ తెలిసిందేనన్నారు. వివిధ సందర్భాలలో సిపిఎం కార్యకర్తలు నగరంలో పర్యటించే సందర్భాల్లో శివారు ప్రాంతాల్లో మహిళలు గంజాయి సమస్య గురించి భయభ్రాంతులకు గురవుతున్నట్లు చెబుతున్నారన్నారు. రైలు పట్టాల ప్రక్కన, ఫ్లై ఓవర్ ల క్రింద, దుమ్ములపేట, ఏటిమొగ అపార్ట్మెంట్ పరిసరాలు, తూరంగి, ఇంద్రపాలెం పరిసరాల్లో, చీకటి ప్రదేశాలు గంజాయి కేంద్రాలుగా ఉన్నాయని ప్రజలు వివిధ సందర్భాలలో చెబుతున్నారన్నారు. అటువంటి ప్రదేశాలలో వీధి దీపాలు, సిసి కెమెరా లు ఏర్పాటు చేయాలన్నారు. పోలీసు వారు రాత్రి పూట రౌండ్స్ మెయిన్ రోడ్స్ కే పరిమితం కాకుండా శివారు ప్రాంతాల్లో కూడా వెయ్యాలని కోరుతున్నామన్నారు. కాకినాడ నగరాన్ని గంజాయి రహిత నగరంగా, శాంతి నిలయంగా అభివృద్ధి చేయాలని సిపిఎం కోరుతుందన్నారు.

కాకినాడ మాఫియా డాన్ ద్వారంపూడి ఆటలు సాగనివ్వం



కాకినాడ , అక్టోబర్ 24 (గ్లోబల్ వార్త): అక్రమాలు, దందాలు, డ్రగ్స్ మాఫియాతో కాకినాడ ప్రతిష్టను దిగజార్చిన వైసీపీ మాజీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్‌రెడ్డిపై తెలుగుదేశం పార్టీ, కూటమి నాయకులు తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ప్రజల చేతిలో 56 వేలకు పైగా ఓట్ల తేడాతో చిత్తుగా ఓడినా ఆయన అహంకారం, అవినీతి బుద్ధి మారలేదని టీడీపీ నగర అధ్యక్షుడు మల్లిపూడి వీరు, టౌన్ సెక్రటరీ తుమ్మల రమేష్ ధ్వజమెత్తారు.కేరళ ఎయిర్‌పోర్టులో 3 కిలోల మాదకద్రవ్యాలతో పట్టుబడిన అంతర్జాతీయ స్మగ్లర్ రోకళ్ల సత్య వ్యవహారానికి అసలు కింగ్‌పిన్ ద్వారంపూడేనని మల్లిపూడి వీరు ఆరోపించారు. సత్య అరెస్ట్‌తో తన బండారం బయటపడుతుందనే భయంతోనే అతడిని వెనకేసుకొస్తున్నారని విమర్శించారు. గుజరాత్‌లోని ముంద్రా పోర్టులో దొరికిన వేల కోట్ల హెరాయిన్ దందా, విజయవాడ కేంద్రంగా నడిచిన 'ఆశీ ట్రేడింగ్ కంపెనీ' అక్రమ వ్యవహారాలతోనూ ద్వారంపూడికిసంబంధాలున్నాయని తుమ్మల రమేష్ ఆరోపించారు. కాకినాడను గంజాయి, డ్రగ్స్‌కు అడ్డాగామార్చారనిమండిపడ్డారు.గత ప్రభుత్వంలో పేదల ఇళ్ల స్థలాల సేకరణ పేరుతో భారీ దోపిడీకి పాల్పడ్డారని నేతలు ఆరోపించారు. నివాసానికి పనికిరాని బీచ్ రోడ్డులోని 550 ఎకరాల భూమిని ఎకరానికి రూ.25 లక్షల చొప్పున అక్రమంగా ముట్టజెప్పారని, కొండలను తవ్వి ఫిల్లింగ్ పనుల ముసుగులో ఎకరానికి మరో రూ.16 లక్షలు లూటీ చేస్తూ ఏకంగా రూ.150 కోట్ల ప్రజాధనాన్ని కొల్లగొట్టారని పేర్కొన్నారు. కూటమి హెచ్చరిక బీసీల ఎదుగుదలను జీర్ణించుకోలేక ద్వారంపూడి తరహా వారిపై పెత్తందారీ అహంకారాన్ని ప్రదర్శిస్తున్నారని, ఇకపై బీసీలను కించపరిస్తే కాకినాడ గడ్డపై తిరగనిచ్చే ప్రసక్తే లేదని తుమ్మల రమేష్ హెచ్చరించారు. గతంలో తన అక్రమాలను ప్రశ్నించిన జనసేన వీర మహిళలపై రౌడీలతో దాడులు చేయించిన చరిత్ర ఆయనదని గుర్తుచేశారు. సీఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేశ్‌లను విమర్శించే నైతిక హక్కు ద్వారంపూడికి లేదని, వెంటనే బీసీలకు, ప్రజలకు బేషరతుగా క్షమాపణ చెప్పాలని... లేనిపక్షంలో కూటమి శ్రేణుల ఆగ్రహానికి తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో శెట్టి బలిజి కార్పొరేషన్ డైరెక్టర్ ఓమి బాలాజీ, మాజీ కార్పొరేటర్ చింతలపూడి రవి, తదితరులు పాల్గొన్నారు

పోలింగ్ కేంద్రాల్లో సిబ్బందికి, ఓటర్లకు ఇబ్బందులు లేకుండా అన్ని ఏర్పాట్లు చేయాలి

అగనంపూడి జోన్‌లో డిస్ట్రిబ్యూషన్ సెంటర్, స్ట్రాంగ్ రూమ్‌లను పరిశీలించిన జీవీఎంసీ కమిషనర్, అదనపు ఎన్నికల అధికారి కేతన్ గార్గ్



విశాఖపట్నం , అక్టోబర్ 24 (గ్లోబల్ వార్త) : జీవీఎంసీ రెండవ సాధారణ ఎన్నికల నేపథ్యంలో అగనంపూడి జోన్ పరిధిలో ఎన్నికల నిర్వహణకు చేపట్టిన ఏర్పాట్లను జీవీఎంసీ కమిషనర్, అదనపు ఎన్నికల అధికారి కేతన్ గార్గ్ శనివారం అదనపు కమిషనర్ పి. నల్లనయ్య తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా 102వ వార్డు పరిధిలోని పినమడక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన ఎన్నికల సామగ్రి పంపిణీ కేంద్రం, స్ట్రాంగ్ రూమ్‌లు, 6, 7వ పోలింగ్ కేంద్రాలను సందర్శించి ఏర్పాట్లను సమీక్షించారు. ఎన్నికల నిర్వహణలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు సమన్వయంతో పనిచేయాలని కమిషనర్ సూచించారు. డిస్ట్రిబ్యూషన్ సెంటర్లు, స్ట్రాంగ్ రూమ్‌లు, పోలింగ్ కేంద్రాల్లో ఎన్నికల సిబ్బందికి అవసరమైన సౌకర్యాలు కల్పించడంతో పాటు, ఓటర్లు సులభంగా తమ ఓటు హక్కును వినియోగించు కునేలా అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని రిటర్నింగ్ అధికారులను ఆదేశించారు. పోలింగ్ కేంద్రాల్లో విద్యుత్, పారిశుద్ధ్యం, తాగునీరు, రూట్ మ్యాప్‌లు, సూచిక బోర్డుల ఏర్పాటు వంటి అంశాలను పరిశీలించారు. ఎన్నికల సామగ్రి పంపిణీ సజావుగా జరిగేలా ముందస్తు ప్రణాళిక రూపొందించాలని, స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద పటిష్ఠ భద్రత కల్పించాలని సూచించారు. పోలింగ్ కేంద్రాలకు వచ్చే ఓటర్లకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని మౌలిక సదుపాయాలు అందుబాటులో ఉంచాలని, ఎన్నికల విధుల్లో నిర్లక్ష్యానికి తావులేకుండా ప్రతి అధికారి తమ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించాలని స్పష్టం చేశారు. ఎన్నికల ప్రక్రియ ప్రశాంతంగా, పారదర్శకంగా జరిగేలా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. ఈ పర్యటనలో జోనల్ కమిషనర్ మనీషా త్రిపాఠి, రిటర్నింగ్ అధికారులు నాగేశ్వరరావు, మురళీధర్, పర్యవేక్షక ఇంజనీర్ పల్లంరాజు, సహాయక వైద్యాధికారి డాక్టర్ కిరణ్ కుమార్, కార్యనిర్వాహక ఇంజనీర్ శేఖర్, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ నారాయణ, టౌన్ ప్లానింగ్ అధికారి ప్రసాద్, ఏపీడీ దుర్గాప్రసాద్, ఇతర ఎన్నికల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

నూకాంబికాను దర్శించుకున్న దేవాదాయ శాఖ చీఫ్ ఇంజనీర్



అనకాపల్లి , అక్టోబర్ 24 (గ్లోబల్ వార్త) : నూకాంబిక అమ్మవారిని శనివారం దేవాదాయ ధర్మాదాయశాఖ చీఫ్ ఇంజనీర్ జి శేఖర్ బాబు అమ్మవారి దర్శించుకున్నారు ప్రత్యేక పూజలు నిర్వహించారు, ఆయనకు ఘనంగా స్వాగతం పలికి సత్కరించారు అమ్మవారు చిత్రపటాన్ని బహుకరించారు. దేవాలయం ముందు భాగంలో ఉన్న స్థలం సుమారు 24 సెంట్లు కొనుగోలు విషయమై దేవదాయ శాఖ చీఫ్ ఇంజనీర్ జి శేఖర్ బాబు పరిశీలించి నివేదికను ప్రభుత్వానికి సమర్పించనున్నారు.ఈ కార్యక్రమంలో దేవస్థానం చైర్మన్ పీలా నాగశ్రీను (గొల్ల బాబు),దేవస్థానం అసిస్టెంట్ కమిషనర్ బుద్ధ మహాలక్ష్మి నగేష్,ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రాంబాబు, ఏ ఈ గజపతిరావుఆలయ ధర్మకర్తలు సూరే సతీష్,దాడి రవికుమార్ పొలిమేర స్వాతి ఆనంద్, మారిశెట్టి శంకర్రావు,కాంద్రేగుల రాజారావు ,మజ్జి జానకి శ్రీనివాసరావు,కొడుకుల శ్రీకాంత్,వడ్డాది మంగ,కోనేటి సూర్యలక్ష్మి పైడిరాజు, యర్రపరపు సంతోషి కుమారినాగేష్, తదితరులు పాల్గొన్నారు

108 వార్డులో వైసీపీ విజయం ఖాయం



అనకాపల్లి , అక్టోబర్ 24 (గ్లోబల్ వార్త) : 108 వార్డులు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి బొడ్డేర ఖాయమని బుడ్డేర సరోజిని విజయం ఖాయమని వార్డు ఇంచార్జ్ బుద్దేరా శివ అన్న మాట్లాడుతూ వెళ్లిన ప్రతి చోటా ప్రజలను విశేష స్పందన లభిస్తుంది స్వాగతం పలుకుతూ హారతులు ఇస్తూ చూపిస్తున్న అభిమానం మరువలేనిది అన్నారు శనివారం: రాములు హోటల్ దాడి భోగలింగం స్కూల్ కరెంట్ ఆఫీస్ శివ నారాయణ వీధి ఖవీజీ అప్పారావు గారి వీధి ఓల్డ్ ఆంధ్రబ్యాంక్ రోడ్డు ప్రాంతాల్లో పర్యటించినట్లు తెలిపారు వార్డు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, మహిళలు మరియు పార్టీ కుటుంబ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు జగనన్న నాయకత్వం వర్ధిల్లాలి అంటూ నినాదాలు చేశారు

ప్రచార జోరు పెంచిన వైసిపి


అనకాపల్లి , అక్టోబర్ 24 (గ్లోబల్ వార్త) : 110 వ వార్డులో వైసిపి ప్రచారం మరింత పెంచింది శనివారం నరసింహారావు పేట పాత బర్మా కాలనీ లో పట్టణ వైఎస్ఆర్ సీపీ అధ్యక్షులు మందపాటి జానకి రామ రాజు ఆధ్వర్యంలో.వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి ఉగ్గిన జోష్ణ అప్పారావు ఎన్నికల ప్రచార కార్యక్రమం చేపట్టారు అనకాపల్లి నియోజకవర్గ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్త మలసాల భరత్ కుమార్ ముఖ్యఅతిథిగా పాల్గొని ఓటర్లను కలిశారు ఓట్లను అభ్యర్థించారు కరపత్రాలు అందజేశారు వైసీపీని గెలిపించాలని కోరారు కుటమి వైఫల్యాలను వివరించారు కార్యక్రమంలో.. పార్టీ నాయకులు అభిమానులు కార్యకర్తలు పాల్గొన్నారు

107వ వార్డులో కొణతాల విస్తృత ప్రచారం



అనకాపల్లి , అక్టోబర్ 24 (గ్లోబల్ వార్త) : అనకాపల్లి జీవీఎంసీ స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో మాజీ మంత్రివర్యులు, అనకాపల్లి శాసనసభ్యులు కొణతాల రామకృష్ణలి జీవీఎంసీ 107వ వార్డు ప్రచార కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా గవరపాలెంలోని అంబేద్కర్ నగర్, బోయిగూడెం ప్రాంతాల్లో కూటమి కార్పొరేటర్ అభ్యర్థి మదంశెట్టి చిన్న తల్లి నీల బాబు తో తో కలిసి ఇంటింటి ప్రచారం నిర్వహించి ప్రజలను కలుసుకున్నారు.ప్రచార కార్యక్రమంలో భాగంగా కూటమి అభ్యర్థులను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. స్థానిక ఎన్నికల్లో కూటమి అభ్యర్థులకు ప్రజలు మద్దతు తెలిపి విజయాన్ని అందించాలని కోరారు. ఈ కార్యక్రమం ద్వారా ఆయా ప్రాంతాల్లో కూటమి తరఫున ఎన్నికల ప్రచారాన్ని విస్తృతంగా నిర్వహించారు.ఈ కార్యక్రమంలో 107 వ వార్డు జనసేన పార్టీ ఇంచార్జ్ శ్రీ చేబోలు దుర్గా ప్రసాద్ గారు, మరియు కూటమి నాయకులు పాల్గొన్నారు.

విశాఖ ఉత్తర నియోజకవర్గం 61వార్డు జీవీఎంసీ ఎన్నికల ప్రచారం



విశాఖ , అక్టోబర్ 24 (గ్లోబల్ వార్త) : విశాఖ ఉత్తర నియోజవర్గం వై.యస్.ఆర్ కాంగ్రెస్ పార్టీ విశాఖ ఉత్తర నియోజకవర్గం 61వార్డులో రామన్న కోలని,అంబేద్కర్ కోలని,వాంబే కోలని,వుడా కోలని,కళింగ నగర్,రామ్ సాయి పార్లర్ వరకు జరిగిన ఎన్నికల ప్రచారంలో విశాఖపట్నం జిల్లా అధ్యక్షులు,విశాఖ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కె.కె రాజు . పాల్గొని ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి వై.యస్.ఆర్ కాంగ్రెస్ పార్టీ జీవీఎంసీ మేయర్ అభ్యర్థిని వరుదు కల్యాణి .. 61వార్డు వై.యస్.ఆర్ కాంగ్రెస్ పార్టీ కార్పొరేటర్ అభ్యర్థిని మెట్ట దమయంతి గెలిపించాలని ఓటరు మహాశయులను కోరారు.ముందుగా శ్రీశ్రీశ్రీ పైడితల్లమ్మ అమ్మవారి ఆలయంకు వెళ్లి అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో 61వార్డు సీనియర్ నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

శనివారం రాత్రికి వాయు గుండంగా బలపడనున్న అల్పపీడనం : ప్రఖర్ జైన్

విశాఖపట్నం , అక్టోబర్ 24 (గ్లోబల్ వార్త) : తూర్పుమధ్య బంగాళాఖాతంలో కేంద్రీకృతమైన సుస్పష్టమైన అల్పపీడనం శనివారం రాత్రికి వాయుగుండంగా బలపడనుందని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ప్రఖర్ జైన్ తెలిపారు. ఇది పశ్చిమ వాయవ్య దిశగా పయనిస్తూ రేపటికి తీవ్రవాయుగుండంగా అలాగే ఎల్లుండి ఉదయానికి పశ్చిమమధ్య బంగాళాఖాతంలో తుపానుగా బలపడే అవకాశం ఉందన్నారు. బుధవారం ఉదయానికి మరింత బలపడి కోస్తాంధ్ర తీరానికి సమీపంలో చేరే అవకాశం ఉందని వెల్లడించారు. మత్స్యకారులు సముద్రంలో వేటకు వెళ్ళరాదని హెచ్చరించారు. దీని ప్రభావంతో రాష్ట్రంలో రేపు, ఎల్లుండి పలు జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. మంగళ, బుధవారాల్లో చెదురుమదురుగా అత్యంత భారీ వర్షాలు, కొన్నిప్రాంతాల్లో భారీ నుంచి అతిభారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొన్నారు. కోస్తా తీరం వెంబడి గంటకు 70-90కిమీ వేగంతో బలమైన ఈదురుగాలులు వీచే అవకాశం ఉందని తెలిపారు. ప్రజలు అప్రమత్తంగా ఉండి తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఆదివారం (25-10-2026) : కృష్ణా , బాపట్ల, నెల్లూరు, రాయలసీమ జిల్లాలో అక్కడక్కడ తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. శనివారం సాయంత్రం 6 గంటల నాటికి వైఎస్సార్ కడప జిల్లా సింహాద్రిపురంలో 71.5 మిమీ, అనంతపురం జిల్లా మాలపురంలో 74.5మిమీ, అనంతపురం జిల్లా వెన్నపూసపల్లిలో 50.5మిమీ, కడప జిల్లా జంగంరెడ్డిపల్లిలో 45.1మిమీ, అనంతపురం జిల్లా మురడిలో 44.9మిమీ,అనంతపురం జిల్లా విడపనకల్లులో 43.4మిమీ, కడప జిల్లా జమ్మలమడుగు గూడెంచెరువులో 42.5మిమీ చొప్పున వర్షపాతం నమోదైందన్నారు. రాబోయే తుపాను ముప్పు నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, తగిన ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ప్రఖర్ జైన్ తెలిపారు. విపత్కర పరిస్థితుల్లో ప్రజల రక్షణ కోసం ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేసిందని, అత్యవసర సహాయం లేదా సమాచారం కోసం 112, 1070 మరియు 18004250101 టోల్ ఫ్రీ నంబర్లను సంప్రదించాలని ఆయన సూచించారు. తుపాను ప్రభావం నుంచి ప్రాణ, ఆస్తినష్టాలను నివారించడానికి ప్రతి ఒక్కరూ క్రింది జాగ్రత్తలు పాటించాలని సూచించారు. తుపానుకు ముందు ప్రజలు ఎటువంటి పుకార్లను నమ్మకుండా ప్రశాంతంగా ఉండాలని, భయపడవద్దని స్పష్టం చేశారు. మొబైల్ ఫోన్లను ఛార్జ్ చేసి ఉంచుకుంటూ విపత్తుల సంస్థ, ఆర్టీజిఎస్, ఐఎండి పంపే వాతావరణ సమాచారాన్ని గమనిస్తుండాలని సూచించారు. విలువైన పత్రాలు, సర్టిఫికెట్లను వాటర్ ప్రూఫ్ కవర్లలో భద్రపరుచుకోవడంతో పాటు, కనీసం ఒక వారానికి సరిపడా ఆహార పదార్థాలు, తాగునీరు ఉండేలా కిట్ సిద్ధం చేసుకోవాలన్నారు. ఇంటి పైకప్పు, తలుపులు- కిటికీలు సురక్షితంగా ఉన్నయో లేదో తనిఖీ చేయడం వంటి ముందస్తు చర్యలు తీసుకోవాలని తెలిపారు. తుపాను సమయంలో ఇంట్లో ఉన్నవారు ఎలక్ట్రికల్ మెయిన్ స్విచ్ ఆఫ్ చేసి, గ్యాస్ కనెక్షన్లను తొలగించి, తలుపులు, కిటికీలు గట్టిగా మూసి ఉంచాలన్నారు. ఇల్లు సురక్షితంగా లేదని భావిస్తే ముందే పునరావాస కేంద్రాలకు చేరుకోవడం మంచిదన్నారు. కేవలం కాచి చల్లార్చిన నీటిని మాత్రమే తాగాలన్నారు. ఒకవేళ ఆకస్మికంగా భవనం దెబ్బతినే సూచనలు కనిపిస్తే, బలమైన టేబుల్/బెంచ్ కింద తలదాచుకుని రక్షణ పొందాలన్నారు.వరద ముప్పు ఉన్న లోతట్టు ప్రాంతాల ప్రజలు అధికారులు సూచించిన వెంటనే ఎత్తైన, సురక్షితమైన ఆశ్రయాలకు తరలివెళ్లాలని కోరారు. ఒకవేళ తుపాను సమయంలో బయట ఉంటే, దెబ్బతిన్న లేదా పాత భవనాల్లోకి వెళ్లకూడదని; చెట్లు, హోర్డింగ్స్, విద్యుత్ స్తంభాల కింద నిలబడరాదని ఎండీ ప్రఖర్ జైన్ తెలిపారు. తుపాను తర్వాత కూడా కొన్ని జాగ్రత్తలు తప్పనిసరిగా పాటించాలన్నారు అధికారిక ప్రకటన వెలువడే వరకు షెల్టర్లను వదిలి ఇళ్లకు వెళ్లవద్దు. తెగిపడిన విద్యుత్ తీగలు, విరిగిన స్తంభాల పట్ల తీవ్ర అప్రమత్తతతో ఉండలన్నారు. నీటిలో తడిసిన లేదా దెబ్బతిన్న ఎలక్ట్రానిక్ వస్తువులను ఎలక్ట్రీషియన్ చేత తనిఖీ చేయించిన తర్వాతే ఉపయోగించాలని స్పష్టం చేశారు. మత్స్యకారులు ఎట్టి పరిస్థితుల్లోనూ సముద్రంలోకి వేటకు వెళ్లకూడదని స్పష్టం చేశారు. తమ పడవలు మరియు తెప్పలను సురక్షితమైన ప్రాంతంలో బలమైన తాడులతో గట్టిగా కట్టి సురక్షితంగా ఉంచాలని విపత్తుల నిర్వహణ సంస్థ ఎండీ ప్రఖర్ జైన్ పేర్కొన్నారు.

అనంతగిరి ప్రమాదంలో ఏడుగురు మృతి చెందడం తీవ్ర విషాదకరం

- మృతుల కుటుంబాలకు కాంట్రాక్టర్ తరపున ఒక్కొక్కరికి రూ.5 లక్షల పరిహారం, బీమా సాయం
- జిల్లా కలెక్టర్ టి. నిశాంతి అల్లూరి సీతారామరాజు జిల్లా, పాడేరు



అనంతగిరి , అక్టోబర్ 24 (గ్లోబల్ వార్త) : అనంతగిరి మండలం పినకోట పంచాయతీ పరిధిలో జరిగిన ప్రమాదంలో ఏడుగురు మృతి చెందడం అత్యంత విషాదకరమని అల్లూరి సీతారామరాజు జిల్లా కలెక్టర్ టి. నిశాంతి తెలిపారు. పినకోట పంచాయతీ పరిధిలోని పీచుమామిడి గ్రామ సమీపంలో రహదారి నిర్మాణ పనులు జరుగుతున్న ప్రాంతంలో సంభవించిన ప్రమాదంలో ఒక ఉపాధ్యాయురాలితో పాటు వాహన డ్రైవర్, కార్మికులు కలిపి మొత్తం ఏడుగురు ప్రాణాలు కోల్పోవడం తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసిందని పేర్కొన్నారు. ఈ దుర్ఘటనలో ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబాలకు జిల్లా కలెక్టర్ ప్రగాఢ సానుభూతి తెలిపారు. బాధిత కుటుంబాలను ఆదుకునేందుకు అవసరమైన చర్యలు చేపడుతున్నట్లు వెల్లడించారు. ప్రమాదంలో మృతి చెందిన ఏడుగురి కుటుంబాలకు కాంట్రాక్టర్ తరఫున ఒక్కో కుటుంబానికి రూ.5 లక్షల చొప్పున పరిహారం అందించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. దీనితో పాటు సంబంధిత నిబంధనల ప్రకారం బీమా సాయం కూడా అందేలా అవసరమైన ఏర్పాట్లు చేయనున్నట్లు జిల్లా కలెక్టర్ స్పష్టం చేశారు. మృతుల కుటుంబాలకు అండగా నిలిచి, వారికి తగిన సహాయ సహకారాలు అందించేందుకు చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ టి. నిశాంతి ఒక ప్రకటనలో తెలిపారు.

26వ డివిజన్ అభివృద్ధే లక్ష్యం : గుజ్జల అలివేలు

అనంతపురం , అక్టోబర్ 24 (గ్లోబల్ వార్త) : అనంతపురం అర్బన్ నియోజకవర్గ పరిధిలోని అనంతపురం మున్సిపల్ కార్పొరేషన్ 26వ డివిజన్ తెలుగుదేశం పార్టీ కార్పొరేటర్ అభ్యర్థి గుజ్జల అలివేలు తన డివిజన్ పరిధిలోని బుడ్డప్ప నగర్, పరిసర ప్రాంతాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. మేయర్ అభ్యర్థి అజేష్ బాబుతో కలిసి ప్రజలను కలుసుకుంటూ, కూటమి అభ్యర్థులకు తమ అమూల్యమైన ఓటు వేసి గెలిపించాలని ఆమె విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా గుజ్జల అలివేలు మాట్లాడుతూ.. 26వ డివిజన్ ప్రజలు తనపై నమ్మకంతో ఓటు వేసి గెలిపిస్తే, డివిజన్‌లో నెలకొన్న ప్రతి సమస్యపై ప్రత్యేక శ్రద్ధ చూపుతానని హామీ ఇచ్చారు.

టీవీల్లో, డిజిటల్, సోషల్ మీడియాలో ప్రకటనలకు MCMC అనుమతులు తప్పనిసరి

ఎంసీఎంసీ నోడల్ అధికారి, సమాచార పౌర సంబంధాల శాఖ డిప్యూటీ డైరెక్టర్ కె. సదారావు

విశాఖపట్నం , అక్టోబర్ 24 (గ్లోబల్ వార్త) : జీవీఎంసీ రెండో సాధారణ ఎన్నికలు-2026 నేపథ్యంలో వివిధ మాధ్యమాల ద్వారా రాజకీయ ప్రకటనలు ప్రసారం చేయడానికి ముందస్తు అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలని మీడియా సర్టిఫికేషన్ అండ్ మానిటరింగ్ కమిటీ (ఎంసీఎంసీ) నోడల్ అధికారి, సమాచార పౌర సంబంధాల శాఖ డిప్యూటీ డైరెక్టర్ కె. సదారావు స్పష్టం చేశారు. జీవీఎంసీ ప్రధాన కార్యాలయం సెల్లార్‌లోని క్యాంటీన్ సమీపంలో ఏర్పాటు చేసిన ఎంసీఎంసీ కేంద్రం, మీడియా సెంటర్ ద్వారా ఎన్నికల ప్రచారానికి సంబంధించిన అంశాలను నిరంతరం పర్యవేక్షిస్తున్నట్లు తెలిపారు. టీవీ ఛానళ్లు, కేబుల్ నెట్‌వర్క్‌లు, రేడియో, సినిమా హాళ్లు, బహిరంగ ఆడియో విజువల్ ప్రదర్శనలు, వాహనాలపై ఎల్.ఈ.డి. స్క్రీన్లు, బల్క్ ఎస్ఎంఎస్‌లు, వాయిస్ మెసేజ్‌లు, సోషల్ మీడియా తదితర మాధ్యమాల ద్వారా ప్రసారం చేసే రాజకీయ ప్రకటనలకు సంబంధిత కమిటీ నుంచి ముందస్తు అనుమతి పొందాలని పేర్కొన్నారు. రాజకీయ పార్టీలు, అభ్యర్థులు ప్రకటనల ప్రసారం లేదా ప్రదర్శనకు కనీసం మూడు రోజుల ముందుగా సంబంధిత కమిటీకి దరఖాస్తు సమర్పించి అనుమతులు పొందాలన్నారు. ప్రచారానికి సంబంధించిన వార్తాపత్రికలు, ఎలక్ట్రానిక్ మీడియాను నిరంతరం పరిశీలిస్తూ, వార్తల రూపంలో ప్రచురితమయ్యే రాజకీయ ప్రకటనలు, పెయిడ్ న్యూస్‌ను గుర్తించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు ప్రకటనలో తెలిపారు. పెయిడ్ న్యూస్‌గా గుర్తించిన సందర్భాల్లో నిబంధనల ప్రకారం సంబంధిత అభ్యర్థి ఎన్నికల వ్యయంలో ఆ ఖర్చును చేర్చేలా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. కొన్ని ఎలక్ట్రానిక్ మీడియా కేబుల్ చానెళ్లలో అనధికారికంగా ప్రకటనలు, పెయిడ్ న్యూస్ ప్రసారం చేస్తున్నట్లు ఎంసీఎంసీ గుర్తించిందని, ఆయా కేబుల్చానెళ్లకు నోటీసులు జారీ చేస్తామని, నోడల్ అధికారి ప్రకటన ద్వారా తెలిపారు..

కంచరపాలెం పోలీస్ స్టేషన్ పరిధిలో రూట్ ఫ్లాగ్ మార్చ్

కంచరపాలెం , అక్టోబర్ 24 (గ్లోబల్ వార్త) : కంచరపాలెం పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్న సమస్యాత్మక ప్రాంతాలలో పోలీసులు రూట్ ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. శాంతి భద్రతల పరిరక్షణలో భాగంగా ఊర్వశి జంక్షన్, బర్మా కాలనీ, ఎస్ ఆర్ నగర్, బాపూజీ నగర్, కప్పరాడ, రాంజీ ఎస్టేట్ ప్రాంతాలలో ఈ ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వెస్ట్ సబ్ డివిజన్ ఏసీపీ శ్రీమతి పి. ప్రదీప్తి, కంచరపాలెం సీఐ కోరాడ రామారావు, ఎస్సైలు మరియు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు. ప్రజలలో భద్రతా భావాన్ని కల్పించడం, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారిలో భయాన్ని కలిగించడం కోసం ఈ ఫ్లాగ్ మార్చ్ నిర్వహించినట్లు అధికారులు తెలిపారు.

అమిత్ షా, అశ్వినీ వైష్ణవ్‌లతో చంద్రబాబు భేటీ

ఒకటి తరువాయి

ఈ భేటీలో ప్రధానంగా రెండు అంశాలపై చర్చ జరిగింది. ఒకటి, ఆంధ్రప్రదేశ్‌ను సెమీకండక్టర్ డిజైన్, తయారీ రంగంలో దేశంలోనే అగ్రగామిగా తీర్చిదిద్దడం. రెండోది, రాష్ట్రంలో రైల్వే మౌలిక సదుపాయాలను బలోపేతం చేయడం. ఈ రెండు అంశాల్లోనూ రాష్ట్ర ప్రభుత్వానికి తమ పూర్తి మద్దతు ఉంటుందని కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్ హామీ ఇచ్చారు. సెమీకండక్టర్ రంగంలో పరిశోధన, అభివృద్ధి (=ఉణ), నైపుణ్య శిక్షణ, సామర్థ్యాల పెంపునకు ఎలక్ట్రానిక్స్, ఐటీ శాఖ ద్వారా అన్ని విధాలా సహకరిస్తామని స్పష్టం చేశారు. అలాగే, కృత్రిమ మేధ (ూ×) అభివృద్ధి, ఏఐ మౌలిక సదుపాయాల కల్పనలోనూ రాష్ట్ర ప్రభుత్వంతో కలిసి పనిచేస్తామని తెలిపారు.

పట్టాలెక్కనున్న రైల్వే ప్రాజెక్టులు

రైల్వే రంగంలో రాష్ట్రం ఎదుర్కొంటున్న సవాళ్లను, అవసరాలను ముఖ్యమంత్రి చంద్రబాబు కేంద్ర మంత్రికి సమగ్రంగా వివరించారు. రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న రైల్వే ప్రాజెక్టులను త్వరితగతిన పూర్తి చేయాలని, అవసరమైన డిటైల్డ్ ప్రాజెక్ట్ రిపోర్ట్‌లకు ఆమోదం తెలిపి నిధులు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. దీనిపై సానుకూలంగా స్పందించిన కేంద్ర మంత్రి, పలు కీలక ప్రాజెక్టులకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. ముఖ్యంగా, రాష్ట్రంలోని 9 పోర్టుల నుంచి దేశంలోని ఇతర ప్రాంతాలకు సరుకు రవాణా సౌకర్యాలను మెరుగుపరిచేందుకు అవసరమైన రైల్వే కనెక్టివిటీని పూర్తిస్థాయిలో ఏర్పాటు చేసేందుకు అంగీకారం తెలిపారు. ఈ ప్రాజెక్టులు పూర్తయితే పోర్టుల ద్వారా ఎగుమతులు, దిగుమతులు పెరిగి పారిశ్రామికాభివృద్ధికి ఊతం లభిస్తుందని సీఎం పేర్కొన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి పలు భారీ ప్రాజెక్టుల ప్రతిపాదనలను కేంద్రం దృష్టికి తీసుకెళ్లారు. విజయవాడ బైపాస్ లైన్ నిర్మాణానికి రూ.3,197 కోట్లు, కొవ్వూరు--భద్రాచలం రైల్వే ప్రాజెక్టుకు రూ.2,860 కోట్లు, ఒంగోలు--దొనకొండ రైల్వే ప్రాజెక్టుకు రూ.1,800 కోట్లు, అనకాపల్లి--కొత్తవలస బైపాస్ ప్రాజెక్టుకు రూ.2,190 కోట్ల అంచనా వ్యయంతో ప్రతిపాదనలు సిద్ధం చేసినట్లు వివరించారు. విజయవాడ బైపాస్‌లో భాగంగా కృష్ణా నదిపై రెండు కొత్త వంతెనల నిర్మాణం ఆవశ్యకతను నొక్కిచెప్పారు. అమరావతి--విశాఖపట్నం మధ్య హైస్పీడ్ రైలు కారిడార్ ఏర్పాటు చేయాలని, అలాగే విజయవాడ--ఇటార్సీ, ఖరగ్‌పూర్--విజయవాడ రైల్వే మార్గాల సామర్థ్యాన్ని పెంచేలా నాలుగు లైన్ల నిర్మాణాన్ని రెండేళ్లలో పూర్తి చేయాలని సూచించారు. అమరావతి, విశాఖపట్నంలో భారీ కోచింగ్ టెర్మినళ్ల ఏర్పాటుకు, రైల్వే పీఎస్‌యూ కార్యాలయాలను అమరావతిలో నెలకొల్పే అంశంపైనా ఈ సమావేశంలో చర్చ జరిగింది.

విశాఖ వాసులకు శుభవార్త.. కొత్త రైళ్లకు పచ్చజెండా

ప్రయాణికులకు సౌకర్యవంతమైన ప్రయాణాన్ని అందించే దిశగా ముఖ్యమంత్రి చేసిన విజ్ఞప్తులకు కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్ తక్షణమే స్పందించారు. విశాఖపట్నం నుంచి తిరుపతి మీదుగా బెంగళూరుకు స్లీపర్ సౌకర్యంతో కూడిన వందే భారత్ రైలును నడిపేందుకు ఆయన అంగీకారం తెలిపారు. దీనితో పాటు, విశాఖపట్నం--తిరుపతి మధ్య పగటిపూట సీటింగ్ సౌకర్యంతో మరో ప్రత్యేక రైలును ప్రవేశపెట్టేందుకు కూడా సమ్మతించారు. కొత్తగా నిర్మించిన కనిగిరి--విజయవాడ రైల్వే మార్గంలో ప్రయాణికుల రైలు సేవలను వెంటనే ప్రారంభించాలని సీఎం కోరారు. ముఖ్యమంత్రి వెంట ఈ సమావేశంలో కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు, ఇతర ప్రజాప్రతినిధులు ఉన్నారు. మొత్తం మీద, ఈ పర్యటన రాష్ట్ర అభివృద్ధికి కొత్త ఊపునిచ్చేలా సాగిందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఈ సమావేశంలో కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు కూడా పాల్గొన్నారు. ఈ రాత్రి ఢిల్లీలో సుప్రీంకోర్టు న్యాయమూర్తి విజయ్ బిష్ణోయ్ ఇంట జరిగే పెళ్లి వేడుకలో చంద్రబాబు పాల్గొననున్నారు. చంద్రబాబు శనివారం రాత్రి ఢిల్లీలోనే బస చేసి, ఆదివారం ఉదయం విజయవాడకు తిరిగి రానున్నారు.

ఏపీకి తుపాను గండం.. అధికారులతో చంద్రబాబు ఉన్నతస్థాయి సమీక్ష

బంగాళాఖాతంలో తుపాను ఏర్పడే అవకాశముందన్న వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అప్రమత్తమైంది. ముఖ్యమంత్రి చంద్రబాబు శనివారం ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించి, అధికార యంత్రాంగానికి కీలక ఆదేశాలు జారీ చేశారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సాయిప్రసాద్, రియల్ టైమ్ గవర్నెన్స్ సొసైటీ (ఆర్టీజీఎస్) అధికారులతో ఆయన సమావేశమై పరిస్థితిని అంచనా వేశారు. తూర్పు మధ్య బంగాళాఖాతంలో కేంద్రీకృతమైన అల్పపీడనం మరింత బలపడి వాయుగుండంగా మారింది. ఇది తుపానుగా మారే ప్రమాదం ఉందని అధికారులు సీఎంకు వివరించారు. దీని ప్రభావంతో రానున్న మంగళ, బుధవారాల్లో కోస్తాంధ్ర జిల్లాల్లో భారీ నుంచి అతిభారీ వర్షాలు పడొచ్చని అంచనా వేశారు. ఈ నేపథ్యంలో ఎలాంటి విపత్కర పరిస్థితులనైనా ఎదుర్కొనేందుకు సర్వసన్నద్ధంగా ఉండాలని చంద్రబాబు స్పష్టం చేశారు. ఈ సందర్భంగా సీఎం అధికారులకు పలు సూచనలు చేశారు. "తుపాను ప్రభావంతో తీరప్రాంతాల్లో బలమైన ఈదురుగాలులు వీచే అవకాశం ఉంది. అందువల్ల మత్స్యకారులు వేటకు సముద్రంలోకి వెళ్లకుండా తక్షణమే చర్యలు తీసుకోవాలి. ఇప్పటికే వెళ్లిన వారిని వెనక్కి రప్పించే ఏర్పాట్లు చేయాలి" అని ఆదేశించారు. తుపాను ప్రభావితమయ్యే జిల్లాల్లోని లోతట్టు ప్రాంతాల ప్రజలను ముందుగానే అప్రమత్తం చేసి, అవసరమైతే సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని సూచించారు. ప్రజలకు అత్యవసర సహాయం, సమాచారం అందించేందుకు వీలుగా ప్రతి జిల్లాలో కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేయాలని, టోల్ ఫ్రీ నంబర్లను అందుబాటులోకి తీసుకురావాలని చంద్రబాబు ఆదేశించారు. ప్రజలకు ఎప్పటికప్పుడు సమాచారం అందిస్తూ వారిలో భయాందోళనలు తొలగించాలని, అధికార యంత్రాంగం సమన్వయంతో పనిచేయాలని ఆయన దిశానిర్దేశం చేశారు.

మేనకోడలు వివాహానికి యలహంక ప్యాలెస్ ఇవ్వనని చెబుతున్నాడు.. ఇదేం చోద్యం!: సీఎం చంద్రబాబు

గొడ్డలి పార్టీ అధ్యక్షుడికి రాజకీయ విలువలే కాదు, కనీస కుటుంబ, నైతిక విలువలు కూడా లేవని ముఖ్యమంత్రి చంద్రబాబు విరుచుకుపడ్డారు. సొంత మేనకోడలి వివాహ వేడుకకు బెంగళూరులోని యలహంక ప్యాలెస్ ఇచ్చేందుకు నిరాకరించడం ఎంతవరకు సబబని, ఇదేం చోద్యమని ప్రశ్నించారు. ఆస్తిలో చెల్లెలికి భాగం ఉన్నప్పటికీ, మేనకోడలి పెళ్లిని అడ్డుకుని 'కంస మామ'గా తయారయ్యారని విమర్శించారు. ఆస్తుల కోసం కన్న తల్లిని, సొంత చెల్లిని కూడా వేధిస్తున్నారని, ఆయన ఫ్యాక్షన్ మనస్తత్వం రాష్ట్రానికి ఎంత ప్రమాదకరమో ప్రజలు అర్థం చేసుకోవాలని చంద్రబాబు హితవు పలికారు. అమరావతిలో మీడియాతో మాట్లాడిన చంద్రబాబు, ఈ మేరకు వ్యాఖ్యానించారు. "రాజకీయ ముసుగులో ఉన్న ఆ వ్యక్తి నిరంతరం అసత్యాలతో ప్రజలను నమ్మించే ప్రయత్నం చేస్తున్నారు. బెంగళూరు నుంచి వచ్చి 'హిట్ అండ్ రన్' తరహాలో ప్రభుత్వంపై బురద చల్లి వెళ్లిపోతున్నారు. రాష్ట్ర ప్రయోజనాలకు విఘాతం కలిగించడమే పనిగా పెట్టుకున్నారు" అని ధ్వజమెత్తారు. స్థానిక సంస్థల ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ ప్రశాంతంగా జరుగుతోందని ఆ పార్టీకి చెందిన మాజీ డిప్యూటీ స్పీకరే చెబుతున్నా, ఆ పార్టీ అధ్యక్షుడు మాత్రం హింస జరుగుతోందని అబద్ధాలు ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. గతంలో తమ పాలనలో 24 శాతం స్థానాలను ఏకగ్రీవం చేసుకున్న విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు. అప్పుడు రాజ్యాంగబద్ధమైన పదవిలో ఉన్న వ్యక్తి, నాటి ఎన్నికల కమిషనర్‌నే బెదిరించి, ఆయన కేంద్ర బలగాలతో భద్రత ఏర్పాటు చేసుకోవాల్సిన దుస్థితిని కల్పించారని ఆరోపించారు. ప్రస్తుతం కూటమి పాలనలో ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికలు జరుగుతున్నాయని, 28 జిల్లాల్లో 9,829 ఎంపీటీసీ స్థానాలకు 51,902... 659 జెడ్పీటీసీ స్థానాలకు 5,724 నామినేషన్లు దాఖలు కావడమే ఇందుకు నిదర్శనమని చంద్రబాబు వివరించారు. "రాజకీయాల్లో ఇలాంటి నేరస్థులను నేనెప్పుడూ చూడలేదు. క్రిమినల్స్‌ను రాజకీయాల్లోకి తెచ్చి నానా యాగీ చేస్తున్నారు. గొడ్డలి పార్టీ హింసకు ప్రేరేపిస్తుంటే, కూటమి మాత్రం శాంతిభద్రతలకు అత్యంత ప్రాధాన్యత ఇస్తుంది. హింసకు ప్రతిహింస మా విధానం కాదు, అలా అని భయపడి వెన్నుచూపే ప్రసక్తే లేదు" అని స్పష్టం చేశారు. పులివెందులలో ఎన్నడూ ప్రజాస్వామ్యం లేదని, ఎదురు మాట్లాడిన వారి గొంతు నొక్కేశారని, ఇప్పుడు రాష్ట్రంలో ప్రజాస్వామ్య వాతావరణం చూసి ఫ్రస్టేషన్‌తో కుట్రలు పన్నుతున్నారని ఆరోపించారు. వారి కుతంత్రాలతో రక్తపాతం సృష్టించే ప్రయత్నాలను సాగనివ్వబోమని హెచ్చరించారు. గొడ్డలి పార్టీ అధ్యక్షుడి చుట్టూ సీబీఐ, ఈడీ కేసులు, అక్రమాస్తులు, మద్యం కుంభకోణాలు ఉన్నాయని చంద్రబాబు పేర్కొన్నారు. ఆయన కారణంగా ఎంతోమంది అధికారులు, నేతలు జైలుకు వెళ్లారని తెలిపారు. "సొంత బాబాయిని చంపి, ఆ నేరాన్ని చెల్లెలిపై నెట్టే ప్రయత్నం చేశారు. నిందితుడిని అరెస్ట్ చేయడానికి సీబీఐ వస్తే అడ్డుకున్న వ్యక్తి, ఈరోజు విలువల గురించి, ప్రజాస్వామ్యం గురించి మాట్లాడటం విడ్డూరంగా ఉంది" అని ఎద్దేవా చేశారు. రాష్ట్ర అభివృద్ధి కోసం తాము ఎన్నికల సమయంలో కూడా సమీక్షలు నిర్వహిస్తుంటే, ఆయన మాత్రం విధ్వంసమే ధ్యేయంగా పెట్టుకున్నారని, ఇలాంటి వ్యక్తిగత కక్షలు, ఫ్యాక్షన్ మనస్తత్వం రాష్ట్రానికి అత్యంత ప్రమాదకరమని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు.

స్థానిక ఎన్నికలపై జగన్ ది 'హిట్ అండ్ రన్' ధోరణి : సీఎం చంద్రబాబు

వైసీపీ అధినేత జగన్ తీరుపై సీఎం చంద్రబాబు తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. స్థానిక సంస్థల ఎన్నికల విషయంలో జగన్ 'హిట్ అండ్ రన్' విధానాన్ని అవలంబించారని, క్రిమినల్ లిటిగెంట్‌గా వ్యవహరిస్తూ ప్రజాస్వామ్య వ్యవస్థలను నాశనం చేశారని మండిపడ్డారు. ఈ మేరకు వైసీపీ ప్రభుత్వ హయాంలో జరిగిన ఘటనలపై 'అదే హింస.. అవే అబద్దాలు.. అవే అరాచకాలు..' పేరుతో ఓ బుక్‌లెట్‌ను, సంబంధిత వీడియోలను ఆయన విడుదల చేశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ.. గత ఐదేళ్ల పాలనలో రాష్ట్రంలో శాంతిభద్రతలు పూర్తిగా క్షీణించాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఒకప్పుడు రాష్ట్రంలో నక్సల్స్, రాయలసీమలో ఫ్యాక్షన్ గొడవలు శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే, గత ప్రభుత్వ హయాంలో ఒక రాజకీయ పార్టీయే శాంతిభద్రతలకు అతిపెద్ద సమస్యగా మారిందని విమర్శించారు. వైఎస్ హయాంలో ఫ్యాక్షనిజంతో ప్రజలు భయపడితే, 2019 తర్వాత వైసీపీ పాలనలో ఎన్నికలను అపహాస్యం చేసి, పాలనను పూర్తిగా విధ్వంసం చేశారని ఆరోపించారు. స్వయానా రాష్ట్ర ఎన్నికల కమిషనర్ తన ప్రాణాలకు భయం ఉందని ఫిర్యాదు చేసే దుస్థితి ఏర్పడిందని గుర్తుచేశారు. గత ప్రభుత్వ అరాచకాలకు, విధ్వంసకర పాలనకు విసిగిపోయిన ప్రజలు 2024 ఎన్నికల్లో చారిత్రాత్మక తీర్పు ఇచ్చారని చంద్రబాబు అన్నారు. కూటమి ప్రభుత్వం రికార్డు స్థాయిలో 94 శాతం స్ట్రైక్ రేట్‌తో, 57 శాతం ఓట్లను సాధించిందని, ఇది ప్రజలు మాపై పెట్టుకున్న అపారమైన నమ్మకానికి నిదర్శనమని తెలిపారు. ప్రజల నమ్మకాన్ని వమ్ము చేయకుండా, అధికారంలోకి వచ్చిన రోజు నుంచే పనిలో నిమగ్నమయ్యామని చెప్పారు. తమ ప్రభుత్వం సంక్షేమం, అభివృద్ధి, సుపరిపాలన అనే మూడు అంశాలపై ప్రధానంగా దృష్టి సారించిందని ముఖ్యమంత్రి వివరించారు. గత పాలనలో దెబ్బతిన్న 'బ్రాండ్ ఏపీ'ని పునరుద్ధరించేందుకు కృషి చేస్తున్నామన్నారు. గతంలో తమ ప్రభుత్వ హయాంలో ఏపీ బ్రాండ్ ఇమేజ్‌తోనే రూ.22 లక్షల కోట్ల పెట్టుబడులను సాధించగలిగామని గుర్తుచేశారు. పరిశ్రమలకు వేగంగా అనుమతులు ఇవ్వడం ద్వారానే ఉపాధి కల్పన సాధ్యమవుతుందని, కేవలం ఒప్పందాలు చేసుకోవడమే కాకుండా, అవి ఉత్పత్తి దశకు వెళ్లేంత వరకూ ఫాలో అప్ చేసే పటిష్టమైన విధానాన్ని అమలు చేస్తున్నామని స్పష్టం చేశారు. ఏపీకి మళ్లీ పెట్టుబడులు వస్తున్న విషయాన్ని పొరుగు రాష్ట్రాలతో పాటు యావత్ దేశం గుర్తిస్తోందని చంద్రబాబు పేర్కొన్నారు.

పాక్ వల్లే కశ్మీరీలకు రక్షణ

ఒకటి తరువాయి

పాకిస్థాన్ ఒత్తిడి తెస్తోందని ఆయన అన్నారు. శనివారం బారాముల్లాలో నిర్వహించిన ఎన్‌సీ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. పరిష్కారంకాని కశ్మీర్ సమస్యను అంతర్జాతీయ వేదికలపై సజీవంగా ఉంచుతూ జమ్మూకశ్మీర్ ప్రజలకు పాకిస్థాన్ రక్షణగా నిలుస్తోందని వ్యాఖ్యానించారు. ఢిల్లీ ప్రభుత్వం న్యాయం చేస్తుందని ఆశించడానికి ఏమైనా కారణం ఉందా అని ప్రశ్నించారు. ప్రజలు పోరాడకపోతే అంతరించిపోయే ప్రమాదం ఉందని హెచ్చరించారు. ప్రజలు ధైర్యంగా ఉండాలని ఆయన పిలుపునిచ్చారు. 'ధైర్యంగా ఉండండి. మనం వారిని (కేంద్ర ప్రభుత్వం) ఎదుర్కొందాం. మీరు ధైర్యం కూడగట్టుకోకపోతే అంతరించిపోతారు. అప్పుడు వారు మీ పేరు, మీ గుర్తింపును పూర్తిగా చెరిపేస్తారు' అని ఫరూక్ వ్యాఖ్యానించారు. ఢిల్లీ ప్రభుత్వం మౌనంగా ఉండడానికి గల కారణాలను వివరించారు. అదే సమయంలో పాకిస్థాన్ అంతర్జాతీయ స్థాయిలో తెస్తున్న ఒత్తిడిని ఆయన ప్రస్తావించారు. 'మన పొరుగు దేశం (పాకిస్థాన్) వారిపై ఒత్తిడి కొనసాగిస్తున్నందునే వారు (కేంద్రం) ప్రస్తుతం మౌనంగా ఉన్నారు. పాకిస్థాన్ ఎక్కడికి వెళ్లినా కశ్మీర్ సమస్య ఇంకా పరిష్కారం కాలేదని చెబుతోంది. అదే మనల్ని కాపాడుతోంది' అని ఫరూక్ పేర్కొన్నారు.

ఫరూక్ వ్యాఖ్యలపై బీజేపీ ఆగ్రహం

ఫరూక్ అబ్దుల్లా వ్యాఖ్యలపై బీజేపీనేతలు శనివారం తీవ్రంగా స్పందించారు. అంతర్జాతీయ వేదికలపై పాకిస్థాన్.. కశ్మీర్ సమస్యను ప్రస్తావించడం వల్లే కశ్మీరీలకు రక్షణ లభిస్తోందని ఫరూక్ పేర్కొనడాన్ని జమ్మూకశ్మీర్ బీజేపీ అధ్యక్షుడు సత్ శర్మ తప్పుపట్టారు. ఆ వ్యాఖ్యలకు ఫరూక్ అబ్దుల్లా దేశ ప్రజలకు క్షమాపణ చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. అలాగే జమ్మూకశ్మీర్‌లో కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న విధానాలను సమర్థించారు. కశ్మీర్‌లో భద్రత, స్థిరత్వం నెలకొనడానికి అక్కడి ప్రజలు, భారత ప్రభుత్వం చేస్తున్న కృషే కారణమని పేర్కొన్నారు.

అతి తీవ్ర తుపాను : ఐఎండీ

ఒకటి తరువాయి

910 కిలోమీటర్ల దూరంలో కేంద్రీకృతమై ఉంది. ఈ వాయుగుండం తొలుత దక్షిణ దిశగా కదిలి, అక్టోబర్ 25న తీవ్ర వాయుగుండంగా బలపడనుంది. ఆ తర్వాత దిశ మార్చుకుని పశ్చిమ-వాయవ్య దిక్కుగా ప్రయాణించి మరింత శక్తిని పుంజుకోనుంది. వాతావరణ శాఖ అంచనాల ప్రకారం, ఈ వ్యవస్థ అక్టోబర్ 26 నాటికి తుపానుగా, 27 నాటికి తీవ్ర తుపానుగా, 28వ తేదీ ఉదయం నాటికి అతి తీవ్ర తుపానుగా మారుతుంది. అక్టోబర్ 28వ తేదీన ఉదయం 11:30 గంటల ప్రాంతంలో బాపట్ల-విశాఖపట్నం మధ్య తీరాన్ని దాటే అవకాశం ఉంది. ఆ సమయంలో గాలి వేగం గంటకు 115 నుంచి 125 కిలోమీటర్ల వరకు ఉండవచ్చని, గరిష్ఠంగా 140 కిలోమీటర్ల వేగానికి చేరవచ్చని అధికారులు అంచనా వేస్తున్నారు. తుపాను ఏర్పడటానికి, అది బలపడటానికి సముద్రంలో పరిస్థితులు అత్యంత అనుకూలంగా ఉన్నాయని వాతావరణ నిపుణులు విశ్లేషిస్తున్నారు. సముద్ర ఉపరితల ఉష్ణోగ్రతలు 29-30 డిగ్రీల సెల్సియస్ వరకు ఉండటం, మాడెన్-జూలియన్ ఆసిలేషన్ (వీజీం) వంటి వాతావరణ అంశాలు ఈ తుపాను తీవ్రతను పెంచేందుకు దోహదం చేస్తున్నాయి. ప్రపంచవ్యాప్తంగా ఉన్న అనేక వాతావరణ నమూనాలు (మోడల్స్) కూడా ఈ తుపాను ఏపీ తీరం వైపే వస్తుందని, అతి తీవ్రంగా మారుతుందని ఏకాభిప్రాయం వ్యక్తం చేస్తున్నాయి. కొన్ని నమూనాలు ఒడిశా లేదా తమిళనాడు వైపు సూచించినప్పటికీ, అందుకు అవకాశాలు తక్కువ అని భావిస్తున్నారు. ప్రస్తుత అంచనాల కచ్చితత్వంపై వాతావరణ శాఖ స్పందించింది. తుపాను మార్గం, తీవ్రతపై ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ, సమాచారాన్ని అందిస్తామని తెలిపింది. తీరప్రాంత ప్రజలు, మత్స్యకారులు అప్రమత్తంగా ఉండాలని, ప్రభుత్వ సూచనలను తప్పనిసరిగా పాటించాలని అధికారులు విజ్ఞప్తి చేశారు. తుపాను ప్రభావంతో భారీ వర్షాలు, బలమైన ఈదురుగాలులు, సముద్రపు అలల ఉద్ధృతి ఎక్కువగా ఉండే అవకాశం ఉందని హెచ్చరించారు.

జగన్ దిగ్భ్రాంతి

ఒకటి తరువాయి

రోడ్డు విస్తరణ పనుల కోసం రాళ్లను పగలగొట్టేందుకు బొలెరో వాహనంలో జిలెటిన్ స్టిక్స్ ఉంచారు. సమీపంలో ఉన్న టిప్పర్‌కు డీజిల్ నింపుతుండగా ప్రమాదవశాత్తు నిప్పు అంటుకుంది. ఈ మంటలు వేగంగా వ్యాపించి జిలెటిన్ స్టిక్స్ ఉన్న వాహనానికి అంటుకోవడంతో భారీ పేలుడు సంభవించింది. ఈ దుర్ఘటనలో విశాఖపట్నం నుంచి మద్దిరేబు ఎంపీపీ పాఠశాలకు వెళుతున్న ఉపాధ్యాయురాలు సునీతతో పాటు కార్మికులు మణి, నారాయణరావు, పవన్ కుమార్ మరికొందరు ప్రాణాలు కోల్పోయారు. ఈ దుర్ఘటనపై వైసీపీ అధినేత జగన్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. "ఈ ఘటనలో మృతుల కుటుంబాలకు నా ప్రగాఢ సానుభూతి. ఈ దుర్ఘటనలో కార్మికులతో పాటు ప్రభుత్వ టీచర్ సునీత కూడా మృతి చెందడం అత్యంత బాధాకరం. ఉపాధి కోసం వచ్చిన కార్మికులు, విధి నిర్వహణలో ఉన్న ఉపాధ్యాయురాలు ఇలా ఆకస్మికంగా ప్రాణాలు కోల్పోవడం తీవ్ర విషాదాన్ని మిగిల్చింది. ప్రమాదానికి గల కారణాలపై సమగ్ర విచారణ జరిపించాలి. మృతుల కుటుంబాలకు ప్రభుత్వం తగిన ఆర్థిక పరిహారం అందించాలి" అని డిమాండ్ చేశారు. ప్రమాదంపై రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత కూడా స్పందించారు. జిల్లా కలెక్టర్, ఎస్పీలతో ఫోన్‌లో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. మృతుల కుటుంబాలకు అండగా నిలవాలని, క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని అధికారులను ఆదేశించారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

షమోండా వైరస్

ఒకటి తరువాయి

షమోండా వైరస్ అంటే ఏమిటి?

షమోండా వైరస్ అనేది Peribunyaviridae కుటుంబానికి, Orthobunyavirus జాతికి చెందిన వైరస్. ఇది సింబు సెరోగ్రూప్‌లో భాగం. షామ్లెన్‌బర్గ్ వైరస్‌తో దీనికి దగ్గరి సంబంధం ఉంది. ప్రధానంగా పశువులు, గొర్రెలు, మేకలు వంటి జంతువుల్లో ఈ వైరస్ కనిపిస్తుంది. కొన్ని సందర్భాల్లో గుర్రాల్లోనూ గుర్తించారు. 1965లో నైజీరియాలోని పశువుల్లో ఈ వైరస్‌ను తొలిసారిగా గుర్తించారు. అనంతరం ఆఫ్రికాలోని పలు ప్రాంతాలతో పాటు జపాన్‌లోనూ జంతువుల్లో దీని ఉనికి నమోదైంది. ఇటీవలి కాలంలో ఐరోపాలో పశువుల్లో వైరస్ గుర్తింపు, ఫ్రాన్స్‌లో మానవ కేసు నమోదైనట్లు వచ్చిన సమాచారం శాస్త్రవేత్తల దృష్టిని ఆకర్షించింది.

ఫ్రాన్స్‌లో ఎలా గుర్తించారు?

ఫ్రాన్స్‌లోని లియోన్ నగరంలో తీవ్ర అనారోగ్యంతో చికిత్స పొందుతున్న, రోగనిరోధక శక్తి బాగా తగ్గిపోయిన వ్యక్తికి నిర్వహించిన పరీక్షల్లో షమోండా వైరస్ ఉన్నట్లు గుర్తించినట్లు కథనం తెలిపింది. బాధితుడికి అప్పటికే ఇతర ఆరోగ్య సమస్యలు, నాడీ వ్యవస్థకు సంబంధించిన ఇబ్బందులు ఉన్నట్లు సమాచారం. వైరస్ సంక్రమణకు, రోగి మరణానికి మధ్య ప్రత్యక్ష సంబంధం ఉందా? అనే అంశంపై పూర్తి నిర్ధారణ రావాల్సి ఉంది. షమోండా వైరస్ సాధారణంగా జబశ్రీఅఓశీఅఒవం జాతికి చెందిన చిన్న కొరికే ఈగల ద్వారా జంతువుల మధ్య వ్యాపిస్తుందని భావిస్తున్నారు. సోకిన జంతువును కుట్టిన కీటకం మరో జంతువును కుట్టినప్పుడు వైరస్ సంక్రమించే అవకాశం ఉంటుంది. మనిషికి కూడా కీటకం కాటు ద్వారా వైరస్ సోకి ఉండవచ్చని భావిస్తున్నప్పటికీ, దీనిపై మరింత పరిశోధన అవసరం. పశువుల్లో వైరస్ సంక్రమణతో జ్వరం, నీరసం, విరేచనాలు, ఆకలి తగ్గడం, పాల ఉత్పత్తి తగ్గడం వంటి లక్షణాలు కనిపించవచ్చు. కొన్ని సందర్భాల్లో గర్భస్రావాలు, పుట్టబోయే పిల్లల్లో అభివృద్ధి సమస్యలు తలెత్తవచ్చు. అయితే, జంతువుల్లో కనిపించే లక్షణాల ఆధారంగా మనుషుల్లోనూ అవే సమస్యలు వస్తాయని చెప్పలేం.

మనుషుల్లో ఎలాంటి లక్షణాలు?

మానవ సంక్రమణకు సంబంధించిన సమాచారం ప్రస్తుతం పరిమితంగానే ఉంది. ఫ్రాన్స్‌లో నమోదైన కేసులో బాధితుడు తీవ్ర అనారోగ్యంతో ఉండటంతో పాటు నాడీ సంబంధిత సమస్యలు ఎదుర్కొన్నట్లు సమాచారం. ఒక్క కేసు ఆధారంగా వైరస్ సోకిన ప్రతి ఒక్కరికీ ఇలాంటి లక్షణాలు వస్తాయని నిర్ధారించలేం. మరిన్ని వైద్య పరిశీలనలు, ప్రయోగశాల పరీక్షల ద్వారా వైరస్ ప్రభావంపై స్పష్టత వచ్చే అవకాశం ఉంది. షమోండా వైరస్ మనుషుల నుంచి మనుషులకు నేరుగా వ్యాపిస్తుందని నిర్ధారించే ఆధారాలు ప్రస్తుతం లేవు. ఫ్రాన్స్‌లో ఒక్క మానవ కేసు నమోదవడం మాత్రమే మానవుల మధ్య వ్యాప్తి జరుగుతోందని నిరూపించదు. వైరస్ సంక్రమణ మార్గం, ఇతర మానవ కేసుల ఉనికి, జన్యుపరమైన మార్పులపై పరిశోధనలు అవసరం. ఐరోపాలోని పలు ప్రాంతాల్లో పశువుల్లో షమోండా వైరస్ గుర్తించినట్లు కథనం పేర్కొంది. ఫ్రాన్స్‌లోనూ పశువులు, గొర్రెలు, గుర్రాల్లో వైరస్ ఉనికి నమోదైనట్లు సమాచారం. అయితే, జంతువుల్లో వైరస్ విస్తరించడం వల్ల మనుషుల్లోనూ పెద్దఎత్తున వ్యాధి వ్యాపిస్తుందని భావించలేం. జంతువులు, మనుషులు, పర్యావరణం మధ్య సంబంధాలను పరిగణనలోకి తీసుకుని నిఘా కొనసాగించడం అవసరం.

చికిత్స, టీకాలు ఉన్నాయా?

షమోండా వైరస్ కోసం ప్రత్యేకంగా ఆమోదించిన మానవ టీకా లేదా నిర్దిష్ట చికిత్స అందుబాటులో ఉందని నిర్ధారించే సమాచారం ప్రస్తుతం స్పష్టంగా లేదు. వైరస్ సోకిందని అనుమానం వచ్చినా, కీటకం కాటు తర్వాత అనారోగ్యం కలిగినా వైద్యులను సంప్రదించాలి. వైద్యుల సూచన లేకుండా సొంతంగా మందులు వాడకూడదు. బయటకు వెళ్లేటప్పుడు చేతులు, కాళ్లు కప్పే దుస్తులు ధరించాలి. అవసరమైనప్పుడు సూచనల ప్రకారం కీటక వికర్షకాలను ఉపయోగించాలి. కీటకాలు ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో తగిన రక్షణ చర్యలు తీసుకోవాలి. పశువుల్లో అసాధారణ లక్షణాలు కనిపిస్తే పశువైద్యులను సంప్రదించాలి. జ్వరం లేదా ఇతర తీవ్రమైన లక్షణాలు కనిపిస్తే వైద్య సలహా తీసుకోవాలి. అధికారిక ఆరోగ్య శాఖల సూచనలను అనుసరించాలి. అందోళన కంటే అప్రమత్తత ముఖ్యం షమోండా వైరస్ మానవ సంక్రమణపై మరింత సమాచారం అవసరం. ప్రస్తుతం అందుబాటులో ఉన్న ఆధారాలతో మహమ్మారి ముప్పు ఉందని చెప్పలేం. అలాగే, ఫ్రాన్స్‌లో మరణించిన వ్యక్తి మరణానికి వైరస్ ఒక్కటే కారణమని నిర్ధారించలేం. వైరస్ వ్యాప్తి మార్గాలు, మానవ ఆరోగ్యంపై ప్రభావం, భవిష్యత్తులో కొత్త కేసులు నమోదయ్యే అవకాశాలపై పరిశోధనలు కీలకం. ప్రజలు ధృవీకరించిన సమాచారాన్నే విశ్వసిస్తూ సాధారణ కీటక నివారణ చర్యలు పాటించడం మంచిది.

PRINTED, PUBLISHED AND OWNED DONDLAVAGU BHAVYA,
ARUNODAYA OFFSET PRINTERS"#33-5-9, PAPAIAH STREET, SEETHARAMPURAM, VIJAYAWADA"PH: 0866-2431422, 9346504777
"E-MAIL: ARUNODAYAVJW@GMAIL.COM . EDITOR DONDLAVAGU BHAVYA. 08562-461571 APTEL/2026/A2902